www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఈ వేసవి భగభగ!

తీవ్ర వడగాలులు, అత్యధిక ఉష్ణోగ్రతలకు చాన్స్
పసిఫిక్ మహాసముద్రంలో తీవ్ర దశకు ఎల్‌నినో
ఏప్రిల్ తర్వాత ఎల్‌నినో బలహీనం
నైరుతి రుతుపవనాలపై నిపుణుల భిన్నాభిప్రాయాలు
సెప్టెంబరు నాటికి లానినా అభివృద్ధి

12



సోమవారం | 5-2-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 291 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: దశమి సా. 5.26 తదుపరి ఏకాదశి; నక్షత్రం: అనూరాధ ఉ. 7.55 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ. 1.26-3.01; దుర్ముహూర్తం: మ. 12.52-1.38, మ. 3.08-3.53; అమృతఘడియలు: రా. 10.54-12.29; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.09 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఓట్ల వలలు...

మాటలు చెప్పండి.. మాయలు చేయండి

ఐదేళ్లలో ఏం చేశారో అడగొద్దు.. మళ్లీ వస్తే అద్భుతాలే!

రేవులు, పరిశ్రమలతో రాష్ట్ర ఆదాయం పెంచేస్తారట
ఇంటింటికీ వెళ్లి చెప్పాలని వలంటీర్లకు 'స్పెషల్ క్లాసులు'
రంగంలోకి దిగిన ఎఫ్ఓపీలు.. ఎక్కడికక్కడ మీటింగ్‌లు
ఇక పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా వలంటీర్లు
జగన్ మిమ్మల్నే నమ్ముకున్నారని వేడుకోళ్లు
ఈ రెండు నెలలు యాక్టివ్‌గా ఉండాలని ఆదేశం
లేదంటే... తొలగింపు తప్పదని హెచ్చరికలు
వేతనం, పారితోషికం పేరుతో వలంటీర్లపైనా వల



'ఈ ఎన్నికలు వలంటీర్లకు చావు బతుకుల సమస్యలాంటివి. జగన్ మిమ్మల్నే నమ్ముకున్నారు. మిమ్మల్ని నమ్ముకునే ఎమ్మెల్యేలను, మంత్రుల నియోజక వర్గాలను కూడా మార్చేస్తున్నారు!'
'రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులకంటే వలంటీర్లే కీలకమవుతారు. అదే జగనన్న ప్రభుత్వ ప్రత్యేకత'
- ఇదీ ఎఫ్‌వోప ప్రతినిధుల 'క్లాసు'

'ఈ రెండు నెలల సమయం చాలా విలువైనది. ప్రతి వలంటీర్ ప్రభుత్వానికి సేవలు అందించే సమయం వచ్చింది. కనుక వలంటీర్లందరూ యాక్టివ్‌గా ఉండాలని ఆదేశిస్తున్నాం'
- వలంటీర్లకు ఎంఎల్‌వోలు పంపుతున్న సందేశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వలంటీర్లూ... వినండి! మళ్లీ జగనే ముఖ్యమంత్రి అయితే అద్భుతాలు సృష్టిస్తారని జనానికి చెప్పండి! రాష్ట్ర ఖజానాకు పట్టలేనంత ఆదాయం తెచ్చి పెడతారని నమ్మించండి! పోర్టులు, పరిశ్రమలతో రాష్ట్ర ముఖ చిత్రమే మారిపోతుందని మాయ చేయండి. పథకాలు ఇబ్బడిముబ్బడిగా అమలవుతాయని ఊదరగొట్టండి! పనిలోపనిగా... చంద్రబాబు, పవన్ కల్యాణ్, షర్మిలపై వీలైనంత బురదజల్లండి! అర్థమవుతోంది కదా!?

...ఇదీ రాష్ట్రంలో వలంటీర్లకు అమలవుతున్న 'స్పెషల్ క్లాసుల' సారాంశం! వచ్చే ఐదేళ్లలో ఏదో చేస్తారనడం సరే కానీ... ఈ ఐదేళ్లలో ఏం వెలగబెట్టినట్లు అని జనం ప్రశ్నిస్తే ఏం చెప్పాలి? అనే ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు! వలంటీర్లను వందశాతం వైసీపీ కార్యకర్తలుగా మార్చే కార్యక్రమం మొదలైంది. వీళ్లకు 'స్పెషల్ క్లాసులు' తీసుకునేందుకు ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ (ఎఫ్‌వోపే) రంగంలోకి దిగింది. విచిత్రమేమిటంటే...

మిగతా 11వ పేజీలో...

ఓట్ల కోసం వలంటీర్లకు కుక్కర్లు



వెలంపల్లి 'విందు' రాజకీయం
ఎన్నికల్లో తనను గెలిపించాలంటూ కానుక
వైసీపీ విజయం కోసం కీలక పాత్ర
పోషించాల్సిన అవసరముందని విన్నపం
విజయవాడ సెంట్రల్ వలంటీర్లతో భేటీ

విజయవాడ సెంట్రల్ వైసీపీ ఇన్‌చార్జి వెలంపల్లి పంచిన కుక్కర్లతో వలంటీర్లు

12



ఆదివారం ఉండవల్లిలో సమావేశమైన చంద్రబాబు, పవన్

ఎవరికి ఏ సీటు?

బాబు-పవన్ విస్తృత మంతనాలు

32 సీట్లు కోరిన జనసేనాని.. 20చోట్ల ఏకాభిప్రాయం
మరో ఐదు ఇచ్చే చాన్సు.. 27 అడుగుతున్న పవన్!
మధ్యాహ్నం, రాత్రి రెండు దఫాలుగా చర్చ.. జనసేన సీట్లపై వస్తున్న స్పష్టత
రాజానగరం, రాజోలు, కాకినాడ రూరల్, యలమంచిలి, భీమవరం, నరసాపురం జనసేనకే!.. పోలవరం, బెజవాడ వెస్ట్, తెనాలి, దర్శి కూడా..
విజయావకాశాలే ప్రాతిపదికగా సీట్లపై కీలక నిర్ణయం
గోదావరి, విశాఖ జిల్లాల్లో ఎక్కువ సీట్లు కోరుతున్న సేన
8న మళ్లీ భేటీ.. 14న పాలకొల్లులో ఉమ్మడి సభ.. మేనిఫెస్టో ప్రకటన
కుదిరితే అభ్యర్థుల వెల్లడి కూడా?.. ఇద్దరూ కలిసి ఒకరోజు పాదయాత్ర?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీట్ల సర్దుబాటుపై టీడీపీ-జనసేన చర్చలు కొలిక్కి వస్తున్నాయి. జనసేనకు కేటాయించే సీట్లపై దాదాపు స్పష్టత వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం మధ్యాహ్నం, రాత్రి పొద్దుపోయాక రెండు దఫాలుగా సమావేశమయ్యారు. ఉభయ పార్టీల నేతలెవరూ లేకుండా ఏకాంతంగా, సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. పొత్తు సీట్లను త్వరత్వరగా తేల్చడమే ఈ భేటీల ఉద్దేశం. మధ్యాహ్నం తొలుత ఇక్కడి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ వచ్చారు. వెంట ఎవరూ లేకుండా మంగళగిరిలోని తమ పార్టీ కార్యాలయం నుంచి తన కారు తానే డ్రైవ్ చేసుకుంటూ పవన్ వచ్చారు. ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వాగతం పలికారు. తర్వాత చంద్రబాబు ఆయన్ను

మిగతా 11వ పేజీలో...

జగన్ విఫల సీఎం

ప్రజాకోర్టులో శిక్ష ఖాయం
అబద్ధాలతో వంచన: చంద్రబాబు
జగన్ నెరవేర్చని వాగ్దానాలపై టీడీఎల్పీ చార్జిషీటు విడుదల
రాజ్యసభ ఎన్నికలపై తర్వాత చెబుతానన్న టీడీపీ అధినేత



జగన్ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల చేస్తున్న చంద్రబాబు, అచ్చెన్నాయుడు, ఇతర నేతలు

11



నేటి నుంచి అసెంబ్లీ

తొలి రోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం
రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ
ఎల్లుండి ఉదయం 11 గంటలకు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్
మూజువాణి ఓటుతోనే ఆమోదముద్ర!

11

చెల్లికే గౌరవం ఇవ్వని జగన్.. అర్జునుడా?

12

పవన్ ధ్వజం

షర్మిలను నీచంగా తిడుతుంటే అన్నగా జగన్ ప్రోత్సహిస్తున్నాడు
సొంత చెల్లికి గౌరవం ఇవ్వని వాడు మన ఆడపడుచులకు ఇస్తాడా?
ఎన్నికల బరిలోకొస్తున్నాం.. మాటలు కత్తుల్లా ఉంటాయి కాస్కోండి
నేను పవర్ స్టార్ కాదు.. ప్రజా కూలీ.. దుర్మార్గ పాలన అంతమే లక్ష్యం
పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు.. వైసీపీ ఎంపీ బాలశౌరి పార్టీలో చేరిక

నివాసాల చెంతనే అక్రమంగా గోవధ

ఇద్దరు వైసీపీ నాయకుల అరెస్ట్
అనుమతి లేకుండా కబేళా నిర్వహణ
కాపాడేందుకు ఎంపీ భరత్ యత్నం!
వార్త వైరల్ కావడంతో సహకరించని పోలీసులు
రాజమహేంద్రవరంలో కలకలం

12

ఝార్ఖండ్ అసెంబ్లీలో నేడు బలపరీక్ష

జేఎంఎం కూటమికి 46.. బీజేపీ కూటమికి 29 సీట్లు
నెగ్గడానికి కావాల్సినవి 41
హేమంత్ ఓటుకు కోర్టు ఓకే
గైర్హాజరయ్యే యోచనలో ఓ జేఎంఎం ఎమ్మెల్యే
అనుకూల ఓటేయడానికి మరో ఎమ్మెల్యే షరతులు

2

అవినీతి కుమార్

మాటలతో దాడి.. మూటల దోపిడీ!



రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నట్లు బిల్డప్

అమ్మో ఎమ్మెల్యే

తెర వెనుక చేసేవన్నీ నీచపు పనులే
తెల్లరాయి కోసం నెల్లూరు గుల్ల
కొండల్ని పిండి చేసి మింగేస్తున్న వైనం
తాడేపల్లికి ప్రతి నెలా రూ.15 కోట్ల కప్పం
3 నెలల్లోనే రూ.450 కోట్ల అక్రమార్జన
ఇసుకాసురులకే ఎసరుపెట్టిన ఘనుడు
అవినీతిలో అన్నతో తమ్ముడి పోటీ
వెంచర్ పక్కనే 6 ఎకరాల కాలువ ఆక్రమణ
కరోనానూ క్యాష్ చేసుకున్న వైనం

3

- నెల్లూరు జిల్లాకు గుండెకాయ లాంటి నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మనిషి చక్కగా ఉంటారు. నడత, హావభావాలు స్టైల్‌గా ఉంటాయి. మాట తీరు మాత్రం గబ్బుగా ఉంటుంది. స్వామి భక్తిని చాటుకోవడానికి విపక్ష నేతలు, పత్రికలపై నోరు పారేసుకోవడం ఆయన నైజం. ఇక దోపిడీ చేయడంలో ఆయనకు ఆయనే సాటి.
- నెల్లూరు జిల్లా కొండల్లో లభించే తెల్లరాయిని ఇష్టానుసారం తవ్వించి కోట్లు కొల్లగొడుతున్నారు. తాడేపల్లికి ప్రతినెలా రూ.15 కోట్లు కప్పం కట్టేలా ఒప్పందం చేసుకుని ప్రభుత్వ, ప్రైవేటు, లీజు క్వారీల్లో దందా సాగిస్తున్నారు. గత మూడు నెలల్లోనే ఏకంగా రూ.450 కోట్లు దండుకున్నట్టు అంచనా. ఇక ఇసుకలోనూ బాగా వెనకేసుకుంటున్నారు.

వేరే జిల్లాకు బదిలీ

- గత ఎన్నికల తర్వాత ఈ ఎమ్మెల్యే పూర్తిగా పెడదారి పట్టారు. అక్రమాలతో పాటు ఆయన వ్యవహారశైలితో స్థానికంగా వ్యతిరేకత పెరిగింది. చాలామంది నాయకులు, కార్యకర్తలు దూరమయ్యారు. నియోజకవర్గ బదిలీల్లో భాగంగా పార్టీ అధిష్ఠానం ఆయన్ను మరో జిల్లాకు పంపింది.



అధర్మ భేటీ!

17 మంది రెవెన్యూ అధికారులపై తీవ్ర కేసులు.. నేడు మంత్రి విచారణ

తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న అధికారుల కేసులపైనే ప్రత్యేక శ్రద్ధ
ఎన్నికల ముందు శరవేగంగా ప్రక్రియ
2న నోటీసులు.. 5వ తేదీన విచారణ
రెవెన్యూ వర్గాల్లో అనుమానాలు
తహసీల్దార్ హత్యపై తీవ్ర స్పందనేదీ?

సీరియస్ కేసుల నుంచి విముక్తి కోసమేనా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విజయనగరం జిల్లా బొండపల్లి మండల తహసీల్దార్ సనపల రమణయ్య హత్యతో రెవెన్యూ యంత్రాంగం అట్టుడికిపోతోంది. సహచరుడి దారుణ హత్యోదంతాన్ని నిరసిస్తూ ఉద్యోగులు పోరుబాట పట్టారు. శ్రీకాకుళం జిల్లా దిమిలాడ గ్రామానికి చెందిన రమణయ్య హత్యపై అదే జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాత్రం ఇప్పటి వరకు పెద్దగా స్పందించలేదు. ఆయన ఇప్పుడు ఎన్నికలు, అంతకన్నా ముందు రెవెన్యూ శాఖలో తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న

మిగతా 11వ పేజీలో...

మథురలో ఆ మసీదు.. గుడిని కూల్చి కట్టిందే

కృష్ణుడి ఆలయాన్ని పడగొట్టి ఔరంగజేబు షాహీ ఈద్గా మసీదు కట్టించాడు
ఆర్టీఐ ప్రశ్నకు పురావస్తు శాఖ సమాధానం
ఆధారంగా.. 1920 నాటి బ్రిటిష్ గెజిట్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మథురలో శ్రీకృష్ణ జన్మభూమి ఆలయాన్ని కూల్చివేసి.. ఆ స్థానంలో షాహీ ఈద్గా మసీదును కట్టించాడని భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఆగ్రా విభాగం పేర్కొంది. యూపీలోని మెయిన్‌పురికి చెందిన అజయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి సమాచార

మిగతా 2వ పేజీలో...

జనంలోకి వెళ్లాల్సిందే

హ్యాట్రిక్ అంటూ ఏమరుపాటు వద్దు
రాజకీయ విశ్లేషణలను నమ్మొద్దు
కేంద్ర మంత్రులకు మోదీ హెచ్చరిక!
మన విజయాలు ప్రచారం చేసుకోవాలి
ప్రజలను ఓటేసేందుకు తీసుకురావాలి
మిత్రులను కూడగట్టుకోవాలి
ఇలా చేయకనే 2004లో దెబ్బతిన్నాం
నేతలకు మోదీ-అమిత్‌షా కర్తవ్య బోధ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అయోధ్యలో రామాలయ ప్రారంభం.. బాలక్‌రాం ప్రాణప్రతిష్ఠతో లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారీ గెలిచి హ్యాట్రిక్ కొడతామంటూ ఊహాలోకాల్లో విహరించవద్దని బీజేపీ నేతలకు ప్రధాని మోదీ గట్టి హెచ్చరిక చేశారు. అన్నీ చేసేశామని

మిగతా 2వ పేజీలో...

బీజేపీలో చేరాలని నాపై ఒత్తిడి చేశారు



» ఎప్పటికీ ఆ పార్టీలోకి వెళ్లను: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీలో చేరాలని తనపై ఒత్తిడి చేశారని, ఆ పార్టీలోకి వెళితే కేసులు లేకుం డా వదిలేస్తామని చెప్పారన్నారు. ఆదివారం ఢిల్లీలో ఓ పాఠశాల భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ ఆరోపణలు చేశారు. 'వాళ్లు (బీజేపీ) ఎలాంటి కుట్రలైనా పన్నుతారు. నేను లొంగకుండా గట్టిగా నిలబడ్డాను. బీజేపీలో చేరాలని నన్ను బలవంతం చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. నేను బీజేపీలో చేరే ప్రసక్తే లేదు. వాళ్లు మమ్మల్ని క్షమించాల్సినంత నేరం ఏం చేశాం?' అని కేజ్రీవాల్ అన్నారు.

మణిశంకర్ అయ్యర్ కుమార్తెపై ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టారంటూ కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ కుమార్తె సురణ్యా అయ్యర్‌పై పోలీసులకు ఫిర్యాదు అందింది. సుప్రీంకోర్టు న్యాయవాది, బీజేపీ నాయకుడు అజయ్ అగర్వాల్ శనివారం ఢిల్లీ సైబర్ క్రైం పోలీసులకు ఈ ఫిర్యాదును అందజేశారు. అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠకు వ్యతిరేకంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ గతనెల 20న పలు పోస్టులు పెట్టారు. 36 నిమిషాల నిడివి వీడియోను పోస్టు చేశారు. ఆ కార్యక్రమానికి వ్యతిరేకంగా 3 రోజులపాటు నిరాహారదీక్ష చేశారు. ఇవి అభ్యంతరకరమైనవంటూ అగర్వాల్ ఫిర్యాదు చేశారు.

గిరిజనులకు అండగా ఉంటాం: రాహుల్

ధన్‌బాద్, ఫిబ్రవరి 4: గిరిజనుల 'జల్-జంగిల్-జమీన్' (నీరు-అడవి-భూమి)కి అండగా ఉంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. భారత్ జోడో న్యాయ్‌యాత్రలో భాగంగా ఆదివారం ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయకుండా కాపాడడం, దేశ యువతకు, గిరిజనులకు న్యాయం జరిగేలా చూడడమే తన యాత్ర ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాహుల్ శనివారం రాత్రి ధన్‌బాద్ జిల్లా టుండీలో బస చేశారు. ఆదివారం ధన్‌బాద్ నగరంలోని గోవింద్‌పూర్ నుంచి తన యాత్ర కొనసాగించారు. కాగా 'మోదానీ-కరణ' వల్లే దేశంలో 'ఉద్యోగాల కరువు' ఏర్పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ 'ఎక్స్'లో మండిపడ్డారు.

శ్రీదేవి మృతిపై యూట్యూబ్‌లో తప్పుడు చర్చ

» మహిళపై సీబీఐ చార్జిషీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ప్రముఖ నటి శ్రీదేవి మరణంపై దర్యాప్తు చేశానంటూ చెప్పుకొన్న ఓ మహిళపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. తన దర్యాప్తునకు ఆధారాలంటూ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల పేరున ఫోర్జరీ పత్రాలు సృష్టించినట్టు ఆరోపించింది. ఇన్వెస్టిగేటర్‌నంటూ తనకు తాను చెప్పుకొన్న భువనేశ్వర్‌కు చెందిన మహిళ దీప్తి రాణి పిన్నిటి, ఆమెకు సహకరించిన న్యాయవాది భరత్ సురేష్ కామత్‌పై చార్జిషీట్ దాఖలు చేసినట్టు ఆదివారం సీబీఐవర్గాలు తెలిపాయి. దీనిపై తొలుత ముంబైకి చెందిన న్యాయవాది చాందినీ షా ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. పీఎంవో నుంచి వచ్చిన లేఖ ఆధారంగా సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. బాలీవుడ్ నటులు శ్రీదేవి, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ల మరణంపై సామాజిక మాధ్యమాల్లో జరిగిన చర్చల్లో దీప్తి చురుగ్గా పాల్గొన్నారు. 2018 ఫిబ్రవరిలో శ్రీదేవి దుబాయ్‌లో మరణించగా దీనిపై యూట్యూబ్‌లో జరిగిన చర్చలో ఆమె భాగస్వాములయ్యారు. శ్రీదేవి మరణాన్ని యునైటెడ్ ఎమిరేట్స్, భారత్ ప్రభుత్వాలు కలిసి కప్పిపుచ్చుతున్నాయని, ఇది తన 'దర్యాప్తు'లో తేలిందని చెప్పారు. ఇందుకు ఆధారంగా మోదీ, అమిత్ షా పేరుతో ఉన్న నకిలీ లేఖలను చూపారు.

ఇప్పుడు రమ్మను.. జగన్‌ను

» కేంద్రం, ఏపీతో కుమ్మక్కై తెలంగాణకు మోసం చేశారు: రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎన్నికల పోలింగ్ రోజున ఏపీ పోలీసులు తుపాకులు పట్టుకుని నాగార్జున సాగర్‌ను ఆక్రమించుకున్నారని, అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి విరుచుకుపడ్డారు. కేసీఆర్ లొంగిపోయినందునే ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వచ్చి ప్రాజెక్టును స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, 'రమ్మను.. జగన్మోహన్‌రెడ్డిని' అంటూ తీవ్రంగా స్పందించారు. కృష్ణా జలాల పంపిణీపై ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులు, జలాల కేటాయింపుల్లో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలను తీసుకున్నారని ఆరోపించారు. కేంద్రంతో పాటు పక్క రాష్ట్రమైన ఏపీతో కుమ్మక్కై తెలంగాణ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతం 68 శాతం తెలంగాణలో ఉందని, 32 శాతం మాత్రమే ఏపీలో ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ నీటి విధి విధానాల ప్రకారం 500 టీఎంసీలకు పైచిలుకు తెలంగాణకు, 200 టీఎంసీలకు పైగా ఏపీకి కేటాయించాలన్నారు.

పలుచబడ్డ పార్లమెంట్!

లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్..

ఎన్నికల పర్యటనల్లో పార్టీల పెద్దలు

» బోసిపోయి కనిపిస్తున్న ఉభయ సభలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..! తమ ప్రభుత్వాన్ని సమర్థించుకునేందుకు అధికారపక్షం.. ప్రజలకు బడ్జెట్‌లో మొండిచేయి చూపడంపై విపక్షాలు వాగ్వాదాలు.. ఆరోపణలు-ప్రత్యారోపణలు.. సవాళ్లు-ప్రతిసవాళ్లు చేసుకునే సెషన్స్..! కానీ, ఈ సారి అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. అందుక్కారణం.. ఢిల్లీ అధిష్ఠానం పెద్దల మూడ్ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలపై ఉండడమే..! ఓవైపు ప్రధాని మోదీ.. మరోవైపు విపక్ష నేత రాహుల్‌గాంధీ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. విగతా పార్టీల నేతలు, ఎంపీలు కూడా తమ రాష్ట్రాలపై ఫోకస్ చేయడంతో.. పార్లమెంట్ ఉభయ సభల్లో సభ్యులు పెద్దగా కనిపించడం లేదు. పార్లమెంట్ సెషన్స్ పూర్తవ్వగానే ఏ క్షణాన్నైనా భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ రెండు నెలలుగా పలు రాష్ట్రాల్లో పర్యటనలు చేస్తున్నారు. ఆదివారం వరకు ఆయన 11 రాష్ట్రాలను చుట్టివచ్చారు. ఆయా రాష్ట్రాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులను ప్రారంభించారు. శని, ఆదివారాల్లో ఒడిసా, అసోంలలో సుడిగాలి పర్యటను చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోపు.. ఆయన ఈశాన్యంతోపాటు.. పలు రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

జనంలోకి వెళ్లాల్సిందే!

(మొదటటి పేజీ తరువాయి)

అలసత్వంతో ఉండొద్దని, ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, గత పదేళ్లలో ప్రభుత్వం ఏం చేసిందో ప్రచారం చేయాల్సిందేనని కేంద్ర మంత్రులకు ఇటీవల స్పష్టం చేశారు. టీవీ స్టూడియోల్లో కూర్చుని రాజకీయ విశ్లేషణలు చెప్పేవారి మాటలు విని మోస పోవద్దని.. ఎన్నికల్లో విజయానికి శాయశక్తులా కృషి చేయాలని హితవు పలికారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఇలాగే గెలుపు ఖాయమన్న అతివిశ్వాసంతో ఉన్నామని.. ఆ ఏమరుపాటే దెబ్బతీసిందని గుర్తుచేశారు. ప్రజలు కేంద్రప్రభుత్వానికి సానుకూలంగా ఉన్నారన్న సంతృప్తి తగదని.. విజయం లభించేదాకా అది దక్కనట్లేనని స్పష్టం చేశారు. గెలుపుపై అతిధీమాతో 2004 ఎన్నికల చివరి అంకంలో బీజేపీ నేతలు ఏమీ చేయకుండా చేతులు కట్టుకుని కూర్చున్నారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఎన్డీఏ గెలుపు ఖాయమన్న సర్వేల విశ్లేషణలు, అంచనాలు తారుమారయ్యాయి. అనూహ్యంగా కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటై.. బీజేపీ పదేళ్ల ప్రతిపక్షంలో కూర్చున్న పరిణామాలను సీనియర్ నేతలు పదేళ్లయినా మరువలేదు. విపక్ష ఇండియా కూటమిలో విభేదాలు, రామాలయ నిర్మాణంతో బీజేపీపై జనంలో అభిమానం తమకు ఓట్లు కురిపిస్తాయని కమలనాథులు కొందరు భావిస్తున్నారు. 'ఈ దఫా 400 సీట్లు గెలుస్తాం (అబ్‌కీ బార్ 400 పార్)' అని ఊరూవాడా తెగ ప్రచారం చేస్తున్నారు. అయితే అదంత తేలిక కాదని మోదీ-కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. నేలకు దిగి లెక్కలు వేస్తున్నారు. ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను తిరిగి ఎన్డీఏలోకి తీసుకురావడంలోని ఉద్దేశం అదే. హిందీ బెల్టులో.. ఈశాన్య భారతంలో బీజేపీకి తిరుగులేకున్నా.. దక్షిణాదిన అంత బలం లేదని మోదీ-షాకు తెలుసు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో సొంతగా వేళ్లానుకోవడం తేలిక కాదని, కర్ణాటకలో ఈ దఫా సీట్లు తగ్గవచ్చని, తెలంగాణలోనూ పెద్దగా పెరగవని వారికి అర్థమైంది. అంతేకాదు.. బెంగాల్లో గత ఎన్నికల్లో బీజేపీ 18 ఎంపీ స్థానాలు గెలుచుకున్నా.. ఈ సారి వాటిని తగ్గించేందుకు టీఎంసీ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శాయశక్తులా ప్రయత్నిస్తారనీ తెలుసు. అందుకే 400 స్థానాలంటూ నేలవిడిచి సాము చేయకుండా.. లోక్‌సభలో ఎన్డీఏకి ఇప్పుడున్న 339 సీట్లను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం తెచ్చిన పథకాలతో ప్రజల్లో ఎంత సానుకూలత ఉన్నా.. ఎన్నికల్లో విజయానికి 'పన్నా ప్రముఖ్'లపైనే బీజేపీ ఆధారపడుతోంది. వీరు ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకొస్తారు. ఓటింగ్ శాతం పెరగడంలో వీరిదే కీలక పాత్ర. మోదీ-షా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఈ వ్యవస్థను బాగా బలోపేతం చేశారు. మోదీ మూడోసారీ గెలుస్తారని ప్రచారం చేయడం కాకుండా.. ప్రజలను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడమే ముఖ్యమని మోదీ-షా పార్టీ శ్రేణులకు స్పష్టం చేస్తున్నారు.



గువాహటిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మోదీ

మైనారిటీలపై కన్ను!

ఇండియా కూటమిలోని పార్టీలు సంఘటితంగా లేనప్పటికీ.. బీజేపీని ఓడించడానికి ఆ పార్టీల మధ్య తుదారులు.. ముఖ్యంగా మైనారిటీ ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది గ్రహించే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు ఇప్పటికే రంగంలోకి దిగాయి. రామాలయ నిర్మాణంతో మోదీ ప్రభుత్వంపై మెజారిటీ హిందువుల్లో ఉన్న సానుకూలతను ఓట్లుగా మలచుకోవడానికి, అది మైనారిటీలకు వ్యతిరేకం కాదని చాటుకోవడానికి ముందుగానే ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ముఖ్యంగా యువతను, నవ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ప్రచారం నిర్వహిస్తున్నాయి.

నవీన్‌తో మోదీ చెలిమి!

ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒడిసాలో బీజేపీ పాగా వేయలేకపోతోంది. ఈ ఏడాది జరిగే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ పరిస్థితిలో పెద్దగా తేడా ఉండదని ప్రధాని మోదీ-అమిత్‌షా అంచనా వేస్తున్నారు. అందుకే ముఖ్యమంత్రి, పాలక బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌కు స్నేహహస్తం అందిస్తున్నారు. శనివారం రాష్ట్ర పర్యటనకు వెళ్లిన మోదీ సంబల్‌పూర్ ఐఐఎంలో జరిగిన సభలో.. నవీన్‌ను మిత్రుడిగా పేర్కొనడం విశేషం. దీనికి ప్రతిగా నవీన్ కూడా మోదీని ప్రశంసించారు. కాంగ్రెస్ తీరుపై సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరోసారి మండిపడ్డారు. రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'కు తమకు ఆహ్వానమే రాలేదని చెప్పారు. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. యూపీలో యాత్ర తాలూకు తుది రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదన్నారు.

'సున్నా' కరెంటు బిల్లు!

ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది: మోదీ

గువాహటీ, ఫిబ్రవరి 4: దేశంలోని కుటుంబాలకు విద్యుత్ బిల్లు సున్నా(జీరో) చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ చెప్పారు. అసోంలోని గువాహటీ నగరంలో 11,599 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ఆదివారం ప్రధాని శంకుస్థాపనలు చేశారు. వీటిలో కామాఖ్య మాత ఆలయానికి విచ్చేసే భక్తులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించే 'మా కామాఖ్య దివ్య పరియోజన(మా కామాఖ్య యాక్సెస్ కారిడార్)' ప్రాజెక్టు కూడా ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ 'గత పదేళ్లుగా దేశంలోని ప్రతి ఇంటికీ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు మేం ఉద్యమించాం. ఇప్పుడు విద్యుత్ బిల్లు సున్నా చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం. ఇళ్ల పైకప్పుపై సౌర విద్యుత్ పలకలు అమర్చే భారీ పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించాం. తొలి దశలో కోటి కుటుంబాలకు ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సాయం చేస్తుంది' అన్నారు. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ హాజరుకాకపోవడాన్ని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. 'మన పవిత్ర స్థలాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేకపోయారు. రాజకీయ లబ్ధి కోసం సొంత సంస్కృతి పట్ల సిగ్గుపడే పద్ధతిని వారు అలవాటు చేసుకున్నారు' అని విమర్శించారు. అయోధ్యకు సందర్శకులను అనుమతించడంతో గత 12 రోజుల్లోనే 24 లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారని మోదీ చెప్పారు.

లోకం తీరు



గమనిక

వైఎస్ జగన్ మేనత్త వైఎస్ విమలా రెడ్డి దళితుడిని వివాహం చేసుకున్నారని ఆదివారం నాటి 'కొత్త పలుకు' కాలమ్‌లో ప్రచురితమైంది. కానీ, ఆమె వివాహం చేసుకున్నది రెడ్డి కులస్థుడినే. సమాచార లోపంతోనే ఇది జరిగింది. పొరపాటుకు చింతిస్తున్నాం.

మథురలో ఆ మసీదు.. గుడిని కూల్చి కట్టిందే

(మొదటి పేజీ తరువాయి)

హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించింది. ఆలయం కూల్చిన చోటే మసీదును కట్టినట్టు స్పష్టం చేసింది. 1920లో బ్రిటిష్ సర్కారు ప్రచురించిన రాజపత్రాన్ని ఏఎస్ఐ తన సమాధానంలో ఉటంకించింది. పురావస్తు శాఖ తెలిపిన ఈ సమాచారాన్ని సాక్ష్యంగా హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు సమర్పిస్తామని కృష్ణ జన్మభూమి ముక్తి న్యాస్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మహేంద్రప్రతాప్ పేర్కొన్నారు. మథురలో శ్రీకృష్ణుడు పుట్టినచోట ఉన్న పురాతన ఆలయాన్ని ఔరంగజేబు కూల్చివేసి.. ఆ స్థానంలో షాహీ ఈద్గా మసీదును నిర్మించాడని, ఆ స్థలాన్ని తిరిగి తమకు అప్పగించాలని కోరుతూ హిందువులు కోర్టును ఆశ్రయించారు. అక్కడ మొత్తం 13.37 ఎకరాల స్థలం వివాదంలో ఉంది.

బలమున్నా.. భయమే!

చంపయి సోరెన్ సర్కారుకు నేడు విశ్వాస పరీక్ష

రాంచీ, హైదరాబాద్, ఫిబ్రవరి 4: రాజకీయ సంక్షోభంతో హైదరాబాద్‌కు చేరుకున్న ఝార్ఖండ్ రాజకీయ క్యాంపు తిరుగుముఖం పట్టింది! చంపయీ సోరెన్ నేతృత్వంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం సోమవారం ఝార్ఖండ్ అసెంబ్లీలో బలపరీక్షను ఎదుర్కోనుంది. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు రిసార్టులో బస చేసిన దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు ఆదివారం వారి రాష్ట్రానికి చేరుకున్నారు. మొత్తం 81 మంది సభ్యులు ఉండే ఆ రాష్ట్ర అసెంబ్లీలో.. ఝార్ఖండ్ ముక్తి మోర్చా(28), కాంగ్రెస్(16), ఆర్జేడీ(1) కూటమికి 45 సీట్లు ఉన్నాయి. సీపీఐ(ఎంఎల్) ఏకైక ఎమ్మెల్యే ఆ కూటమికి బయటి నుంచి మద్దతిస్తుండగా.. బీజేపీతో కూడిన విపక్ష కూటమికి 29 మంది ఎమ్మెల్యేలున్నారు. బలపరీక్షలో గెలవాలంటే జేఎంఎం కూటమికి 41 ఓట్లు వస్తే సరిపోతుంది. సంఖ్యాపరంగా ఆ కూటమికి బలపరీక్షలో నెగ్గే బలం ఉన్నప్పటికీ.. పరిస్థితి అంత సజావుగా ఏమీ లేదు. సీనియర్ ఎమ్మెల్యే లాబిన్ హెంబ్రామ్ ఈ బలపరీక్షలో ఓటు వేయడానికి పలు డిమాండ్లను పార్టీ చీఫ్ శిబు సోరెన్ ముందుంచారు. మద్య నిషేధం, అటవీ సంరక్షణకు, నీటి సంరక్షణకు కఠినమైన చట్టాల్లాంటి 2019 ఎన్నికల హామీలను అమలు చేయలేదని ఆయన మండిపడుతున్నారు. ఇక విష్ణుపూర్ ఎమ్మెల్యే చమ్రాలిండా ఇటీవల జేఎంఎం నిర్వహించిన పార్టీ సమావేశానికి రాలేదు. ఆయన అనారోగ్యం బారిన పడినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నప్పటికీ.. ఆయన అసలు ఎవరికీ అందుబాటులో లేనట్టు తెలుస్తోంది. సోమవారం విశ్వాస పరీక్షకు ఆయన గైర్హాజరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్ రిసార్ట్‌కు 40 మంది ఎమ్మెల్యేలు రాగా.. వీరిద్దరినీ కలిపితే 42 మంది. మిగతా నలుగురి సంగతేంటో తెలియదు. జేఎంఎం వర్గాలు మాత్రం.. తమకు 43 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని చెప్తున్నాయి. కాగా.. సోమవారం నాటి పరీక్షలో హేమంత్ సోరెన్ ఓటు వేసేందుకు రాంచీలోని ప్రత్యేక కోర్టు అనుమతిచ్చింది.



రాంచీకి వెళ్లే విమానంలో ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు

ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు ఔట్.. బిహార్ ఎమ్మెల్యేలు ఇన్

హైదరాబాద్/ఇబ్రహీంపట్నం/మేడ్చల్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం వచ్చినా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపులకు వేదికగా హైదరాబాద్ నిలుస్తోంది. ఇటీవల ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు హైదరాబాద్ రాగా.. తాజాగా ఆదివారం బిహార్ ఎమ్మెల్యేలు శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. ఝార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ రాజీనామా తర్వాత రాజకీయ సంక్షోభం ఏర్పడడంతో ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, జేఎంఎం పార్టీలకు చెందిన 39 మంది ఎమ్మెల్యేలను రెండు ప్రత్యేక విమానాల్లో రెండు రోజుల క్రితం హైదరాబాద్ తరలించిన సంగతి తెలిసిందే. ప్రత్యేక భద్రతా ఏర్పాట్లతో వారిని అక్కడి నుంచి శామీర్‌పేటలోని లియోనియా రిసార్టుకు టీపీసీసీ తరలించింది. ఝార్ఖండ్ కొత్త సీఎం చంపయ్ సోరేన్.. సోమవారం శాసనసభలో తన బలాన్ని నిరూపించుకోనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు వారు బయలుదేరి వెళ్లారు. తాజాగా బిహార్‌లో నితీష్‌కుమార్ ఈ నెల 12న విశ్వాస పరీక్షను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముందు జాగ్రత్తగా హైదరాబాద్ తరలించారు. శంషాబాద్ విమానాశ్రయంలో 5.30 గంటలకు ఝార్ఖండ్ ఎమ్మెల్యేలను రాంచీ విమానం ఎక్కించిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు... 6 గంటల దాకా అక్కడే ఉండి పాట్నా నుంచి శంషాబాద్ చేరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రిసీవ్ చేసుకున్నారు. వారందరినీ ఇబ్రహీంపట్నం శివారులోని సిరి నేచర్స్ వ్యాలీ రిసార్టుకు తరలించారు. ఈ నెల 11వరకూ వారు ఈ క్యాంపులోనే ఉండనున్నట్టు తెలిసింది.

భారత దౌత్య కార్యాలయంలో.. ఐఎస్ఐ ఏజెంట్ సత్యేంద్ర



» మేరఠ్‌లో అరెస్టు చేసిన ఏటీఎస్

లఖ్‌నవూ, ఫిబ్రవరి 4: భారత విదేశాంగలో పని చేస్తూ.. పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్న ఓ భద్రత అధికారిని ఉత్తరప్రదేశ్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితుడిని యూపీలోని హాపుర్ జిల్లా షమాహియుద్దీన్‌పూర్‌కు చెందిన సత్యేంద్ర సివాల్‌గా గుర్తించినట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఏటీఎస్ తెలిపింది. భారత విదేశాంగ శాఖలో పని చేస్తున్న పలువురు అధికారులు, సిబ్బంది పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ తరఫున గూఢచర్యం చేస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెట్టినట్లు తెలిపింది. "ఈ క్రమంలో సత్యేంద్రకు వ్యతిరేకంగా భౌతిక, డిజిటల్ ఆధారాలను సేకరించాం. మేరఠ్‌లోని ఏటీఎస్ కార్యాలయానికి విచారణకు పిలిచాం. అతను తొలుత డొంకతిరుగుడు సమాధానాలిచ్చినా.. ఆ తర్వాత నేరాన్ని అంగీకరించాడు. ఐఎస్ఐ తరఫున పనిచేస్తున్నట్లు ఒప్పుకొన్నాడు" అని ఆ ప్రకటన స్పష్టం చేస్తోంది. సత్యేంద్ర 2021 నుంచి మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ఇండియా-బేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్(ఐబీఎస్ఏ)గా పనిచేస్తున్నాడు. భారత్-రష్యా మధ్య సంబంధాలకు సంబంధించిన వివరాలతోపాటు.. ఆర్మీకి చెందిన కీలక రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేసినట్లు ఏటీఎస్ గుర్తించింది. ఐఎస్ఐకు సత్యేంద్ర చేరవేసిన సమాచారం భారత్‌కు భారీ ముప్పుగా పరిణమించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. ఐఎస్ఐ నుంచి సత్యేంద్రకు డబ్బు అందుతున్నట్లు గుర్తించామని పేర్కొంది. కాగా.. ఐఎస్ఐ నెట్‌వర్క్‌లో సత్యేంద్ర కీలక వ్యక్తి అని అధికారులు అనుమానిస్తున్నారు. మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో.. తన హోదాను అడ్డుపెట్టుకుని, కీలక పత్రాలను సంపాదించి, పాక్‌కు చేరవేసినట్లు భావిస్తున్నారు. వీటిల్లో రక్షణ, విదేశాంగ శాఖ నిర్ణయాలు, సైన్యం రోజువారీ కదలికలు వంటి వివరాలున్నట్లు చెబుతున్నారు.

'రామమందిరం' కవరేజీలో బీబీసీ పక్షపాతం

బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ మండిపాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అయోధ్య రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం కవరేజీలో బీబీసీ పక్షపాత ధోరణితో వ్యవహరించిందని బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ మండిపడ్డారు. తాజాగా హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఆయన మాట్లాడుతూ... అయోధ్యలో రామాలయం ప్రారంభం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. అయితే బీబీసీ మాత్రం 'ఇది ఒక మసీదు విధ్వంసం జరిగిన ప్రదేశం' అని తన కవరేజీలో నివేదించిందని ఆరోపించారు. మసీదు కంటే 2వేల సంవత్సరాలకు ముందు అక్కడ దేవాలయం ఉందన్న విషయాన్ని బీబీసీ మర్చిపోయిందన్నారు. మసీదు నిర్మాణం కోసం ముస్లింలకు ఐదెకరాల స్థలం కేటాయించారని చెప్పారు. బీబీసీ నిష్పక్షపాతంగా రిపోర్టింగ్ చేయడంలో వైఫల్యంపై చర్చకు సమయం కేటాయించాలని ఇతర ఎంపీలను బ్లాక్‌మన్ కోరారు.

'ట్రాఫిక్ బెంగ'ళూరు

» దేశంలోనే ట్రాఫిక్ కష్టాల్లో తొలిస్థానం

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ట్రాఫిక్ ఇబ్బందులు అత్యధికంగా ఎదుర్కొనే నగరాల జాబితాలో బెంగళూరు ఆరో స్థానంలో నిలిచింది. అలాగే, మనదేశంలో ట్రాఫిక్ కష్టాలు పరంగా తొలిస్థానంలో బెంగళూరు నిలిచింది. లండన్‌కు చెందిన టామ్‌టామ్ అనే సంస్థ 2023 సంవత్సరంలో అత్యధికంగా ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొన్న నగరాల జాబితాను తాజాగా విడుదల చేసింది. మనదేశంలో బెంగళూరు తర్వాతి స్థానాల్లో పుణె, ఢిల్లీ, ముంబై నగరాలు ఉన్నాయి. ప్రపంచ జాబితాలో తొలి మూడు స్థానాలో లండన్, డబ్లిన్, టొరంటో నగరాలు ఉన్నాయి. టామ్‌టామ్ సంస్థ ప్రతినిధులు 55 దేశాల్లోని 387 నగరాల్లో అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించారు. కాగా, 2022లో ట్రాఫిక్ కష్టాల పరంగా ప్రపంచంలో రెండోస్థానంలో ఉన్న బెంగళూరు ఇప్పుడు ఆరో స్థానానికి చేరడం గమనార్హం.

వెంకయ్య నాయుడు రాష్ట్రపతి కావాలి

» తెలుగు వాళ్లు ఎక్కడున్నా మన వాళ్లే: టీ-సీఎం రేవంత్‌రెడ్డి
» తెలుగు కళామతల్లికి మూడో కన్ను చిరంజీవి: వెంకయ్య
» గద్దర్ పేరిట అవార్డులు సముచితం: చిరంజీవి
» పద్మ అవార్డు గ్రహీతలకు తెలంగాణ సర్కారు సన్మానం
» పద్మశ్రీ గ్రహీతలకు 25లక్షల చొప్పున అందజేత
» రూ.25వేల పింఛన్ ఇస్తామని రేవంత్ ప్రకటన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): "తెలుగు వాళ్లు ఎక్కడున్నా మన వాళ్లే. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాల్సి వచ్చినప్పుడు, కాపాడుకోవాల్సి వచ్చినప్పుడు మనమంతా ఏకం కావాలి. రాజకీయాలకు అతీతంగా కలిసి పని చేయాలి" అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో పద్మవిభూషణ్ అవార్డులకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సినీనటుడు చిరంజీవిని శాలువా, జ్ఞాపికలతో రేవంత్‌ను సన్మానించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీతలు దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, కూరెళ్ల విఠలాచార్య, వేలు ఆనందాచారి, కేతావత్ సోమ్‌లాల్, ఉమామహేశ్వరికి రూ.25లక్షల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. "నీలం సంజీవరెడ్డి తర్వాత రెండవ తెలుగువాడిగా వెంకయ్య రాష్ట్రపతి అవ్వాలి, ఆయనకు ఆ అవకాశం రావాలి" అని ఆకాంక్షించారు. అలాగే, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం సినీ నటుడు చిరంజీవి సొంతమని కొనియాడారు. "కవులు, కళాకారులు వయసు మళ్లాక వెనక్కి తిరిగి చూసుకొంటే చప్పట్లు, దుప్పట్లే మిగులుతుంటాయి. చాలామంది ఇంటి ఖర్చులకూ ఇబ్బంది పడుతుంటారు. అందుకే పద్మశ్రీ గ్రహీతలైన పేదకవులు, కళాకారులందరికీ ప్రతినెలా రూ.25వేల చొప్పున పింఛన్ అందిస్తాం" అని రేవంత్ ప్రకటించారు.

ఇది మంచి సంప్రదాయం

సాధారణంగా అవార్డులు, సన్మానాలకు తాను దూరంగా ఉంటానని, కానీ.. ప్రధాని మోదీ మీద గౌరవంతో పద్మ విభూషణ్ పురస్కారాన్ని కాదనలేకపోయానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను గుర్తించి పద్మ పురస్కారాలతో గౌరవించడం ఒక ఎత్తయితే, అందులో తెలుగువారిని పిలిచి ఇలా సన్మానించడం ద్వారా మంచి సంప్రదాయానికి సీఎం రేవంత్ నాంది పలికారని ప్రశంసించారు. "తెలుగు కళామతల్లికి ఎన్టీఆర్, ఏఎన్ఆర్ రెండు కళ్లు అయితే... మెగాస్టార్ చిరంజీవి మూడో కన్ను. నటనలో ప్రమాణాలు పాటించిన వ్యక్తి. ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపడేది లేదనడానికి చిరంజీవి సినీ జీవితమే ఉదాహరణ" అని వ్యాఖ్యానించారు.

మీ అభిమానం కంటే అవార్డు పెద్దదికాదు

"ఎక్కడ కళాకారులు గౌరవించబడతారో, సన్మానించబడతారో ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని పెద్దలంటారు. ఈ సన్మాన సభ చూస్తుంటే, నాకు అక్షర సత్యం అనిపిస్తోంది. అవార్డులు ప్రకటించిన వెంటనే స్పందించి సన్మానించడం ఇంతవరకూ ఎన్నడూ జరగలేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నంది అవార్డులు గత చరిత్రలా మారాయి. కానీ యంగ్ అండ్ డైనమిక్ లీడర్ రేవంత్‌రెడ్డి నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని తిరిగి కొనసాగించనున్నట్లు ప్రకటించడమేగాక, అవార్డుకు ప్రజాగాయకుడు గద్దర్ పేరు పెట్టడం సముచితం.. ముదావహం" అని సినీనటుడు చిరంజీవి అన్నారు. విశాఖ ఉక్కు పోరాట సమయంలో విద్యార్థి నాయకుడిగా వెంకయ్య పిలుపు ఇస్తే, నర్సాపురంలో తాను ధర్నాలో పాల్గొన్నానని గుర్తుచేశారు. ఆనాటి నుంచి తనకు ఆయన ఆరాధ్యనీయుడని, ఆయన వాగ్ధాటికి తాను పెద్ద అభిమానినని పేర్కొన్నారు. అభిమానుల ప్రేమ కంటే తనకు ఈ అవార్డు పెద్దదేమీ కాదని అన్నారు. ప్రస్తుతం రాజకీయాలు దిగజారిపోతున్నాయని, వ్యక్తిగత విమర్శలు చేసే వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కాగా, పద్మ అవార్డు గ్రహీతల సన్మాన కార్యక్రమంలో కొందరు భద్రతాధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. దాంతో పోలీసులకు, మీడియా ప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది.



సన్మాన కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్, చిరంజీవి, వెంకయ్యనాయుడు తదితరులు


'పద్మశ్రీ'తో బాధ్యత మరింత పెరిగింది

» పురస్కార గ్రహీత కూరెళ్ల విఠలాచార్య

మోత్కూరు, ఫిబ్రవరి 4: పద్మశ్రీ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందని ప్రముఖ కవి కూరెళ్ల విఠలాచార్య అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కూరెళ్ల విఠలాచార్యను సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా విఠలాచార్య మాట్లాడుతూ సాహిత్యాభివృద్ధికి తాను చేస్తున్న కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ఇవ్వడం, రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షల నగదు రివార్డుతో సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.25లక్షల నగదు రివార్డుతో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. తనకు పద్మశ్రీ అవార్డు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి, సన్మానించిన రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కూరెళ్ల విఠలాచార్య గ్రంథాలయ అధ్యక్షుడు కూరెళ్ల నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో ఎమ్మెల్యే

మాటలతో దాడి.. మూటల దోపిడీ!



(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

'నేను నిప్పు' అని ఎమ్మెల్యే అంటారు. కానీ ఆయన చేసే వ్యవహారాలు మాత్రం చెత్తగా ఉంటాయి. రాజకీయాల్లో ఆస్తులు పోగొట్టుకున్నానే తప్ప సంపాదించుకోలేదంటారు. ఇది నిజమని నమ్మి నియోజకవర్గ ప్రజలు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. సహవాస దోషమో ఏమో కానీ.. ఆయన ఇప్పుడు ఎప్పుడో పోగొట్టుకున్న ఆస్తులకు వంద రెట్లు పోగేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములు, పంట కాలువలు, కొండలు, ఇసుక రీచ్‌లు... వేటినీ వదిలిపెట్టడం లేదు. అడ్డొచ్చినవారు ఎవరైనా, ఎంత సన్నిహితులైనా నిలువునా తొక్కేస్తున్నారు. అధినేత అండదండలతో రూ.కోట్లు దండుకొంటున్నారు.

కరిగిపోతున్న కొండలు

సదరు ఎమ్మెల్యే దాటికి నెల్లూరు జిల్లాలోని కొండలు కరిగిపోతున్నాయి. రోజువారీ కోట్ల రూపాయల ఆర్జనే ధ్యేయంగా అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇతరుల క్వారీల్లోకి జొరబడి దోచుకొంటున్నారు. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న కొండలనూ పిండి చేసి మింగేస్తున్నారు. ఇక్కడి కొండల్లో లభించే తెల్ల రాయి(క్వార్ట్జ్)కి ప్రపంచ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. చెన్నై మార్కెట్‌లో టన్ను క్వాలిటీని బట్టి రూ.36 వేల నుంచి 90 వేల వరకు ఉంది. దీంతో అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరు నాయకులు ఈ వ్యాపారంలోకి దిగారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే పార్టీ అధిష్ఠానంతో తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఒక రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారు. జిల్లాలోని తెల్లరాయి క్వారీలన్నీ తనకు అప్పగిస్తే నెలకు రూ.15 కోట్లు తాడేపల్లికి కప్పం కట్టేలా ఒప్పందం చేసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని గూడూరు, ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాల్లో క్వార్ట్జ్ క్వారీలు ఉన్నాయి. గతంలో వీటిలో కొన్నింటిని ఇతరులకు లీజుకు ఇచ్చారు. ఎమ్మెల్యే వీరందరి కడుపులు కొట్టారు. లీజుదారులైనా సరే తవ్వితీసిన తెల్లరాయిని తనకే తను చెప్పిన ధరకే ఇచ్చేలా సంబంధిత శాఖ అధికారుల ద్వారా వారి నుంచి బలవంతపు ఒప్పందం చేయించుకున్నారు. మార్కెట్‌లో తెల్లరాయి టన్ను రూ.70 వేల ధర పలుకుతుంటే ఎమ్మెల్యే రూ.5 వేలకే కొంటున్నారు. కూడదన్న లీజుదారులపై అధికారులతో దాడులు చేయించి కేసు నమోదు చేయిస్తున్నారు.

ఇసుకలోనూ దందా

జిల్లాలోని ఇసుక రీచ్‌ల నిర్వహణ బాధ్యతను ఎమ్మెల్యే తీసుకున్నారు. ట్రాక్టరుకు ట్రిప్పు రూ.500, టిప్పరుకు 1500, పెద్ద లారీలకు 2000 చొప్పున వసూళ్లు మొదలు పెట్టారు. జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఒక్కొక్క రీచ్ నుంచి రోజుకు సుమారు 700 నుంచి 800 లోడ్ల ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. రోడ్ల మరమ్మతుల పేరిట ట్రాక్టరు, లారీ, టిప్పర్లకు సగటున ఒక్కో లోడుపై అదనంగా రూ.750 చొప్పున వసూళ్లు చేస్తున్నట్లు అంచనా. పది రోజుల్లోనే రూ.3 కోట్ల మేర ట్రాన్స్‌పోర్టర్ల నుంచి లాక్కున్నారు. దీంతో ట్రాన్స్‌పోర్టర్లు జనవరి 22, 23 తేదీల్లో ఇసుక రవాణాను బంద్ చేశారు. రీచ్ నిర్వాహకులకు, ట్రాన్స్‌పోర్టర్లకు మధ్య అధికారులు రాజీ కుదిర్చారు. ట్రాక్టరుకు 200, టిప్పరుకు 500, లారీకి 700 అదనంగా ఇచ్చేలా రాజీ చేశారు. నెలకు 30 నుంచి 40 కోట్ల అదనపు భారం ట్రాన్స్‌పోర్టర్లకు, పరోక్షంగా ప్రజలపై పడనుంది.

అన్న కంటే తమ్ముడు ఘనుడు

దోపిడీలో ఎమ్మెల్యే కంటే ఆయన తమ్ముడు ఘనుడు! పక్క నియోజకవర్గంలో అనధికారిక లే అవుట్ వేశారు. పక్కనున్న పంట కాలువ భూమిని కూడా ఆక్రమించారు. ఆ స్థలం విలువ 50 కోట్లకు పైమాటే. దీనిపై ఆయకట్టుదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు ఆదేశించినా, అధికారులు ఆ ఆక్రమణలను తొలగించలేదు.

కాగా, ఆ ఎమ్మెల్యే మంత్రి అయిన తరువాత ప్రజలను పట్టించుకోవడమే మానేశారు. గత ఎన్నికల్లో ఆయన్ను భుజానా మోసిన నాయకులు, కార్యకర్తలు చాలా మంది విసిగిపోయి బద్ధ శత్రువులుగా తయారయ్యారు.

అధిష్ఠానం అండతో దోపిడీ

క్వారీల లీజుదారులను భయపెట్టి ఒప్పందం చేయించుకోవడానికి సదరు ఎమ్మెల్యే 5 రోజుల పాటు జిల్లాలోని అన్ని క్వారీల్లో తవ్వకాలు, రవాణా నిలుపుదల చేయించారు. ఈ క్రమంలో నెల్లూరు-చెన్నై జాతీయ రహదారి పొడవునా ఎక్కడపడితే అక్కడ క్వార్ట్జ్‌ని తరలిస్తున్న లారీలను రోడ్లపైనే ఆపేశారు. దీనిపై లీజుదారులు జిల్లాకు చెందిన ఒక వైసీపీ అగ్రనాయకుడికి మొరపెట్టుకున్నారు. వీరందరినీ వెంటబెట్టుకొని అమరావతికి వెళ్లిన ఆ నాయకుడు.. ఒకరి కోసం ఇంత మంది కడుపు కొట్టడం అన్యాయమని అధిష్ఠానానికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ అధిష్ఠానం ఎమ్మెల్యే పక్షానే నిలబడింది. ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉండటంతో ఎమ్మెల్యే చెలరేగిపోయారు. ఎవరికీ లీజు ఇవ్వని ప్రభుత్వ గుట్టలు, కొండలుగా ఉన్న క్వారీల్లోనూ తవ్వకాలు మొదలు పెట్టారు.

3 నెలలు.. 450 కోట్లు!?

జిల్లాలో లీజు క్వారీలు, అనధికి క్వారీల నుంచి రోజుకు 200-250 లారీల తెల్లరాయి చెన్నైకి తరలిపోతోంది. ప్రైవేటు, ప్రభుత్వం, లీజు క్వారీలు అనే తేడా లేకుండా అన్నీ రౌడీ మూకల కాపలా కిందకు వెళ్లిపోయాయి. ప్రైవేటు భూమిలోని క్వారీని సైతం బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ దందా 3 నెలలుగా సాగుతోంది. ఒక లారీకి 33 టన్నులు చొప్పున రోజుకు సుమారుగా 6,600 టన్నుల తెల్లరాయి తరలిస్తున్నారు. మార్కెట్ ధర ప్రకారం రోజుకు సుమారు రూ.5 కోట్లు చొప్పున మూడు నెలల్లో రూ.450 కోట్లు దండుకున్నారు. ఎవరూ అడ్డుకునే పరిస్థితి లేదు. ముఖ్యంగా మైనింగ్ శాఖ అయితే ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇందుకోసం ఆ శాఖ ఉన్నతాధికారికి భారీగానే ముట్టజెప్పుతున్నారని సమాచారం. మంచి క్వాలిటీ రాయి లభించే ఒక క్వారీలో ఈ అధికారికి 30 శాతం వాటా ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు.

కరోనానూ క్యాష్ చేసుకున్నారు

కరోనా మహమ్మారిని కూడా క్యాష్ చేసుకున్న ఘనుడు ఎమ్మెల్యే సోదరుడని ప్రజలు చెబుతున్నారు. కరోనా పీక్ దశలో ఉన్న కాలంలో ఆసుపత్రుల్లో బెడ్లు దొరకని పరిస్థితి. ఆ సమయంలో చిన్న ఆసుపత్రుల్లో కూడా ఆరోగ్య శ్రీ కింద వైద్యం చేయడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆ అవకాశాన్ని అన్న పలుకుబడితో తమ్ముడు క్యాష్ చేసుకున్నారు. తను నివాసం ఉన్న పట్టణం పరిధిలో ఉన్న చిన్న, చితక ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వకుండా జిల్లా ఉన్నతాధికారి ద్వారా అడ్డుకున్నారు. ఆ తరువాత ఆ ఆసుపత్రులను ఆయనే లీజుకు తీసుకొని అదే అధికారి ద్వారా కరోనా వైద్యానికి అనుమతులు సంపాదించారు. కరోనా వచ్చిన వారిని, రాని వారిని ఎడా పెడా ఆసుపత్రుల్లో చేర్చుకుని, ఆరోగ్యశ్రీ కింద అడ్డదిడ్డంగా బిల్లులు పెట్టుకున్నారని చర్చ జరిగింది. అంతేగాక రెమిడిసివర్ ఇంజక్షన్లను ఒక్కోదాన్ని 60 నుంచి 70 వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.

హిందూ ధర్మం విశ్వవ్యాప్తంచేసేందుకు పీఠాధిపతులందరూ ఏకం కావాలి

- ధర్మస్థాపన కోసమే శ్రీవారు తిరుమలలో వెలిశారు
- ధార్మిక సదస్సులో స్వామీజీల అనుగ్రహభాషణం



వర్చువల్‌గా మాట్లాడుతున్న రవిశంకర్ గురూజీ

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు దేశంలోని పీఠాధి, మఠాధిపతులందరూ ఏకం కావాలని, దీనికోసం టీటీడీ ముందు వరుసలో ఉంటుందని స్వామీజీలు తెలిపారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో జరుగుతున్న ధార్మిక సదస్సులో రెండో రోజైన ఆదివారం ఉదయం 17 మంది స్వామీజీలు నేరుగా, మరో 16 మంది వర్చువల్‌గా పాల్గొన్నారు. రవిశంకర్ గురూజీ వర్చువల్‌గా మాట్లాడుతూ.. యువతను ధర్మంవైపు నడిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ధర్మ పరిరక్షణలో యువత ప్రాధాన్యం ఎంతో ఉందన్నారు. అన్నమయ్య కీర్తనలు, భక్తి గీతాలాపన ద్వారా నాస్తికులు.. ఆస్తికులుగా మారడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ.. ఉత్తరదేశంలోని ప్రాచీన ఆలయాల్లో కూడా ధార్మిక ప్రచారం జరగాలన్నారు. మతాంతీకరణ చెందిన హిందువులను తిరిగి సనాతన హిందూ ధర్మంవైపు తీసుకురావడానికి ఘర్ వాపసి (మళ్లీ హిందూ ధర్మంలోకి రావడం) ప్రోత్సహించాలన్నారు. ఉత్తరాదిమఠాధిపతి మాట్లాడుతూ.. వేదపరిరక్షణ చేస్తే ధర్మ పరిరక్షణ జరుగుతుందన్నారు. సనాతన హిందూ ధర్మ ప్రచారాన్ని విశేషంగా పెంచాలని, దీని కోసం పీఠాధిపతులు సహకారం తీసుకోవాలన్నారు. అహోబిలం మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ మాట్లాడుతూ. వేదాల్ని రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. వేదపారాయణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శ్రీవారు ధర్మస్థాపన కోసమే తిరుమలలో వెలిశారని దత్తపీఠాధిపతి విజయదత్తానంద స్వామీజీ అన్నారు. దేశవ్యాప్తంగా ఐదు కోట్ల గీతా పుస్తక ప్రసాద పంపిణీ జరగాలన్నారు. సనాతన ధర్మానికి హాని కలిగించడం అంటే తమకు తాము హాని చేసుకున్నట్టే అని శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతీ తీర్థస్వామీజీ తెలిపారు.

సనాతన ధర్మాన్ని ఆచరించే ఇతర మతస్థులకు స్వాగతం: టీటీడీ చైర్మన్

సనాతన ధర్మాన్ని ఆచరించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ఇతర మతాలకు చెందిన వారిని స్వాగతిస్తున్నామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. హిందూ ధర్మంపై గౌరవం, విశ్వాసం ఉన్న ఇతర మతాలకు చెందిన వారిని ఆహ్వానించేందుకు తిరుమలలో తగిన ఏర్పాట్లు చేయాలని టీటీడీ యోచిస్తున్నట్టు తెలిపారు. ఇతర మతాలకు చెందిన వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే శ్రీవారి పాదకమలాల వద్ద హిందూ ఆచారాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

ధార్మిక సదస్సు రాజకీయ స్వలాభం కోసమేనా?: బీజేపీ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 4: తిరుమలలో జరుగుతున్న ధార్మిక సదస్సు రాజకీయ స్వలాభం కోసమేనా అనే అనుమానం కలుగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం హిందుత్వాన్ని ఉద్ధరించేసిందని గొప్పలు చెప్పుకోవడం, పొగుడుకోవడం మానుకోవాలన్నారు. పాలకమండలి తీసుకునే నిర్ణయాలు మంచివైతే టీటీడీ వెబ్‌సైట్‌లో ఎందుకు పెట్టలేదో స్వామీజీలు ప్రశ్నించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్టీఆర్‌తో బీసీలకు మేలు

- 90 సీట్లు ఇచ్చినవారికే మా మద్దతు.. తిరుపతిలో ముగిసిన బీసీ రథయాత్ర



సభను ప్రారంభిస్తున్న బీద మస్తాన్‌రావు

తిరుపతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో బీసీలకు కొంత మేలు జరిగిందని, మిగిలిన రాజకీయ పార్టీలు అన్యాయం చేశాయని, వచ్చే ఎన్నికల్లో 90 సీట్లు ఇచ్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ సంఘనేతలు స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబరు 7న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన బీసీ చైతన్య రథయాత్ర ఆదివారం తిరుపతిలో ముగిసింది. ఈ సందర్భంగా 'మరో స్వాతంత్ర్య పోరాటం కోసం సింహ గర్జన' పేరిట జరిగిన బహిరంగ సభలో బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు మాట్లాడుతూ.. రథయాత్ర ద్వారా 100 నియోజకవర్గాల ప్రజలను చైతన్యపరిచామన్నారు. బీసీ జేఏసీ అధ్యక్షుడు అన్నా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలపైన తమకు విశ్వాసం లేదన్నారు. బీసీలకు 90 అసెంబ్లీ స్థానాలు ఇవ్వాల్సి ఉంటే 12 స్థానాలే ఇచ్చారన్నారు. ఈ ఎన్నికల్లో 90 సీట్లు ఇచ్చిన పార్టీకే తమ మద్దతు ఇస్తామన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. కూరలో కరివేపాకులా బీసీలను అన్ని రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయన్నారు. రాజకీయంగా పెద్దపీట వేసే పార్టీలకే భవిష్యత్తులో తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

గ్రామ పెద్దల మాట వినలేదని వెలి!

- పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబం
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

సీతానగరం, ఫిబ్రవరి 4: గ్రామ పెద్దల మాట వినలేదని ఒక కుటుంబాన్ని వెలివేసిన అమానవీయ ఘటన తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ విషయమై ఆదివారం బాధిత కుటుంబం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. కుల సంఘం వెలివేయడంతో మాట్లాడేవారు లేక, సాయం చేసేవారు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం చినకొండేపూడి గ్రామానికి చెందిన నగేరు సుబ్బమ్మకు, నగేరు ఆంజనేయులు తదితరులకు ఓ స్థలం విషయమై సరిహద్దు తగాదా వచ్చింది. పెద్దలు తగువు తీర్చారు. ఆ తగువు నచ్చక నగేరు సుబ్బమ్మ కుటుంబ సభ్యులు(వడ్డీలు) పోలీసులను ఆశ్రయించారు. దీంతో పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కులాన్ని, కట్టుబాట్లను కాదని, పెద్దల తీర్పును కాదని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినందుకు ఆ కుటుంబాన్ని వెలివేశారు. ఈ విషయమై బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. ఈ సందర్భంగా బాధితులు విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నామని, మానసికంగా కుంగిపోతున్నామని విలపించారు. తమ కాలనీలో ఎవ్వరూ మాట్లాడడం లేదని, కుళాయి వద్దకు నీటి కోసం వెళితే అక్కడ ఉన్న వారందరూ వెళ్లిపోతున్నారని, శుభకార్యానికి గాని, అవసరానికి గాని ఎవ్వరూ పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఒప్పుకోవాలంటున్నారని, ఒప్పుకొంటే సుమారు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. న్యాయం చేయమని పోలీసులను ఆశ్రయించామని, న్యాయం జరగకపోతే కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడతామని ఆవేదనగా చెప్పారు.

అప్పుల బాధతో ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య



నరసింహులు, చెన్నకేశవ్

ఎమ్మిగనూరు రూరల్/తనకల్లు, ఫిబ్రవరి 4: అప్పుల బాధ తాళలేక ఇద్దరు కౌలురైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామానికి చెందిన ఈడిగ నరసింహులు(36) తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. రెండేళ్లుగా దిగుబడులు సరిగా రాక పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు రూ.10 లక్షలకు చేరుకోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. నరసింహులు భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలపల్లికి చెందిన చెన్నకేశవ్ (36) తనకున్న రెండున్నర ఎకరాల పొలంతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేస్తుండేవాడు. అప్పులు చేసి పొలంలో బోరు కింద టమోటా, దోస పంటలు సాగు చేశాడు. టమోటాకు ధర లేక నష్టపోయాడు. ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.40వేలు అప్పు తీసుకున్నాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆవేదన చెంది చెన్నకేశవ్ ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని మరణించాడు. ఆదివారం పశువుల కాపర్లు చెన్నకేశవ్ మృతదేహాన్ని గమనించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పులి దాడిలో ఆవు మృతి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలో పాడి ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. శనివారం రాత్రి కొవ్వాడ అటవీ ప్రాంతంలో కుంజం కొవ్వాడయ్య అనే గిరిజనుడికి చెందిన పాడిఆవును చంపి సగం తిని మిగతా కళేబారాన్ని వదిలేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆవు కళేబరం వద్దకు మరోసారి పులి వచ్చే అవకాశం ఉన్నందున చర్యలు చేపట్టారు.

'ఎక్సైజ్'లో నిధుల గోల్‌మాల్

- కొత్త కంపెనీ స్కానర్ల మాయ
- బిల్లులు లేకుండానే సరుకు కొనుగోలు
- సాఫ్ట్‌వేర్ మార్చి కంపెనీలకు టోపీ
- 2022లో కొన్నా ఇప్పటికీ అందని బిల్లులు
- కంపెనీల ఫిర్యాదులకు స్పందించని వైనం
- స్టాకులో తేడాలపైనా అనుమానాలు
- రూ.కోట్లు పక్కదారి పట్టించారని సందేహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో మద్యం బాటిళ్లను స్కానింగ్ చేసే స్కానర్ల కొనుగోళ్లలో మాయ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 2022 అక్టోబరులో కొనుగోలు చేసిన స్కానర్లకు సంబంధించి ఇప్పటి వరకు ఇన్‌వాయిస్‌లు ఇవ్వక పోవడంపై మద్యం కంపెనీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఓ అధికారి ఈ బిల్లుల విషయంలో తమను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. దాదాపు రూ.5 కోట్లకు పైగా లేనిపోని భారం తమపై మోపారని, బిల్లులు అడిగితే మాత్రం అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారని అంటున్నారు. మద్యం ఉత్పత్తి స్థాయి నుంచే బాటిళ్ల ట్రాకింగ్ చేయాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఉత్పత్తి చేసే డిస్టిలరీలు, మద్యం డిపోలు(గోడౌన్లు), మద్యం షాపులు మూడు దశల్లో స్కానింగ్ చేసే విధానం తెచ్చింది. దానివల్ల ఏ సీసా ఎక్కడ తయారైంది? ఏ డిపోకు వెళ్లింది? చివరికి ఏ షాపులో విక్రయించారు? అనే పూర్తి వివరాలు తెలుస్తాయి. దీనివల్ల ఎక్కడైనా సీసాను సీజ్ చేస్తే అది ఎక్కడినుంచి వచ్చిందో తెలిసిపోతుంది. ఈ స్కానింగ్‌కు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు గతంలో ఓ కంపెనీ పనిచేయగా జగన్ ప్రభుత్వం వచ్చాక 'వశిష్ట' అనే కొత్త కంపెనీని తీసుకొచ్చారు. కంపెనీ మారడంతోనే డిస్టిలరీలు సహా అన్ని చోట్లా కొత్త స్కానర్లు ఏర్పాటు చేయాలని బేవరేజెస్ కార్పొరేషన్ ఆదేశించింది. పాత స్కానర్లు ఉన్నాయని మద్యం కంపెనీలు చెప్పినా వినకుండా వారిపై ఒత్తిడి తెచ్చి కొత్త స్కానర్లు కొనిపించింది. ఆ తర్వాత ఆయా కంపెనీలకు ఇవ్వాల్సిన లిక్కర్ బిల్లుల్లో స్కానర్ల నగదు మినహాయించుకుంది. అయితే, ఈ తతంగం అంతా 2022లో జరిగినా, కంపెనీల నుంచి బిల్లులు మినహాయించుకున్నా, ఇప్పటి వరకు కంపెనీలకు ఇన్‌వాయిస్‌లు ఇవ్వలేదు. అప్పటి నుంచీ బిల్లులు ఇవ్వాలంటూ కంపెనీలు గగ్గోలు పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బేవరేజెస్ కార్పొరేషన్‌లోని ఓ అధికారి ఉద్దేశ పూర్వకంగానే బిల్లుల విషయంలో మాయ చేస్తున్నారని కంపెనీలు ఆరోపిస్తున్నాయి. అసలు కొన్ని స్కానర్లు కొనుగోలు చేయకుండానే కొన్నట్లుగా చూపించారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పనిచేయని స్కానర్లు

సాఫ్ట్‌వేర్ కంపెనీని మార్చి కొత్త స్కానర్లు కొనుగోలు చేసినప్పటికీ గత కొద్దికాలంగా ఆ స్కానర్లు సక్రమంగా పనిచేయడం లేదు. జనవరిలో కొన్నిరోజుల పాటు స్కానర్లు హ్యాంగ్ అయ్యాయి. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో చాలా వరకు స్కానింగ్ చేయకుండా మాన్యువల్‌గానే మద్యం అమ్మారు. దీంతో ఆ లెక్కలు సక్రమంగా అప్‌డేట్ అయ్యాయా? అనేదానిపైనా అనుమానాలు ఉన్నాయి. తాము డిస్టిలరీల నుంచి పంపిన లెక్కకు, డిపోల నుంచి షాపులకు వెళ్లిన లెక్కలకు సంబంధం లేదని కంపెనీలు భావిస్తున్నాయి. ఈ లెక్కలు తేల్చాలని కంపెనీలు అనేకసార్లు అధికారులను అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం మద్యాన్ని ఏం చేసుకున్నా తమ బిల్లులు తమకు ఇవ్వాలని కోరుతున్నాయి. ప్రతి మద్యం కంపెనీ సరఫరా చేసిన స్టాకులో కొంత వ్యత్యాసం వచ్చినట్లు కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. రూ.కోట్ల విలువైన ఆ మద్యానికి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో వీఐపీ బ్రేక్ టికెట్ల విక్రయాలు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి కేటాయించే టికెట్లను భక్తులు ఇకపై ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేసేలా టీటీడీ చర్యలు తీసుకుంది. ఎంబీసీ-34లోని కౌంటర్ వద్ద టికెట్ల కోసం భక్తులు అధిక సమయం క్యూలైన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటున్న క్రమంలో టీటీడీ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. సిఫారసు లేఖలు అందజేసిన భక్తుల సెల్‌ఫోన్‌కే ఓ లింక్‌తో కూడిన మెసేజ్‌ను పంపుతున్నారు. భక్తులు ఆ లింకు క్లిక్ చేస్తే పేమెంట్ ఆప్షన్ వస్తుంది. అక్కడ ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రెండ్రోజుల నుంచి టీటీడీ ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలుచేస్తోంది.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.
- ఆంధ్రజ్యోతి, తిరుమల

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



నగరంలో

ఏ సందులో చూసినా ఊపిరాడని బత్కులే
ఏ ఖాళీ దేహాలను కదిలించినా గాయాల బరువులే
కొన్ని ఆకలికడుపులు పొట్టకుట్టుకోడానికి
పట్నం తోవకు దారులడుగుతున్నాయి!

పేదరికం మోస్తున్న ఈ దుఃఖపుగంపలను
యాడ దించాలో తెల్వక
ఈ నాల్గురోడ్ల తోవలో నిలబడ్డాయి!

కొన్ని చిన్గిపోయిన బత్కులకు
బట్టలు కూడా తోడులేవు
కొన్ని అనాథ శిల్పాలు గాలిపలక మీద
ఆకలిలిపి రాస్తూ నన్ను చూస్తూ నవ్వుకుంటున్నాయి!

చనుబాలు దొర్కని పసిపిల్లలు
అమ్మ భుజాలకు శిలువేయబడ్డారు
దారులు అడగకుండా సాగే వాళ్ళ ప్రయాణం
బహుదూరమని మనకెప్పుడు తెలుస్తుంది!

అర్ధరాత్రి దాక సిన్మ చూసి
ఇసుక బొడ్డ మీద నిద్రరాక
బీడి మీద సూర్యున్ని ముట్టించి
పిల్లల భవిష్యత్తును కలగంటున్నాడొకడు!

రోడ్డుకు ఎడమవైపు, కుడివైపు
కొన్ని దేహపుతోటలకు పూసిన
బరువైన ఈ దుఃఖపుగంపలను
ఎవరైనా దించుకుంటారని
ఇంకొందరు దీనంగా ఎదురుచూస్తున్నారు!

చెత్తకుండీ పక్కకు విసిరేయ్యబడ్డ
ఊపిరున్న ఈ చిన్గిన బట్టలను
ఎవరు తొడుక్కుంటారు!
అక్షరాలు తప్ప!

చిగురాల్‌పల్లి ప్రసాద్
80742 72531

పదిహేనేళ్ల ప్రరవే



ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఏర్పడి పదిహేనేళ్ళు. 2024 ఫిబ్రవరి 10, 11 తేదీలలో 'స్త్రీలపై ట్రోలింగ్ అంశంగా ఖమ్మంలో ఏడవ మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సమాజ చలనంలో ప్రరవే నిర్వహించిన పాత్రని మదింపు వేసుకోవడానికి మిత్రసంస్థల ప్రతినిధుల నుంచి కొన్ని అభిప్రాయాలూ సూచనలు తీసుకున్నాము.

కె. ఎన్. మల్లీశ్వరి
జాతీయ కార్యదర్శి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

చురుకుగా పని చేస్తున్న సంస్థ



ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఇప్పుడు చాలా చురుకుగా పనిచేస్తున్న సంస్థ. నిర్మాణాత్మకమైన ప్రణాళిక, ఆచరణలతో ముందుకు నడుస్తున్నది. ప్రరవే జిజ్ఞాసతో కలిసి ప్రజ్ఞ పేరుతో కొన్ని నెలల తరబడి స్త్రీవాద సాహిత్య విమర్శ మీద నిర్వహించిన అంతర్జాల కార్యక్రమాలు చారిత్రాత్మకమైనవి. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అనారోగ్యకర ట్రోలింగులు వస్తువుగా ఖమ్మం మహాసభలు సదస్సు జరపడం, పుస్తకం తీసుకు రావడం సమయోచితంగా ఉంది. ఈ సభ మాధ్యమాలను దుర్వినియోగం చేసేవారికి కనువిప్పు కావాలని ఆకాంక్షిస్తున్నాను. మహిళలను ఎవరు ఏ రూపంలోనైనా అవమానిస్తున్నంత కాలం, ఇతర రంగాలలో ఎన్ని విజయాలు సాధించినా, వెనకబడి ఉన్నట్లే. ఈ మహాసభలు ఆ మానసిక దుర్బలులను మార్చగలవని ఆశిస్తున్నాను.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
అభ్యుదయ రచయితల సంఘం

సంస్థల నిర్వహణ ఒక సృజన కలాపం



రచయిత్రులు ఒక వేదికగా ఏర్పడి ఇన్నేళ్లుగా కొనసాగుతున్నారంటే ప్రరవే నిర్దేశించుకున్న ప్రజాస్వామ్యం పట్ల వాళ్లందరూ ఏకాభిప్రాయం సాధించినట్లే. ఇది ఆ వేదిక విజయమే కాదు. మన సాంస్కృతిక వికాసంలో ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా భావించవచ్చు. ప్రరవే ఈ పదిహేనేళ్లలో సమాజ సాహిత్యాలకు నేర్పిస్తూ, తాను నేర్చుకుంటూ సాధించిన పరిణతికి కూడా ఇది నిదర్శనం. ఇందులోని రచయిత్రులు తమ రచనలతో, ఆచరణతో తమ వ్యక్తిత్వాన్నేగాక ప్రరవే వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్ది ఉంటారు. అందువల్ల స్త్రీల భాగస్వామ్యంతో, నాయకత్వంతో నడుస్తున్న ప్రరవే అరుదైన ఉదాహరణని ఆశించవచ్చు. సంస్థలను నిర్మించి, కొనసాగించడంలోని ఒత్తిళ్లు, వ్యథలు, అనివార్యతలు మనుషులను ప్రజాస్వామికీకరిస్తాయి. ఇదొక సాంస్కృతిక, మేధో అనుభవం. సృజనాత్మక రచనా నిర్మాణం వలె సంస్థలను నడపడం ఒక సృజన కలాపం. ఇన్నేళ్ల పాటు ఈ వేదిక ఉన్నదంటే అందులోని రచయిత్రులు దాని నుంచి ఈ సృజనాత్మక, ఉద్వేగపూరిత అనుభవాలను గడించి ఉంటారు. తిరిగి దాన్ని వేదికకు అందించి ఉంటారు. ఈ సమాజంతో సన్నిహిత సంబంధమున్న సంస్థలకే అది సాధ్యం.

పాణి
విప్లవ రచయితల సంఘం

మనలో మనం నుంచి ప్రరవేగా



'మనలో మనం' నుండి తమ అనుభవాల సారంగా 2010లో ఆవిర్భవించిన ప్రరవే గత పదిహేనేళ్ళగా తాము నిర్దేశించుకున్న లక్ష్యాలకనుగుణంగా చురుకుగా పనిచేస్తుండటం సాహిత్య సంఘాల చరిత్రలో అరుదైన విశేషం. ప్రరవే రెండు తెలుగు రాష్ట్రాలలో దళిత, ముస్లిం మైనారిటీ, బీసీ, క్రైస్తవ, మైనారిటీ, ఆదివాసీ స్త్రీల జీవితాలను అధ్యయనం చేస్తూ వారి సాహిత్య కృషిని సమాజానికి అందిస్తుంది. బడిపిల్లలకు, కళాశాల విద్యార్థులకు సాహిత్య కార్యశాలలు నిర్వహించింది. సాహిత్య యాత్రలను చేసింది. క్షేత్ర పర్యటనల ద్వారా సామాజిక సమస్యలను అవగాహనలోకి తెచ్చుకుంది. కరోనాకాలంలో "స్త్రీ వాద సిద్ధాంతం - సాహిత్య విమర్శ/ ఆధునిక తెలుగుసాహిత్యం - స్త్రీ చైతన్యం" అనే అంశంపై (35 వారాలపాటు 2021 జూన్ నుండి 2022 అక్టోబర్ వరకు) ఉపన్యాసాలను, ప్రజాస్వామిక చర్చను నిర్వహించింది. నిరక్షరాస్యుల వద్దకు సాహిత్యాన్ని మౌలిక పద్ధతుల ద్వారా, వివిధ కళారూపాల ద్వారా తీసుకుపోవాలన్న లక్ష్యంతో ఇంకా ముందుకు సాగాల్సిన అవసరముంది.

కొత్తపల్లి రవిబాబు
జనసాహితి

అందరితో సంభాషణ



అర్ధ శతాబ్దం పైబడిన 'వికాసం' బరంపురం నేపథ్యంగా ప్రగతి పథంలో నడిచే సంస్థ. అందుకుగానూ తన సంవిధానంలో స్పష్టంగా జెండర్ సమస్యని కూడా గుర్తించి ఆ దిశగా అడుగులు వేసింది. బరంపురానికి- స్త్రీల సమస్యలు, వాటి పట్ల అవగాహన పెంచే రచనలను వికాసం పరిచయం చేసింది. ఆ విధంగా ఎంతో మంది స్త్రీవాద రచయితల్ని వికాసం వేదికకు ఆహ్వానించాం. అందులో భాగంగా ప్రరవే వారు వికాసం సభలకి అతిథులుగా వచ్చారు. కేవలం జెండర్ సమస్యలే కాక అట్టడుగు వర్గాల సమస్యలు కూడా పరిగణనలోకి తీసుకుని విస్తృతమైన కృషి చేస్తున్నది ప్రరవే. ప్రజాస్వామ్య ధోరణిలో ఆలోచిస్తున్న ప్రతీవారితో సంభాషణ చేస్తూ ఉండటం వల్ల పదిహేనేళ్లుగా చైతన్యవంతంగా ముందుకు నడుస్తున్నది. ప్రరవేకి అభినందనలు. వారు చేస్తున్న మంచి పనులకి వికాసం సహకారం ఎప్పుడూ ఉంటుంది.

మండపాక కామేశ్వరరావు రాజు
వికాసం

పదిహేనేళ్ల ప్రరవే ప్రస్థానం స్ఫూర్తివంతం



ప్రరవేకు జేజేలు. మీరంతా కలిసి నడవడమనేది సామాన్యమైన విషయం కాదు. అలా అని అసామాన్యమూ కాదు. కల్మషం, అధికారం, దర్పం చూపకుండా అందరితో ఆత్మీయంగా కలగలసిపోయే గొప్ప మనసున్న రచయిత్రులు ఇందులో పని చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. నాలుగు కొప్పులు కలిస్తే అంతే, ఆడవాళ్లకు ఆడవాళ్లే శత్రువులన్న వాటిన్నింటినీ ప్రరవే తుడిచి పడేసింది. నలుగురు ఆడవాళ్లు కలిస్తే తమ గురించే కాకుండా ఎదుటివారి గురించి తమ చుట్టూ ఉన్న జనం గురించీ సాహిత్య వనంలో ఉన్న మహిళ, మొత్తం సమాజాన్ని వికసింప జేయడానికే పూనుకుంటారు. ప్రరవే అదే చేసింది. అలా రెండు రాష్ట్రాల్లో కొన్ని సాహిత్య కుసుమాలు వికసితమై తమ సాహిత్య పరిమళాలు వెదజల్లుతున్నాయి. ప్రరవే తన చుట్టూ సమాజం గురించి ఆలోచిస్తూ ఆచరణాత్మకంగా అనేక కార్యక్రమాలు చేస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతోంది. కోవిడ్ కాలాన్ని సైతం అధిగమించి ఆన్‌లైన్‌లో ప్రస్థానం కొనసాగించింది. పిల్లల నుండి యువతరం, పురుషులు ఈ కార్యక్రమాల్లో నిత్యం పాల్గొనడం పరిపూర్ణంగా సమాజం మొత్తం సమాయత్తమైనట్లు చేయడమే. అది ప్రరవే సుసాధ్యం చేసింది.

శాంతిశ్రీ
సాహితీ స్రవంతి

కల్లోలకాలపు కదలిక - ప్రరవే కార్యాచరణ



కల్లోల వర్తమానంతో సంభాషిస్తూ కొల్లగొడుతున్న హక్కులకు గొడుగు పడుతూ స్త్రీలపై జరుగుతున్న అనేక రకాల హింసల్ని నిరసిస్తూ, మహిళల జీవితం నిండా ఆవరించి ఉన్న సమస్త సంవేదనలను చర్చకు పెడుతూ ప్రరవే కార్యాచరణను కొనసాగిస్తున్నది. ముఖ్యంగా మహిళల కోణంలోంచి గత వర్తమాన సాహిత్యాలను వివేచన చేస్తూ, నవల, కథ, కవిత, వ్యాసం మొదలైన అన్ని సాహిత్య ప్రక్రియల్లో ప్రజాస్వామిక విలువల్ని ప్రతిపాదిస్తూ వస్తున్నది. సదస్సులు, సమావేశాలు, క్షేత్ర పర్యటనలు, పుస్తకాల ప్రచురణలతో జ్ఞానరంగంలో చేస్తున్న కృషి ప్రరవేను ప్రత్యేక స్థానంలో నిలిపింది. తమ రచనల ద్వారా అంతరాలు లేని ఆధునిక జీవిత నమూనాను సమాజానికి అందిస్తున్నది. రానున్న సభల్లో ఎంచుకున్న అంశమైన 'మహిళలపై ట్రోలింగ్' ఆలోచనాత్మకమైనది. మహిళలకు సమాన గౌరవం దక్కని నాడు మనది నాగరిక సమాజంగా మనజాలదు. ఇందు కోసం చేస్తున్న కృషి మునుముందూ కొనసాగి, దగా పడుతున్న మహిళా లోకానికి ప్రరవే దారి దీపం కావాలి.

గాజోజు నాగభూషణం
తెలంగాణ రచయితల వేదిక

ప్రజాస్వామిక వేదికల నిర్వహణకు ఆదర్శం



నిర్దిష్టలక్ష్యంతో నిర్దేశిత కర్తవ్యాలతో సంఘాలు, పార్టీలూ నడపటం సులువు. కానీ, విభిన్న లక్ష్యాలు విభిన్న కర్తవ్యాల కార్యాచరణ కలిగినవారితో ఉమ్మడి లక్ష్యం కోసం ఐక్యమై, వేదికగా నిర్మాణమయి పనిచేయటం చాలా కష్టం. అలాంటి వేదికలు తక్షణ సమస్యల పరిష్కారాలకై ఏర్పడినవి కొద్దికాలం వుండినాయేమో గానీ, సాహిత్య, సాంస్కృతిక రంగాన, యితర ప్రజాజీవన రంగాల్లో రాష్ట్ర జాతీయస్థాయిలో లేవు. సాహిత్యరంగాన శ్రీకాకుళ సాహితీ వేదిక వంటి స్థానికమైనవి కొన్ని వుండొచ్చు. ఆ లోటును పూరిస్తూ, పదిహేనేళ్ళుగా ప్రజాస్వామిక విలువలు, జీవన విధానం, పాలనారీతుల కోసం మహిళలతో, మహిళల కోసం నిర్విరామంగా కృషిచేస్తోంది ప్రరవే. కేవలం మహిళా సాధికారిత కోసం, మహిళలు మాత్రమే పనిచేసే సంస్థలా కన్పిస్తుంది గానీ, పురుషులకోసం, పురుషులతో కలసి కూడా పనిచేస్తోంది. స్త్రీ పురుషుల ఉమ్మడి ప్రజాస్వామిక విలువలకోసం సాహిత్య రంగాన యేమేమి చేయగలదో, అవన్నీ చేయడానికి ప్రయత్నిస్తూ వచ్చింది. ఐతే, ఈ ప్రయత్నాలు పట్టణాలనూ నగరాలనూ దాటి పల్లెలకూ బస్తీలకూ చేరలేదు. మధ్యతరగతి కిందకి చేరినట్లుగా కూడా లేదు. పాలనా విధానాల ఫలితంగా కార్పొరేటీకరణ, కాషాయీకరణా జరుగుతోంది. అడవి, సముద్రతీరం, మైదానపల్లెలూ విధ్వంసానికీ, అక్కడి ఆదివాసీలు, మత్స్యకారులు, బహుజనులు విస్తాపనకు గురవుతున్నారు. అందునా ఉత్తరాంధ్ర ప్రాంత మహిళలు అధికశాతం గురవుతున్నారు. సాహిత్యం-గురజాడ మధురవాణిని ఇష్టపడేట్టు, చర్చించేట్టు, రావిశాస్త్రి ముత్తేలమ్మను ఇష్టపడదు, చర్చించదు. ప్రరవే ఈ లోటుని పూరించాలని కోరుకుంటున్నాను.

అట్టాడ అప్పల్నాయుడు
ఉత్తరాంధ్ర రచయితల, కళాకారుల వేదిక

వివక్షలు లేని సమాజ స్థాపన కోసం



తెలుగు నేలమీద పదిహేనేళ్ళుగా స్త్రీల సాహిత్యాన్ని వృద్ధి పరుస్తున్న చైతన్య శీల సంస్థ ప్రరవే. వివిధ భావాల, వివిధ ప్రాంతాల, వివిధ నేపథ్యాల రచయిత్రుల్ని సమీకరించి భావాల ఘర్షణ ఉన్నా, సాహిత్యపరంగా ఐక్యత సాధిస్తూ ప్రజాస్వామిక స్ఫూర్తితో పురోగమిస్తున్నది. స్త్రీలపై జరుగుతున్న రకరకాల హింసల్ని ఎప్పటికప్పుడు ఎండగడుతూ సదస్సులు నిర్వహించి హింసకున్న వివిధ పార్శ్వాల్ని విశ్లేషించింది. కథ, నవల, కవిత, విమర్శలపై లోతైన అధ్యయనాలు చేసి సాహిత్యంలో స్త్రీల కోణాన్ని స్థిరపర్చటానికి విశేష కృషి చేసింది. ఆ వరుసలో ఇరవై మూడు పుస్తకాలు ప్రచురించింది. సామాజిక నిబద్ధతకు కట్టుబడి నిర్వాసిత, అభివృద్ధి, రాజ్య, కుల, మతాధిపత్య బాధిత స్త్రీలను పరామర్శించి వాళ్ళ ఉద్యమాలకు సంఘీభావం తెలిపింది. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి విస్తరించింది. వివక్షలు లేని సమాజ స్థాపన కోసం, ప్రజాస్వామిక వాతావరణం కల్పన కోసం, స్త్రీల సాహిత్య వికాసం కోసం పనిచేసే పదిహేనేళ్ళ ప్రరవే, ఏడవ మహాసభలకు జేజేలు.

నందిని సిధారెడ్డి
మంజీరా రచయితల సంఘం

ప్రజాస్వామిక వాదుల చారిత్రక బాధ్యత



మహిళా సాధికారత దిశగా భావజాల రంగంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక చేస్తున్న కృషికి అభినందనలు. కార్పోరేట్ శక్తులు తమ వ్యాపార ధనదాహంలో భాగంగా మరోసారి స్త్రీల హక్కులను కాలరాస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రరవే ఈసారి తీసుకున్న థీమ్ బాగుంది. సోషల్ మీడియా వేదికగా ప్రజాస్వామిక గొంతులపై తిరోగమన మనువాద శక్తుల దాడులు పెరిగిపోతున్న తరుణంలో సోషల్ మీడియాలో ట్రోలింగ్ అనే అంశం ప్రస్తుత సందర్భానికి సరిగ్గా సరిపోయే అంశం. ముఖ్యంగా మహిళా హక్కులకు, స్వేచ్ఛకు భంగం కలుగుతుంటే రాజ్యం కూడా తన వంతు గాయం చేస్తున్నది. తెలంగాణలో మరియమ్మ, టేకు లక్ష్మీ, బంజార లక్ష్మీ వంటి మహిళలపై జరిగిన అమానుష దాడులకు పౌర సమాజం పెద్దగా స్పందించిందే లేదు. ఇటువంటి దళిత, బహుజన స్త్రీలపై నిత్యం పెరిగిపోతున్న దాడులకు చెక్ పెట్టాలి. బాధితులకు అండగా నిలవాలి. అందుకు ఈ పురుషాధిపత్య సమాజాన్ని మానసిక పరివర్తన దిశగా నడిపించేందుకు ప్రరవే వంటి సంఘాలు మరింత ఉద్యమించాల్సిన చారిత్రిక సందర్భం ఇది.

పసునూరి రవీందర్
సమూహ

యువ నాటిక రచనల పోటీలు

తెలుగు రంగస్థలంపై యువత ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఈ నాటిక పోటీలకు లబ్ధప్రతిష్ఠులైన నాటక రచయితలతోపాటు ఔత్సాహిక రచయితలను, ప్రత్యేకించి రచనాసక్తి ఉన్న విద్యార్థి రచయితలను రచనలు చేయాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.7,500, రూ.5వేలు, రూ.2500. ప్రదర్శనా కాల పరిమితి 25 నుంచి 30 నిమిషాల మధ్య ఉండేలా సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యారంగ విధానాల వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకొని రాయాలి. రచనలో ఎక్కువ యువ పాత్రలు ఉండాలి. నాటిక ప్రతిపై నాటిక పేరు మాత్రమే ఉండాలి. రచన మూడు ప్రతులను ఫిబ్రవరి 29లోగా చిరునామా: కందిమళ్ల సాంబశివరావు, 3-391, పండరీపురం, 9వ లైను, చిలకలూరిపేట - 522616, పల్నాడు జిల్లా. ఫోన్: 98483 51517.

సర్రాజు బాలచందర్

ఉగాది కవితల పోటీ

శ్రీకార్తీక డెవలపర్స్ సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది కవితల పోటీకి ఏ అంశంపైన అయినా 20 పంక్తులకు తక్కువ కాకుండా 30 పంక్తులు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా: రూ.2500, రూ.2000, రూ.1500. రెండు ప్రత్యేక బహుమతులు: ఒక్కొక్కటి రూ.1000. కవితలు ఫిబ్రవరి 29 లోగా చిరునామా: ఎడిటర్, సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్ - 500102. ఫోన్: 94907 51681.

సాహితీకిరణం

'నేతికుండపై యెలుక'

తెలుగులో మనకు పూర్వం వ్యవహారంలో ఉండిన పదబంధాలలో, జాతీయాలలో ఎన్నెన్నింటిని మనం పోగొట్టుకున్నామో అలా పోగొట్టుకున్నవి ఒక్కొక్కటిగా తెలుస్తున్నకొద్దీ ఆశ్చర్యం వేస్తుంది. అర్థంపరంగా అవి తెలియజేసే సంగతిని వివరంగా మాటలలో చెప్పాలంటే ఒక్కొక్క పదబంధానికి లేదా జాతీయానికి కనీసం రెండు మూడు వందల మాటలున్న ఒక పేరా అన్నా పడు తుంది. అటువంటిదే తిక్కన కాలంలో (13వ శతాబ్దం) తప్పనిసరిగా సామాన్యజన వ్యవ హారంలో ఉండి, ఆ తరువాత ఎప్పుడో మనకు తెలియకుండానే జారిపోయిన ఒక అర్థవం తమైన, అందమైన, హాస్యస్ఫోరకమైన పదబం ధాన్ని గురించి ఈ చిన్న వ్యాసంలో ఇప్పుడు చర్చ.



రావణునికి కుంభీనస వరసకు చెల్లెలవుతుంది. రావణుడు లంకలో లేని సమయం చూసి మధువనే రాక్షసుడే ఒకడు ఆమెను బలవంతంగా తీసుకెళ్ళిపోతాడు. విభీషణుని ద్వారా ఈ సంగతిని తెలుసుకున్న రావణుడు అదివిన్న వెంటనే అగ్గి మీద గుగ్గిలమే అవుతాడు. "మన కన్నుగప్పి, మన ఇంట్లోంచే మన ఆడపడుచును తీసుకొని వెళ్ళడానికి వీడికి ఎన్ని గుండెలు వుండాలి? వీడిని ఇలా వదిలేస్తే, మనమంటే ఎవరికైనా, అం దునా ముఖ్యంగా ఆ దేవతలకు ఇక భయం అనేది వుంటుందా? ముల్లోకాలలో మరి మనల్ని లక్ష్యపెట్టేవాడు వుంటాడా? వాడి సంగతి చూడాల్సిందే!" అని ససైన్యంగా బయలుదేరి మధువనే వాడి ఇంటిపై విరుచుకు పడతాడు. ఈ విషయం తెలుసుకున్న కుంభీనస పరుగున వచ్చి అన్న కాళ్ళపై పడి "అన్నా, జరిగినదేదో జరిగిపోయింది. అతడిపుడు నా భర్త. వివాహ పద్ధతులలో రాక్షసమనే మార్గం కూడా ఒకటి వున్నది కాబట్టి, మా వివాహం ధర్మబద్ధంగా జరిగినదనే అనుకోవాలి. అందువలన కోపం తగ్గించుకుని, చెల్లెలినైన నా అభ్యర్థనను మన్నించి, నా భర్తను ఏమీ చెయ్యకుండా విడిచిపెట్టి, మఱిదిగా గౌరవించు"మని ప్రాధేయపడి, వేడుకుంటుంది. ఆమె మాటలకు రావణుని సమాధానం ఈ క్రింది పద్యం. తిక్కన రచించిన 'నిర్వచనోత్తర రామాయణము' షష్ఠాశ్వాసంలోనిది.

అలంతులం బోవు తప్పె
యిది యైనను నాతండు
నేతికుండపై
యెలుక నలంబుం బోవి
డిచి యేను భవత్పతిం
గాచితిన్ మనం
బలరంగం బోయి నిద్ర
దెలియంగ నుపాయము సేయు నాకు
నె
చ్చెలి యగుం దోడితెమ్మనినం
జేడియ సమ్మద మంది క్రమ్మఱన్.

- "చిన్నదిగా భావించి మన్నించాల్సిన తప్పా ఇది? అయినా అతడు నేతి కుండపై కూర్చునున్న ఎలుక చందమై ఉన్నాడు. నీ పతిని మన్నించానులే. ఈ సమయంలో సుఖంగా నిద్రిస్తూ ఉన్నాడని చెప్పావు కదా, వెళ్ళి అతగాడిని నిద్ర లేపి, సంగతిని చెప్పి నీ వెంట తీసుకొనిరా. నాకు తోడైనవాడిగా చేసుకుని గౌరవంగా చూసుకుంటాను" అని రావణుడు కుంభీనసతో చెప్పిన మాటలు పై పద్యం భావం.

ఇందులో మనకు కావలసింది 'నేతికండపై యెలుక' అనే పదబంధం గురించే. ఒకడు చేసిన అకార్యానికి వాడిని చితక కొట్టాలన్నంత కోపం మనసులో వుంటుంది. అయినప్పటికీ ఆ పని చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రత్యర్థి పడిపోయి ఉంటాడు. దానికి కారణం ఏమిటంటే, వాడిని అలా చితక తన్నడానికే గనుక పూనుకుంటే, ఆ క్రమంలో, వాడు ఎవరినైతే ఆశ్రయించి ఉన్నాడో వాళ్ళకు తప్పనిసరిగా చాలా గొప్ప హాని జరిగే ప్రమాదం వుంటుంది. అందువలన, ఇష్టంలేకపోయినా,

> **తెలుగులో మనకు పూర్వం వ్యవహారంలో ఉండిన పదబంధాలలో, జాతీయాలలో ఎన్నెన్నింటిని మనం పోగొట్టుకున్నామో అలా పోగొట్టుకున్నవి ఒక్కొక్కటిగా తెలుస్తున్నకొద్దీ ఆశ్చర్యం వేస్తుంది. అర్థంపరంగా అవి తెలియజేసే సంగతిని వివరంగా మాటలలో చెప్పాలంటే ఒక్కొక్క పదబంధానికి లేదా జాతీయానికి కనీసం రెండు మూడు వందల మాటలున్న ఒక పేరా అన్నా పడుతుంది.**

యేవిధమైన తొందరపాటు పని చెయ్యకుండా, చేతులు కట్టేసుకుని సౌమ్యంగా వాడికి నచ్చచెప్పి దారి మళ్ళించడం ఒకటే మిగిలివుండే మార్గం - అన్నది సందర్భానికి తగి వుండి పై పదబంధం (లేదా నానుడి) సూచించే అర్థం. ఇక్కడ రావణుడే గనుక చెల్లెలి మాటను వినకుండా తన పని తాను చేసుకుపోతే నష్టపోయేది తన చెల్లెలే, ఫలితంగా తాను కూడా- అన్నది స్పష్టపడుతున్న విషయం. ఇదిలా ఉండగా-

'పదబంధ పారిజాతము' ఈ పదబంధానికి 'రుచి మరిగి వదలనివాడు' అనే అర్థాన్ని చెప్పింది (ద్వితీయ సంపుటము, పే.318). 'నిర్వచనోత్తర రామాయణం' లోని పై సందర్భాన్నే ఉదాహరిస్తూ ఈ అర్థాన్ని పేర్కొన్నారు కాని, అది సందర్భానికి సరిపోయే అర్థంలా మాత్రం అనిపించదు. కారణం యేవిటంటే ఆ మాటలను చెప్పినది రావణుడు. పైగా అన్నది తన చెల్లెలైన కుంభీనసతోనే. ఆ అర్థాన్నే అన్వయించుకుంటే "నేతికుండవంటి నిన్ను రుచి మరిగి వదలలేక వున్నాడు వాడు. కనుక వాడిని నీవు కోరుకుంటున్నట్లుగానే క్షమించి వదిలి పెడుతున్నాను" అని ఒక అర్థరహితమైన, హేయమైన అర్థాన్ని చెప్పుకోవలసి వుంటుంది. అందువలన, ఆ అర్థాన్ని వదిలి "దండనార్హుడైనప్పటికీ, ప్రత్యర్థికి అందుకు వీలుపడనీయని స్థితియందున్నవాడు" అని సవరించడం ఉచితమని నేను భావిస్తాను.

భట్టు వెంకటరావు

అమీబాలమ్!



యూట్యూబ్ కామెంట్ బాక్సులో మాట్లాడుకున్న ప్రేమజంట రూపంలా వుంది భవిష్యత్తు స్వప్నం.
అస్పష్టాకార రూపం
దేనికీ ఒక రూపం లేదు. కానీ రూపం మారుతుంది

పొద్దుగాల నిమ్మలంగా ఉన్న ఆకాశం సాయంకాలానికి రక్తం స్రవిస్తూ కత్తుల్ని ప్రసవిస్తున్నట్లుంది
శాంతి అశాంతిగా ముగుస్తుంది, అశాంతి శాంతిగా మొదలవుతుంది
ప్రేమ రోజాలు విషాద శవయాత్రలో శోకిత పుష్పాలై రూపం మారుతుంది
అన్న తగిలించుకున్న స్విగ్గీ, జుమోటో బ్యాగుల గత రూపం
మద్దినేల అమ్మ తెచ్చే గడ్డిమోపుల్లాగా తోస్తుంది
నాణెంనుండి డిజిటల్లోకి జారిన రూపాయి
బ్రతుకు భాషకి కొత్త లిపి రాస్తుంది
లేఔట్ మింగిన చెరువు స్విమ్మింగ్‌పూల్ అవతారం
మహానగర ఉద్యానవనాల వెనకాతల తరిగిన అడవి ఆనవాళ్ళు,
కరిగిన కొండరాయి శకలాలు ప్రకృతి కొత్త ప్రదర్శనశాలలు
రూపం మాత్రం స్పష్టంగా మారుతుంది
మేకవన్నె పులి, పులివన్నె మేకల మూక రూపం కూడా
మారుతుంది
ఓటుకు ముందు తెల్లటోపి తర్వాత కుచ్చుటోపీ అవతారం

పూలమాటు ముళ్లని ప్రేమించే సుపరిచిత రూపాలు
నవ్వులమాటు విషాన్ని చిలికే అపరిచిత రూపాలు
ముందొకటి లోపలొకటి
రూపం స్పష్టంగా మారుతుంది

ఏమి నిశ్చలమిక్కడ? ఎవడు నిశ్చలమిక్కడ?
ఈ నిరాకార మనోవికార నిరర్థక నిర్దయ జీవజాడలో
భౌతికంగా మనమేకానీ సాంకేతికంగా మనం కాదు
కాలవాహినిలో నెరుపుకుపోతున్న ఏకకణ జీవజాలం అమీబాలమ్!
మన రూపం మారుతుంది
స్పష్టంగా మారుతుంది

వెంకటేష్ పువ్వాడ
72047 09732

పుస్తక ప్రదర్శనకు పుస్తకాలు

ఫిబ్రవరి 9 నుంచి జరిగే హైదరాబాద్ బుక్ ఫెయిర్లో తెలంగాణకు సంబంధించిన సాహిత్యాన్ని ప్రదర్శించేందుకు రచయితలు వారి పుస్తకాలను తెలంగాణ పబ్లికేషన్స్ కార్యాలయానికి పంపించగలరు. చిరునామా: కోయ చంద్రమోహన్, తెలంగాణ పబ్లికేషన్స్, హౌస్.నెం.1-1-80/15, ఆర్టీసి క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్ - 500020. ఫోన్: 863997216.

కోయ చంద్రమోహన్

వచన కవితా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం' కోసం 2023లో ప్రచురించిన వచన కవితా సంపుటాలు నాలుగు ప్రతులను ఫిబ్రవరి 29 లోపు చిరునామా: కొండి మల్లారెడ్డి, ఇం.నెం.19-61/5/సి, విద్యా నగర్, రోడ్.నెం. 3, మిలన్ గార్డెన్ రోడ్, కుశాల్ నగర్, సిద్దిపేట - 502103. ఫోన్: 9652199182.

పర్కపెల్లి యాదగిరి

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం

రంగినేని సుజాతా మోహన్ రావు ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా రంగినేని ఎల్లమ్మ పేర ఇచ్చే సాహిత్య పురస్కారానికి కవితా పురస్కారం కోసం 2023 సంవత్సరానికి వంశీకృష్ణ కవితా సంపుటి 'రెప్ప వాలని రాత్రి'ని ఎంపిక చేశారు. మార్చ్ 2024లో జరిగే కార్యక్రమంలో కవికి రూ.25వేలు నగదు, జ్ఞాపిక, పురస్కార పత్రం అందజేయబడతాయి.

రంగినేని మోహన్ రావు

మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం

మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 10 సా.4 గంటలకు గుంటూరులోని గుర్రం జాషువ విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. మద్దూరి విజయశ్రీ గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. సభలో శిఖామణి, జి.లక్ష్మీనరసయ్య, ప్రసాదమూర్తి, చల్లపల్లి స్వరూపరాణి, యం.యం. వినోదిని, కత్తి కల్యాణ్, ఖాజా, కోయి కోటేశ్వరరావు, జి.వి. రత్నాకర్, నూకతోటి రవికుమార్, కాకాని సుధాకర్ తదితరులు వక్తలుగా పాల్గొంటారు.

పల్నాటి శ్రీరాములు



భారీగా వచ్చిన జనసైనికులు, పవన్ కల్యాణ్‌తో బాలశౌరి, కుమారుడు అనుదీప్

జనసేనానితో బాలశౌరి

పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిక

- భారీ ప్రదర్శనగా తరలిన అనుచరులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి జనసేన పార్టీలో చేరారు. ఆదివారం మధ్యాహ్నం గుంటూరులోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన ఆయన మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి చేరుకున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ఆయన అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జనసేన కార్యాలయానికి బయలుదేరడానికి ముందు ఆయన గుంటూరు నాజ్ సెంటర్ వద్ద ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సతీసమేతంగా పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. బాలశౌరితోపాటు ఆయన కుమారుడు అనుదీప్ కూడా జనసేన కండువా కప్పుకున్నారు. బాలశౌరి చేరిక సందర్భంగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఆయన అభిమానులు పెద్దఎత్తున కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా మంగళగిరి జనసేన కార్యాలయానికి తరలి వెళ్లారు. బాలశౌరి మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగనున్నారు.



యువత సిద్ధం కావాలి

వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని తరిమికొట్టాలి..

- టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్
- భవిష్యత్‌ను మార్చే సత్తా యువతకే ఉంది.. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు
- జగన్‌పాలనలో అవినీతి రాజ్యం : కొనకళ్ల
- టీడీపీ వస్తేనే రాష్ట్ర భవిష్యత్ : యార్లగడ్డ
- గన్నవరంలో యువదళం బహిరంగ సభ
- వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరికలు

- 6లో..





- స్వరాభిషేకం..

సంగీత సన్మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం త్యాగరాజస్వామి పంచరత్న కృతుల గోష్ఠిగానం జరిగింది. 300 మందికి పైగా విద్వాంసులు త్యాగరాజస్వామికి స్వరాభిషేకం చేశారు.

సమధుర కళానికేతన్ 50వ వార్షిక వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న 26వ తెలుగు హాస్య నాటికల పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పీబీ సిద్దార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగిన చివరి రోజు కార్యక్రమాల్లో 'ఇంకానా నాటిక' ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం జరిగిన సభలో జంధ్యాల స్మారక పురస్కారాన్ని ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ ప్రదానం చేశారు.



- సుమధురం..

విజయవాడకు చెందిన ఒక విద్యార్థినికి గత ఏడాది నిర్వహించిన ఈఏపీసెట్‌లో 61 వేల ర్యాంకు వచ్చింది. కన్వీనర్ కోటాలో ఆమె ఐటీ చదువుతోంది. జేవీడీ (జగనన్న విద్యాదీవెన)కి దరఖాస్తు చేసుకుంది. కొద్దిరోజుల క్రితమే సీఎం జగన్ జేవీడీ విడుదలకు బటన్ నొక్కారు. అన్ని అర్హతలున్న ఆ యువతికి నిధులు జమకాలేదు. ఎందుకిలా జరిగిందని ఆన్‌లైన్‌లో అప్లికేషన్ స్టేటస్ పరిశీలిస్తే ఈఏపీసెట్ కాలమ్‌లో నాన్ ఎలిజిబుల్ అని ఉంది. ఇది చూసి ఆమె షాక్ తింది. ఇదే విషయాన్ని తండ్రికి చెప్పింది. ఇప్పటికిప్పుడు మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌కు అయ్యే రూ.78వేలు ఎక్కడి నుంచి తీసుకురావాలని ఆమె తండ్రికి బెంగ పట్టుకుంది.

ప్రసాద్ స్కూల్ స్థాయి నుంచి ఎస్‌సీ వి ద్యార్థి. తండ్రి ప్రైవేటు ఉద్యోగి. ఈఏపీసెట్‌లో ర్యాంకు సంపాదించి కన్వీనర్ కోటాలో ఇంజనీరింగ్ సీటును సంపాదించుకున్నాడు. ప్రసాద్ సోదరి వి శాఖలో ఇంజనీరింగ్ చదువుతోంది. ఆమెకు జేవీడీ జమ అయింది. ఆమెతోపాటే దరఖాస్తు చేసుకున్నా ప్రసాద్‌కు మాత్రం జేవీడీ జమ కాలేదు. అప్లికేషన్ స్టేటస్ పరిశీలిస్తే సెట్ ఎలిజిబులిటీ నో అని చూపిస్తోంది. ఇప్పుడు అతడి తండ్రిలో ఫీజు కోసం ఆందోళన మొదలైంది.



ఇంజనీరింగ్‌లో జేవీడీ బెంగ

ఆందోళన కలిగిస్తున్న 'సెట్ నాట్ ఎలిజిబుల్'

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : 'ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తున్నాం. బటన్ నొక్కి, నేరుగా వి ద్యార్థులు, తల్లుల అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తున్నాం' - జగనన్న విద్యాదీవెన సభలో సీఎం జగన్ చెప్పిన మాటలు ఇవి. ఈ మాటలు సభలో ఉన్న వారికి ఆనందాన్ని కలిగించినా, ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఆందోళన కలిగిస్తున్నాయి. వారి తల్లిదండ్రులకు ఫీజు బెంగను పెంచుతున్నాయి. కొద్దిరోజుల క్రితమే సీఎం జగన్ జేవీడీ నిధులను వి డుదల చేసిన విషయం తెలిసిందే. సీఎం నొక్కిన బటన్‌తో జేవీడీ డబ్బులు ఈఏపీసెట్‌లో మొదటి విడత విడుదల చేసిన ర్యాంకులు జాబితాలో ఉన్న వారికి మాత్రమే జమయ్యాయి. రెండో విడత విడుదల చేసిన ర్యాంకుల జాబితాల ద్వారా సీట్లు సంపాదించుకున్న వి ద్యార్థులకు జేవీడీ విడుదల కాలేదు. ఇదే ఇప్పుడు వి ద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులు ప్రస్తుతం ఇంజనీరింగ్ తరగతులకు హాజరవుతున్నారు. వారి జేవీడీ అప్లికేషన్ స్టేటస్‌ను జ్ఞానభూమి వెబ్‌సైట్లో పరిశీలిస్తే సెట్ ఎలిజిబులిటీ నో అని చూపిస్తోంది. అంటే ఈ విద్యార్థులు ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించలేదని అర్థం. దీనితోపాటు పెండింగ్ ఎట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఫర్ ఓటీపీ అని కనిపిస్తోంది. ఈ పెండింగ్‌లతో జేవీడీ నిధులు విడుదల చేస్తారా లేదా అని తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోంది. ఈ నిధులను ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా కళాశాలకు చెల్లించుకో వచ్చన్నది విద్యార్థుల తల్లిదండ్రుల భావన. ఒకవేళ ఈ డబ్బులు జమ కాకపోతే మొదటి సంవత్సరం ఫీజును ఎలా చెల్లించాలో వారికి తెలియడం లేదు.

కన్వీనర్ కోటా విద్యార్థులకు జమ కాని విద్యాదీవెన

- దరఖాస్తు స్టేటస్‌లో ఓటీపీ పెండింగ్
- సెట్ కేటగిరీలో ఎలిజిబులిటీ నో
- ఫీజుల కోసం కళాశాలల ఒత్తిడి
- ఆయా శాఖలకు అందుతున్న ఫిర్యాదులు
- తమ చేతుల్లో లేదంటున్న సంక్షేమ శాఖలు
- ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అసలేం జరిగింది?

2022-23 విద్యాసంవత్సరంలో ఈఏపీసెట్ (ఎంసెట్)కు ఇంటర్మీడియట్ విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయానికి రెండో సంవత్సరం హాల్‌టికెట్లు రాలేదు. దీంతో మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబర్‌తో దరఖాస్తు చేసుకున్నారు. 2023లో ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజ్ ఇచ్చారు. ఈ మార్కులు కలిపి ఈఏపీసెట్‌లో ర్యాంకులు కేటాయించారు. ఈఏపీసెట్‌లో ఎంత ర్యాంకు వచ్చిందో చూసుకోవాలంటే విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబరు వేయాలి. తర్వాత ఈఏపీసెట్ అధికారులకు విద్యార్థుల మొబైల్ నంబర్లు, కళాశాలలకు ఒక లింక్‌ను పంపారు. ఈ లింక్‌లో ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబర్ రిజిస్టర్ చేయాలని సందేశాలు పంపారు. విద్యార్థులు, కళాశాలలు ఈ లింక్‌ను తెరవగానే కొందరి నంబర్లు మాత్రమే స్వీకరించింది. కొందరు విద్యార్థులు రెండో సంవత్సరం హాల్‌టికెట్ నంబర్ నమోదు చేయగానే ఎర్రర్ వచ్చింది. తర్వాత ఎర్రర్ వచ్చిన విద్యార్థులు హాల్‌టికెట్ నంబర్‌ను లింక్‌లో ఎంటర్ చేయలేకపోయారు. కొన్నిరోజులకు ఈఏపీసెట్ ఫలితాలు విడుదల చేశారు. రెండో సంవత్సరం హాల్‌టికెట్ నంబర్లు ఎంటర్ చేసిన వారికి మాత్రమే వెయిటేజ్ మార్కులతో ర్యాంకును ప్రకటించారు. హాల్‌టికెట్ నంబర్లు ఎంటర్ చేయని విద్యార్థులకు ర్యాంకులు ప్రకటించలేదు. దీనిపై రాష్ట్రం నలుమూలల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈఏపీసెట్ అధికారుల ఆ వెబ్‌సైట్‌లో రెండో సంవత్సరం హాల్‌టికెట్ నంబర్ ఎంటర్ చేసుకునేందుకు కొన్నిరోజులు గడువు ఇచ్చారు. ఇది పూర్తయిన తర్వాత రెండో విడతగా విద్యార్థుల ర్యాంకులను ప్రకటించారు.

మొదటి, రెండో విడతలో విడుదల చేసిన ర్యాంకుల జాబితాలో ఉన్న విద్యార్థులు కన్వీనర్ కోటాలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించారు. 2023-2024 ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యాదీవెన కింద ఆయా కళాశాలల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. విద్యార్థుల్లో అర్హులను తేల్చడానికి ఆరు స్థాయిల్లో పరిశీలన కోసం ఈ దరఖాస్తులు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లకు వెళ్లాయి. అర్హతను వెల్ఫేర్ అసిస్టెంట్లు నిర్ధారించాక దరఖాస్తులు బీసీ విద్యార్థులకు చెందినవి బీసీ సంక్షేమ శాఖకు, ఎస్సీ విద్యార్థులకు చెందినవి సాంఘిక సంక్షేమ శాఖకు వెళ్లాయి. ఆయా అధికారులు వాటిని డిజిటల్ సిగ్నేచర్ వెరిఫికేషన్ చేశారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అర్హులైన విద్యార్థులకు అడ్మిషన్ వివరాల కేటగిరీలో సెట్ టైపు ఆప్షన్‌లో సెట్ ఎలిజిబులిటీ నో అని కనిపిస్తోంది. దరఖాస్తులో స్టేటస్‌లో పెండింగ్ ఎట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఫర్ ఓటీపీ అని కనిపిస్తోంది. దీనిపై తల్లిదండ్రులు ఆందోళనతో సంబంధిత సంక్షేమ శాఖ అధికారుల వద్దకు వెళ్తున్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని వారికి అధికారులు సమాధానం చెబుతున్నారు. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖలో టెక్నికల్ అధికారిని వి వరణ కోరగా "వారం రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి. యూనివర్సిటీల నుంచి ర్యాంకులకు సంబంధించిన పూర్తి సమాచారం కళాశాలలకు ఇంకా వెళ్లలేదు. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని తెలిపారు.

రెండో జాబితాలో ఉన్న వారికి నో ఎలిజిబులిటీ

అధికార పార్టీ నేతల అండదండలలో ఇష్టారీతిన వి ర్రవీగిన ఓ అధికారికి దిమ్మదిరిగే షాక్ తగిలింది. వైసీపీ నేతల కనుసన్నల్లో ఎంపీడీవోల బదిలీలకు ఆయన తెరదీశారు. ఇక ఎన్నికల విధులను నుంచీ బయటపడాలనుకున్నారు. ఆయనే జడ్పీ సీఈఓ జ్యోతిబసు. ఎన్నికల విధుల నుంచి తప్పించు కునేందుకు ప్రజాప్రతినిధుల ద్వారా కృష్ణా కలెక్టర్‌పై తీవ్ర ఒత్తిళ్లు తీసుకొచ్చారు. తొలుత వి భేదించిన కలెక్టర్ చివరకు ఒత్తిళ్లకు తలొగ్గారు. జడ్పీ సీఈఓకు ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. ఎన్టీఆర్ కలెక్టర్ రంగంలోకి రావడంతో కథ అడ్డం తిరిగింది. జ్యోతిబసుకు తిరువూరు ఎన్నికల విధులు కేటాయించి షాక్ ఇచ్చారు.

అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి..!



అధికార పార్టీకి అంటకాగిన జడ్పీ సీఈఓకు షాక్

- ఎన్నికల విధుల నుంచి తప్పించుకునేందుకు జ్యోతిబసు విశ్వప్రయత్నం
- అధికార పార్టీ నేతలతో రెండుసార్లు కృష్ణా కలెక్టర్‌పై ఒత్తిళ్లు
- ఏమీ చేయలేక మినహాయింపు ఇచ్చిన రాజబాబు
- తిరువూరులో ఎన్నికల విధులు కేటాయించి షాక్ ఇచ్చిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణా జిల్లా కలెక్టర్ రాజబాబు జడ్పీ సీఈఓ జ్యోతిబసుకు తొలుత మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ)కి సంబంధించిన డ్యూటీ వేశారు. 2023 నవంబరు 21న ఈ మేరకు జడ్పీ సీఈఓకు ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఎన్నికల విధుల నుంచి తప్పించుకునేందుకు కలెక్టర్‌పై తీవ్ర ఒత్తిళ్లు తీసుకురావటం ప్రారంభించారు. నెల రోజులకుపైగా ఒత్తిళ్లు రావటంతో.. చివరికి ఆయనను జనవరి 4వ తేదీన ఎన్నికల విధుల నుంచి కలెక్టర్ తప్పించారు.

స్థానిక జిల్లా అధికారుల వివరాలు కోరిన ఎన్నికల కమిషన్

రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి స్థానిక జిల్లాకు చెందిన వారి వివరాలను పంపాల్సిందిగా కృష్ణా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. జడ్పీ సీఈఓ స్థానిక జిల్లాకు చెందిన వ్యక్తి కావటంతో.. అతని పేరును కచ్చితంగా ఎన్నికల కమిషన్‌కు పంపిం చాల్సి ఉంది. స్థానికులను కచ్చితంగా బదిలీ చే యాల్సి ఉంటుంది. దీంతో బదిలీ భయం పట్టు కున్న జడ్పీ సీఈఓ మళ్లీ ఈ గండం నుంచి గట్టెక్కేందుకు తిరిగి అధికార పార్టీ పెద్దల చెంతకు చేరారు. అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత ద్వారా మళ్లీ కృష్ణా కలెక్టర్ రాజబా బుపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకొచ్చినట్టు తెలిసింది. జడ్పీ సీఈఓను స్థానిక జిల్లా అధికారుల జాబితాలో పంపించవద్దని అధికార పార్టీ పెద్దల ఒత్తిళ్లతో కలెక్టర్ సందిగ్ధంలో పడ్డారు. రాజకీయ ఒత్తిళ్లతో ఇప్పటికే జడ్పీ సీఈఓకు ఎన్నికల వి ధుల నుంచి తప్పించారు. ఎలక్షన్ కమిషన్‌కు పంపించాల్సిన రిపోర్టును సరిగా ఇవ్వకపోతే కలెక్టర్‌పై చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంది. దీంతో కలెక్టర్ మొదట్లో అంగీకరించలేదని తెలుస్తోంది. కలెక్టర్ ఎన్ని చెప్పినా జడ్పీ సీఈఓ జ్యోతిబసు ఇక్కడి నుంచి కదలటానికి ఇష్టపడలేదు. చివరికి ఎన్నికల సంఘానికి పంపిన స్థానిక జిల్లా అధికారుల జాబితాలో జడ్పీ సీఈఓ పేరు పొందు పరచలేదని తెలుస్తోంది. అయితే ఆయన ఊపిరి పీల్చుకునేలోపే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిమ్మ తిరిగే షాక్ ఇచ్చారు. జడ్పీ సీఈఓకు తిరువూరులో ఎన్నికల విధులు కల్పించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌పై ఏ విధంగా ఒత్తిళ్లు తీసుకురావాలా అని ఆలోచిస్తున్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఎంపీడీవోల బదిలీలు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో తలపెట్టిన ఎంపీడీఓల బదిలీలు అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరగటం తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది. ఎన్నికలకు సంబంధించి ఇతర జిల్లాల ఎంపీడీవోలను ఉమ్మడి కృష్ణా జిల్లాకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆదేశాల ప్రకారం ఉమ్మడి జిల్లాకు కేటాయింపు జరిగిన ఎంపీడీవోలకు కృష్ణా కలెక్టర్ మాత్రమే అంతర్గతంగా వివిధ మండలాలకు స్థానాలను కల్పించాల్సి ఉంది. దీనికి భిన్నంగా జడ్పీ సీఈఓ తానే చొరవ తీసుకుని ఎంపీడీవోలకు పోస్టింగులు ఇచ్చేశారు. అధికార పార్టీ నేతల సూచనల మేరకు ఎంపీడీవోలకు స్థానాలను కల్పించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ బదిలీల మాటున ముడుపుల పర్వం కూడా నడిచిందని తెలుస్తోంది. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు కూడా చేతులు మారినట్టు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. డబ్బులు ఇచ్చిన వారికి దగ్గర స్థానాల్లో, డబ్బులు ఇవ్వని వారికి దూర ప్రాంతాల్లో కేటాయించటంపైనా విమర్శలు వస్తున్నాయి. తనతో సంబంధం లేకుండానే జడ్పీ సీఈఓ ఎంపీడీవోలను బదిలీ చేయటంపై కృష్ణా కలెక్టర్ రాజబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్గత బదిలీలు తాను చేయాల్సి ఉండగా... నువ్వెలా చేస్తావని నిలదీయటంతో.. జడ్పీ సీఈఓ నీళ్లు నమిలారు. ఆ తర్వాత కలెక్టర్ జోక్యంతో పలువురి బదిలీలను మార్చారు.

జోగి వల్లే దూరం!

వైసీపీ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదు

- అనుచరులతో ఆత్మీయ సమావేశంలో వసంత కృష్ణ ప్రసాద్
- నేడు ఐతవరంలో మరోసారి సమావేశం
- భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించనున్న వసంత



(విజయవాడ - ఆంధ్రజ్యోతి/నందిగామ) 'నేను ఎమ్మెల్యేగా ఉన్న మైలవరం నియోజకవర్గంలో జోగి రమేశ్ జోక్యం చేసుకుంటున్నాడని, నాకు ఇబ్బందికరంగా ఉందని పార్టీ పెద్దలతో పాటు సీఎం జగన్‌కు స్వయంగా విన్నవి ంచాను. అయినా జోగి రమేశ్‌ను కట్టడి చేయలేదు. కొండపల్లి మున్సిపల్ ఎన్నికల్లో జోగి వర్గం వ్యతిరేకంగా పనిచేయటం వల్లే అక్కడ వైసీపీ ఓడిపోవాల్సి వచ్చింది. మంత్రి అయిన తర్వాత నియోజకవర్గంలో రమేశ్ జోక్యం ఇంకా ఎక్కువైంది. ఈ వి షయాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీలో పనిచేయడం ఇష్టంలేక పార్టీకి దూరంగా ఉంటున్నాను' అని మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వ్యాఖ్యానించారు. నందిగామ మండలం ఐతవరంలోని తన స్వగృహంలో ఆదివారం మైలవరం నియోజకవర్గానికి చెందిన తన అనుచరులతో వసంత కృష్ణ ప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తాను వైసీపీకి ఎందుకు దూరం కావాల్సి వచ్చిందన్న వి షయాలను వారితో పంచుకున్నారు. వైసీపీలో తాను క్రమశిక్షణతో పనిచేసినా తనకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను సీఎంకు తెలిపేందుకు పలుమార్లు ప్రయత్నించానని, కానీ ఆయన్ను కలవడం కూడా కుదరలేదన్నారు.

నేడు ఐతవరంలో పార్టీ కార్యకర్తల సమావేశం

ఆదివారం నాటి ఆత్మీయ సమావేశం వివరాలను మీడియాకు వివరించేందుకు వసంత నిరాకరించారు. అన్ని విషయాలూ సోమవారం సాయంత్రం వెల్లడిస్తానని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఐతవరంలో నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రావాల్సిందిగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. కొద్దికాలంగా వసంత వైసీపీ ప్రభుత్వంపై పరోక్ష వి మర్శలు చేస్తూ వస్తున్నారు. సంక్షేమం ఒక్కటే కాదు... అభివృద్ధి కూడా ఎంతో ముఖ్యమని, దాన్ని వైసీపీ విస్మరించిందన్న ఆయన వ్యాఖ్యలను ఆ పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. అదే సమయంలో సిద్ధం సభకు జనసమీకరణ చేయబోనని, తానూ హాజరుకానని వైసీపీ పెద్దలకు వసంత చెప్పడంతో వారు హడావిడిగా మైలవరం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా సర్నాల తిరుపతిరావును నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు.

చోడవరంలో ఆగని ఇసుక దందా

- ఆదివారం రాత్రి బోడె ప్రసాద్ తన అనుచరులతో మళ్లీ ఇసుక రీచ్‌లోకి
- రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన జోగి అనుచరులు

- 6లో..


అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

దుర్గగుడిలో భక్తజన సందడి

వన్‌టౌన్, ఫిబ్రవరి 3 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చారు. అర్చకులు అరుణపారాయణ, సూర్య ఆరాధన చేశారు. సకల జనుల ఆయురారోగ్యాలు బాగుండాలని కోరుతూ సంకల్పం చేశారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని అమ్మవారి దర్శనం శీఘ్రంగా అయ్యేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఏఈవో రమేష్ పర్యవేక్షించారు.



దుర్గమ్మను దర్శించుకున్న సినీనటులు

యువ సినీనటులు కిరణ్ అబ్బవరం, రక్షిత్‌లు దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, ఆశీర్వచనం అందచేశారు.

13 నుంచి సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు



మోపిదేవి, ఫిబ్రవరి 4 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని వాల్ పోస్టర్లను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 13వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 14వ తేదీ రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం కళ్యాణ మహోత్సవం కన్నుల విందుగా జరుగుతుంది. 15వ తేదీ రాత్రి 8 గంటలకు స్వామివారి రథోత్సవం, 16వ తేదీ వసంతోత్సవం, 17వ తేదీ ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పశయాలంకృత పర్యంక సేవతో ముగుస్తాయి. కార్యక్రమంలో ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు పాల్గొన్నారు.



అలరించిన త్యాగరాజ పంచరత్న కృతులు

విజయవాడ కల్చరల్, జనవరి 4 : 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు.. చందురు వర్ణుని అంద చందమును హృద యారవిందమును జూచి బ్రహ్మానందమనుభవించు వారెందరో మహానుభావులు..' అంటూ సంగీత విద్వాంసుడు త్యాగరాజ స్వామి పంచరత్న కృతుల గోష్టి గానంలో శ్రోతలను పరమానంద భరితులను చేశారు. సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత సన్మండలి, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ఉదయం ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానం నిర్వహించారు. 300 మందికి పైగా విద్వాంసులు పాల్గొని త్యాగరాజ స్వామికి స్వరాభిషేకం నిర్వహించారు. బృందగానంలో సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, వేమూరి విశ్వనాథ్, పోపూరి శ్యాంసుందర్ గుడివాడ, కొత్తూరి షణ్ముఖ శ్రీరంజని, ఆస్ట్రేలియాకి చెందిన కె.సుధీర్ శర్మ, హైదరాబాద్‌కు చెందిన మృదురవల్లి, కేవీ బ్రహ్మానందం, చిట్టా కార్తీక్, వడ్లమాని శ్రీవిద్య, ఇంద్రకీలాద్రి శర్మ, కె.శశిధర్, బందరుకు చెందిన ద్రోణేంద్ర ఫణికుమార్, సీవీపీ శాస్త్రి, గండూరి శ్రీనివాస్ మూర్తి, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, బెంగళూరుకు చెందిన అలేఖ్య, పోపూరి గాయత్రి, గౌరీనాథ్, అంజనా సుధాకర్, సుమతి రామ్మోహన్, విష్ణుభట్ల సోదరీమణులు, బీవీఎస్ ప్రసాద్, సద్గురు చరణ్, భమిడిపాటి శ్రీలలిత, కె.జగన్మోహిని, కనకదుర్గ, హేమాద్రి చంద్రకాంత్, శివానిలు కచేరీలో పాల్గొన్నారు. ఆకాశవాణి, దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఆకాశవాణి ప్రతినిధులు వి.వెంకటేశ్వర్లు, ఖుద్దూస్ పాల్గొన్నారు. ఇందులో 18 బృందాలు పాల్గొని గానం చేశాయి. మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.


'ఇంకానా' నాటికలో ఓ సన్నివేశం

నేటి సినీ రచయితలకు స్ఫూర్తి జంధ్యాల

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 : హాస్య బ్రహ్మ జంధ్యాల నేటి సినీ రచయితలకు స్ఫూర్తి అని, కథానాయకుడికి మాటలతో సినిమాలో ప్రత్యేక ఉనికిని సృష్టించడం ఆయనతోనే ప్రారంభమైందని ప్రముఖ సినిమా మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ అన్నారు. సమధుర కళానికేతన్ 50వ వార్షిక వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న 26వ తెలుగు హాస్యనాటికల పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. వేదికపై సభలో జంధ్యాల స్మారక పురస్కారం, ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్‌కు అందజేసి సత్కరించా ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ, జంధ్యాల స్మారక పురస్కారం అందుకోవడం తన అదృష్టమన్నారు. నాటక రచనే తనకు తృప్తినిస్తుందన్నారు. ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఛైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు మాట్లాడుతూ, ఒక వ్యక్తిని ఏడిపించడం చాలా సులభం కానీ నవ్వించడం అంత తేలికైన విషయం కాదన్నారు. సభాధ్యక్షుడు సామంతపూడి నరసరాజు మాట్లాడుతూ, 50 సంవత్సరాలుగా నిరంతరాయంగా కళల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత సుమధురదే అన్నారు. ఎంసీ దాస్, న్యాయవాది దారా సత్యనారాయణ, సుమధుర సీనియర్ సభ్యులు టీవీఎస్ ఆంజనేయరాజు, కార్యదర్శి పీవీ భాస్కరశర్మ, డి.కైలాసరావులు పాల్గొన్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు

నారాయణబాబు రచనకు వాసు దర్శకత్వంలో మహిళ చైతన్యవంతురాలు కావాలని ప్రబోధిస్తూ ఎస్.డి.ఎం సిద్ధార్థ కళాశాల విద్యార్థినులు 'ఇంకానా' నాటికను ప్రదర్శించారు. అనంతరం బి స్టూడియో హైదరాబాద్ బృందం 'న్యూ బాంబే టైలర్స్' ప్రదర్శించారు. ప్రముఖ యువ గాయని భమిడిపాటి శ్రీలలిత మధుర మధుర మీనాక్షి, భరత వేదమున పాటలను శ్రావ్యంగా వినిపించారు. కీర్తనా శ్రీనివాస్, ప్రణీత, బి.రాజశేఖర్, మల్లిక్ మనోరంజకంగా గానంచేశారు. లేఖ్యాభరణి బృందం, శృతి సమన్వి, సాయి వర్షితవర్మ, సింగారమణి అజయ్, వాసు, సంస్కారభారతి బృందాల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ముత్యాల చెరీ స్వరూప్, చెకిత్ ప్రణయ్, వైష్ణవి వాయిద్య విన్యాసం అబ్బురపరిచింది. పిండిప్రోలు కృష్ణకుమారి బృందం వాయిద్య విన్యాసం, గానం ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నాయి. పసుపర్తి శివరామ్ కుమార్ చిన్నారులను ఉత్సాహపరుస్తూ వ్యాఖ్యానం అందించారు.

యువత సిద్ధం కావాలి

వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని తరిమికొట్టాలి..

- టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్
- భవిష్యత్‌ను మార్చే సత్తా యువతకే ఉంది
  యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు
- జగన్ పాలనలో అవినీతి రాజ్యం : కొనకళ్ల
- టీడీపీ వస్తేనే రాష్ట్ర భవిష్యత్ : యార్లగడ్డ
- గన్నవరంలో యువదళం బహిరంగ సభ
- వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరికలు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు


మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి రాజేశ్

గన్నవరం, ఫిబ్రవరి 4 : దళితులను మోసం చేసిన జగన్‌రెడ్డిని తరిమికొట్టేందుకు యువత సిద్ధం కావాలని టీడీపీ అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ పిలుపునిచ్చారు. కృష్ణా, గుంటూరు జిల్లాలను నాశనం చేసి భూములకు ధరలేకుండా చేశారని మండిపడ్డారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు లక్ష్మణుడిలా యార్లగడ్డ వెంకట్రావు నిలబడ్డారని చెప్పారు. తెలుగు యువత ఆధ్వర్యంలో యువదళం బహిరంగసభ ఆదివారం గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగింది. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొసరాజు సాయి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజేశ్ మాట్లాడుతూ, రాజధాని లేకుండా చేసిన జగన్‌రెడ్డికి జిల్లా ప్రజలు రాజకీయ సమాధి కట్టాలన్నారు. చంద్రబాబు అమరావతిని రాజధాని చేస్తే అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి మూడు రాజధానుల పేరుతో ఈ ప్రాంతాన్ని నాశనం చేశారన్నారు. వైసీపీని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలన్నారు. నిజాయితీ పరుడైన యార్లగడ్డ వెంకట్రావును 2024లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ, దేశ భవిష్యత్‌ను మార్చే సత్తా యువతకే ఉందన్నారు. జగన్ రెడ్డి యువతను నాశనం చేశారని.. భావితరాల భవిష్యత్ బాగుపడాలంటే చంద్రబాబును సీఎం, యార్లగడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విజయయాత్ర గన్నవరం నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలను అణచివేయాలనే కుట్రలు సరికాదన్నారు. లోకేశ్ పాదయాత్రను అడుగడుగునా అడ్డుకోవాలని చూసినప్పటికీ ప్రజాబలంతో విజయవంతం అయిందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, మహానుభావులు పాలించిన గన్నవరం నేడు పనికిమాలిన స్థితిలోకి రావటం బాధాకరమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అధికారంలోకి వచ్చిన 9 మాసల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. యువతను బలోపేతం చేయాలనే లక్ష్యంతోనే యువదళం బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. యువత భవిష్యత్ బాగుండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు సీఎం కావాలన్నారు. తొలుత చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, నాయకులు పరుచూరి నరేశ్, కొలుసు రాము, నూతలపాటి నాగభూషణం, సజ్జా అజయ్, జాస్తి వెంకటేశ్వరరావు, బోడపాటి రవి, కోనేరు సందీప్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, బచ్చుల బోస్, దొంతు చిన్న, చిరుమామిళ్ల సూర్యం, గూడవల్లి నర్సయ్య, మూల్పూరి సాయి కళ్యాణి, మండవ లక్ష్మి, మేడేపల్లి రమాదేవి, ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి తెలుగు యువత నాయకులు భారీ సంఖ్యలో సభకు తరలివచ్చారు. పసుపు జెండాలతో గన్నవరం పసుపుమయమైంది. సభ ప్రాంగణం వద్ద యువత జై చంద్రబాబు, జై యార్లగడ్డ అంటూ నినాదాలు చేశారు. సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ కేరింతలు కొట్టారు.

టీడీపీలో భారీగా చేరికలు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో అంబాపురం, దండగుంట్ల, కేసరపల్లి, జక్కులనెక్కలం, బూతిమిల్లిపాడు, కొయ్యూరు, గన్నవరం, బొమ్ములూరు, బిళ్లనపల్లి, తేలప్రోలు తదితర గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్‌లు ఆయాగ్రామాల నాయకులు టీడీపీలోకి వచ్చారు. వీరికి కొనకళ్ల నారాయణ, యార్లగడ్డ వెంకట్రావు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు.

చోడవరంలో ఆగని ఇసుక దందా

- జేసీకేసీ సంస్థ పేరుతో అక్రమ క్వారీయింగ్
- అనుచరులతో కలిసి అడ్డుకున్న బోడె
- రిజిస్టర్లలో ఎమ్మెల్యే తాలూకా
  వాహనాలకు లోడింగ్ అంటూ నెంబర్లు


రీచ్‌లో రిజిష్టర్‌ను చూపిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 4 : చోడవరం రీచ్‌లో ఇసుక అక్రమ దందా కొనసాగింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో అక్రమ తవ్వకాలు జరిగే రీచ్‌కు బోడె ప్రసాద్ టీడీపీ, జనసేన కార్యకర్తలతో కలిసి వెళ్లారు. అక్కడభారీగా ఇసుక లోడింగ్ చేస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. జేసీకేసీ సంస్థ తరపున క్వారీయింగ్ చేస్తున్నామంటూ సమాధానం చెప్పడంతో అక్కడే బైఠాయించారు. అక్కడ ఉన్న రిజిస్టర్లను పరిశీలించగా, ఎమ్మెల్యే వాహనాలకు లోడింగ్ అని ఉండటంతో పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫోన్లు చేశారు. అనంతరం బోడె మాట్లాడుతూ, జేసీకేసీ సంస్థ పేరు చెప్పి జోగి రమేశ్ తన ముఠాతో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఉదయం, సాయంత్రం, అర్ధరాత్రి ఇసుకను దోచుకుంటున్న జోగి రమేశ్ అక్రమ మైనింగ్‌ను ప్రజల్లోకి తీసుకెళతానని పేర్కొన్నారు. ఇసుక రీచ్‌లో ఎమ్మెల్యే పేరుతో వాహనాలు, రిజిస్టర్ల ద్వారా జోగి అక్రమ దందాలు బయటపడ్డాయని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

- ఐఎంఏ, ప్రభుత్వ వైద్య సంఘం ప్రతినిధులు


సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న వైద్య సంఘాల ప్రతినిధులు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 4 : వృత్తిపరంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తుందని వివిధ వైద్య సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ఏలూరు రోడ్డులోని హోటల్‌లో ఇండియాన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ప్రభుత్వ వైద్య సంఘం, ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం, ఏపీ ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్స్ సంఘం ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. జయచంద్ర నాయుడు మాట్లాడుతూ, 2008లో వైద్యులు, సిబ్బంది, ఆసుపత్రుల రక్షణ కోసం ప్రభుత్వం తెచ్చిన చట్టం సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సవరణలు చేసి సమగ్ర చట్టం తీసుకురావాలని, సవరణకు సమయం సరిపోకుంటే ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులు స్వేచ్ఛగా సేవలు అందించే వాతావరణం కల్పించాలని కోరారు. డాక్టర్లపై ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో సుప్రీంకోర్టు తీర్పులు, నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా రూల్స్ ఫ్రేమ్ చేయాలని కోరారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌కు సింగిల్ విండో విధానం, ఫైర్ విభాగం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్ణయాలు ఆసుపత్రుల విషయంలో ఏకపక్షంగా తీసుకోకుండా ఐఎంఏతో సంప్రదించాలని కోరారు. డిమాండ్లకు ప్రభుత్వం స్పందించకుంటే తప్పనిసరి పరిస్థితిలో ఉద్యమబాట పడతామని, ఆసుపత్రులు మూసివేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యులు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నా తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఉదాసీనత వైఖరి అవలంబించడం సరికాదన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ, వైద్యుల రక్షణ చట్టాన్ని సవరించాలని, వైద్యులపై కేసులు నమోదు చేసే సమయంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించి అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పోలవరపు ఫణిధర్, రాష్ట్ర ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ నందకిషోర్, ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాణాల రమేష్, ఏపీ ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ రమేష్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చైతన్య, ఐఎంఏ విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రమోద్, డాక్టర్ శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలో రివర్ క్రాస్ ఈత పోటీలు

- పాల్గొన్న 433 మంది స్విమ్మర్లు



తాడేపల్లి, ఫిబ్రవరి 4 : ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24వ కృష్ణానది రివర్ క్రాస్ రాష్ట్రస్థాయి ఈత పోటీలను ఆదివారం నిర్వహించారు. విజయవాడ దుర్గాఘాట్ నుంచి సీతానగరం వరకు జరిగిన పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి మొత్తం 367 మంది పురుషులు, 66 మంది మహిళలు పాల్గొన్నారు. ఆరు కేటగిరీలుగా పోటీలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు పోటీలను దుర్గాఘాట్ వైపు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎంఎస్‌కె ప్రసాద్, దివీస్ లాబొరేటరీ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ దివి మధుసూదనరావు, లైలా గ్రూప్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మ ప్రారంభించారు. అనంతరం ఉండవల్లి కరకట్ట వద్ద వున్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గోకరాజు గంగరాజు మాట్లాడుతూ, వచ్చే ఏడాది 25వ కృష్ణానది రివర్ క్రాస్ ఈత పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎంఎస్‌కె ప్రసాద్ మాట్లాడుతూ, అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విజయవంతంగా ఈత పోటీలను నిర్వహించడమే కాక ప్రతి ఏడాది సమ్మర్ కోచింగ్ క్యాంప్ ద్వారా ఉచితంగా ఈత నేర్పడం విశేషమన్నారు. మానసిక ఉల్లాసానికి దేహదారుఢ్యానికి ఈత ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దివి మధుసూదనరావు, అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

26 మంది పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లపై వేటు

జి.కొండూరు, జనవరి 4 : మైలవరం నియోజకవర్గంలో రాజకీయ దుమారం రేగుతోంది. ఎమ్మెల్యే వసంత పార్టీని వీడుతుండటంతో వైసీపీ సర్కార్ వసంతపై చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో ఆయన నియమించిన నియోజకవర్గంలోని 26 పీఏసీఎస్‌ల చైర్ పర్సన్లపై ప్రభుత్వం వేటు వేస్తూ శనివారం రాత్రి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జికు అధికారం ఇస్తూ జీవో విడుదల చేశారు. వేటు పడిన వారిలో మెజార్టీ పర్సన్ ఇన్‌చార్జిలు ఆది నుంచి వైసీపీలో కొనసాగిన వ్యక్తులు, పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడిన వారు కావడంతో ప్రభుత్వ నిర్ణయంపై వారు మండిపడుతున్నారు. వైసీపీ ఇన్‌చార్జి నిర్ణయంతో విభేదించిన నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నేతలు శనివారం దెందులూరు 'సిద్ధం' సభకు జనాన్ని తరలించేందుకు ఆసక్తి చూపకపోవడంతో బస్సులు ఖాళీగా వెనుతిరగాల్సి వచ్చింది. పీఏసీఎస్‌ల ఇన్‌చార్జిలను తప్పించడం వల్ల పార్టీకి మరింత నష్టం కలగవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల బకాయిలు విడుదల చేయండి

- రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన

విజయవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల బకాయిలు విడుదల చేయాల్సిందిగా రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో షామియానాలు, సిబ్బందికి భోజనాలు తదితర అవసరాల కోసం రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు ఖర్చు చేయాల్సి వచ్చిందని, ఇప్పటి వరకు పూర్తిగా ఆ డబ్బులు చెల్లించలేదని వాపోయారు. ఆదివారం ఏపీ రెవెన్యూ భవన్‌లో జరిగిన ఏపీ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు రెవెన్యూ ఉద్యోగులు అగ్ర నాయకత్వం ఎదుట ఏకరువు పెట్టారు. నాలుగున్నరేళ్లుగా విడతల వారీగా డబ్బులు చెల్లిస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మళ్లీ ఎన్నికలు వచ్చాయని.. డబ్బులు ఖర్చు చేయలేమని చెప్పారు. ఎన్నికల ఖర్చు రూ. 1200 కోట్లు అవుతుందని ఎన్నికల కమిషన్ లెక్క తేల్చిందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ. 200 కోట్లను మాత్రమే విడుదల చేసిందని, దీనిని బట్టి చూస్తే ఆందోళన వ్యక్తమౌతోందని తెలిపింది. దాదాపుగా రూ.1000 కోట్లభారం రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల మీదనే ముందుగా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితులలో ఎన్నికల ఖర్చుకు డబ్బులు ముందుగా విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. ఈవిషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకు వెళ్లాలని పలువురు రెవెన్యూ నేతలు బొప్పరాజు దృష్టికి తీసుకువెళ్లారు.

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్ కుమార్

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.రమేష్ నియమితులయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న చేబ్రోలు కృష్ణమూర్తికి డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి వచ్చిన నేపథ్యంలో, సంఘ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఏలూరు జిల్లాకు చెందిన రమేష్‌కుమార్‌ను నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

సర్పంచుల చలో అసెంబ్లీ జయప్రదం చేయాలి

ఆకునూరు(ఉయ్యూరు), ఫిబ్రవరి 4 : గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ. 8,629 కోట్లు దారిమళ్లించిన రాష్ట్రప్రభుత్వం తిరిగి సర్పంచుల ఖాతాల్లో జమచేయాలని, ఇతర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, ఆంధ్రపదేశ్ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ పిలుపునిచ్చారు. ఆకునూరులో ఆదివారం జరిగిన సర్పంచుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సర్పంచులకు విధులు, నిధులు, అధికారాలు లేకుండా చేసి ఉత్సవ విగ్రహాల్లా నిలబెట్టిందని ఆరోపించారు. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వక పోగా కేంద్రప్రభుత్వం పంపిన ఆర్థిక సంఘ నిధులు కూడా వాడుకుందని దుయ్యబట్టారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్లు సర్పంచుల అధీనంలో పనిచేయించాలని, ఉపాధి హామీ నిధులను చట్టప్రకారం గ్రామ పంచాయతీలకు, సర్పంచుల చేత ఖర్చు చేయించాలని, గతంలో మాదిరిగా గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వాలని, సర్పంచులు, ఎంపీటీసీలకు రూ.15వేలు ఎంపీపీలు, జడ్పీటీసీలకు రూ. 30వేలు గౌరవవేతనం, సర్పంచుల 16 డిమాండ్లు ఆమోదించాలని పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ నాయకత్వంలో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో పార్టీలు, రాజకీయలకతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. సర్పంచులు సూరపనేని ప్రసాద్, షేక్‌జాన్‌బాష, యెనిగళ్ల శిరీష తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలనూ నిలిపేస్తారా

- రాష్ట్ర రెల్లి పొలిటికల్ జేఏసీ మండిపాటు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 4 : కేంద్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు సఫాయి కర్మచారి పథకం ద్వారా అందించే పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయడంపై రెల్లి పొలిటికల్ జేఏసీ కన్వీనర్ భూపతి అప్పారావు మండిపడ్డారు. ఈ పథకం అమలు చేయని కారణంగా రెల్లి కులస్తులు, ఇతర పారిశుధ్య కార్మికులు రుణాలు పొందలేకపోతున్నారన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో అయన మాట్లాడారు. రెల్లి కులస్తుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అత్యధిక జనాభా కలిగిన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మూడు ఎమ్మెల్యే, ఒక పార్లమెంట్ సీటు తమకు కేటాయించాలన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలన్నారు. రాష్ట్రస్థాయి, యూనిట్‌స్థాయి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జేఏసీ ముఖ్య సలహాదారు బిబ్బొలి లీలాకుమార్, సోమి కమల్‌కుమార్, మాడుగల లక్ష్మణ్, ప్రసాద్‌రెల్లి, గోపి, రాజు, అల్లం సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


ఎస్పైకి ఫిర్యాదు ఇస్తున్న జనసేన నేతలు

జనసేన జెండా దిమ్మె ధ్వంసం

- ఉద్రిక్తత.. పోలీసులకు ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి4 : భాస్కరపురం గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన ఎస్సీ నేత దివాకర్ విత్రబృందం ఇటీవల నిర్మించిన జనసేన జెండా దిమ్మెను ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అది తెలిసి నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ జన సైనికులతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. తొలగించిన జెండా దిమ్మె స్థలం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు జనసైనికులకు నచ్చచెప్పారు. జనసేనకు మద్దతుగా టీడీపీ నాయకులు మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్, చిన్నం సురేష్ తదితరులు సంఘటన స్థలానికి తరలి వచ్చారు. అనంతరం మచిలీపట్నంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా

- ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా

అజిత్‌సింగ్‌నగర్ : వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సీటు ఎస్సీలకు కేటాయించాలని లేని పక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని ఆజాద్ ముస్లీం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగూల్ మీరా పేర్కొన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతో కాలంగా నియోజకవర్గంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోటీలో తమ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షేక్ సాజిద్ ఆలీ, కాలేషా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	238
చికెన్ స్కిన్‌లెస్	248

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.38

టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయం

● ఆత్మీయ సమ్మేళనంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 4: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం బందరు రోడ్డులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో టీడీపీ-జనసేన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఇరుపార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా టీడీపీ విజయవాడ పార్లమెంటు ఇన్‌చార్జి కేశినేని చిన్ని, బొండా ఉమా విచ్చేశారు. ఇరు పార్టీల కార్యకర్తలతో ముచ్చటించారు. పొత్తులో అన్ని పార్లమెంటు స్థానాలు, అత్యధిక ఎమ్మెల్యే సీట్లు కూటమి దక్కించుకుంటుందని కేశినేని చిన్ని అన్నారు. సుంకర కృష్ణ, తిరుమలశెట్టి ఉదయభాస్కర్, బర్మా శ్రీను, తుమ్మలపెంట శ్రీనివాసులు పర్యవేక్షించారు.



లెక్చరర్స్ కాలనీ రోడ్డు మొదట్లో ఫ్లైవోవర్ పక్కన గొయ్యి, తీవ్రంగా గాయపడిన వాచ్‌మన్ రాజేష్

బైక్‌పై వెళుతూ..

గోతిలో పడిన వాచ్‌మన్

● తలకు తీవ్ర గాయం

మధురానగర్, ఫిబ్రవరి 4: బైక్‌పై వెళుతూ తవ్వి రోజుల తరబడి వదిలేసిన గోతిలో పడిన వాచ్‌మన్ తలకు బలమైన గాయమైంది. ఆదివారం ఈ ఘటన జరిగింది. మొగల్రాజపురంలో నివాసం ఉండే రాజేష్ మధురానగర్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఏడున్నర గంటలకు మధురానగర్ ఫ్లైవోవర్ పక్క నుంచి తన బైక్‌పై నరసరాజు రోడ్డుకు వెళుతున్నారు. లెక్చరర్స్ కాలనీ రోడ్డు మొదట్లో ఫ్లైవోవర్ పక్కన పెద్ద గోతిలో బండి పడింది. బండిపై ఉన్న రాజేష్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు రాజేష్‌ను బయటకు తీసి 108కి సమాచారం ఇచ్చారు. వారు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు. వారం నుంచి గొయ్యి ఇలానే ఉందని ఎవరు తవ్వారో ఎందుకు తవ్వారో తెలియదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు గోతిని పూడ్చాలని వారు కోరుతున్నారు.

సైడ్ కాలువలో

పడి కూలీ మృతి

పాయకాపురం, ఫిబ్రవరి 4: సైడ్ కాలువలో పడి కూలీ మృతి చెందిన ఘటన పాయకాపురం ప్రాంతంలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన చిన్నం రవి(48) కూలి పనులు చేస్తుంటాడు. శనివారం ఉదయం పనుల నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం ఉదయం బాలాజీ టవర్స్ వద్ద ఉన్న సైడ్ కాలువలో రవి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రవిని కాలువలో నుంచి బయటకు తీశారు. అయితే రవి అప్పటికే మృతి చెందాడు. మద్యం మత్తులో సైడ్ కాలువలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే టీడీపీ ధ్యేయం

● తానా ఫౌండేషన్ కుట్టుమిషన్ల పంపిణీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

● చంద్రబాబు స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు: తానా సభ్యుడు పుట్టగుంట సురేష్



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్, తానా సభ్యుడు పుట్టగుంట సురేష్

భారతీనగర్: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురునానక్‌నగర్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తానా సభ్యుడు పుట్టగుంట సురేష్ సహకారంతో 110 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని), జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసుతో కలిసి గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నాలుగేళ్ల నుంచి నగరంలో అనేక సేవా కార్యక్రమాలను తానా సభ్యుడు పుట్టగుంట సురేష్ చేస్తున్నారని గద్దె అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని ఎంతో మంది మహిళలకు కుట్టుమిషన్లు అందించారని, పుట్టగుంట సురేష్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు చేస్తున్నామని పుట్టగుంట సురేష్ అన్నారు. గద్దె రామ్మోహన్ సేవా కార్యక్రమాల ద్వారానే రాజకీయాల్లోకి వచ్చారని, రాజకీయాల కోసం సేవా కార్యక్రమాలు చేయడం లేదని తెలిపారు. తానా ఫౌండేషన్ ద్వారా ఏటా రూ.25 కోట్లతో వివిధ సేవా కార్యక్రమాలను రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థికి తూర్పు నియోజకవర్గంలో 40వేలకు పైనే మెజార్టీ వస్తుందని జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు అన్నారు. గొట్టిపాటి రామకృష్ణ, సుఖవాసి శ్రీనివాస్, ఎస్.ఫిరోజ్, చెన్నుపాటి గాంధీ, గుండు శ్రీను, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు, పొట్లూరి సాయిబాబు, గుత్తికొండ కృష్ణమోహన్, చందు శివరామకృష్ణ, గాదిరెడ్డి అమ్ములు పాల్గొన్నారు. సొంత నిధులతో మహిళలకు గద్దె చీరలు పంపిణీ చేశారు.

కేశినేని నానికి డిపాజిట్లు రాకుండా ఓడించాలి: కేశినేని చిన్ని

"సేవ చేయడంలో గద్దె రామ్మోహన్ అందరికీ ఆదర్శం. కేశినేని నాని తూర్పు నియోజకవర్గంలో గద్దె రామ్మోహన్‌కు వచ్చిన మెజార్టీ ద్వారానే ఎంపీ అయ్యారు. అది గుర్తుంచుకోకుండా అవాకులు, చవాకులు పేలుతున్నారు. నానీని వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా ఓడించాలి. గద్దె రామ్మోహన్ అధికారంలో ఉన్నా లేకపోయిన సొంతనిధులతో ఎంతోమందికి కుట్టుమిషన్లు, ఇస్త్రీ, తోపుడు బండ్లు, విద్యార్థుల చదువుకు, వైద్య ఖర్చులకు సాయం అందించారు." అని కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు.

వైసీపీ ప్రచార సభలా..

మరుపిళ్ల చిట్టి విగ్రహావిష్కరణ



మరుపిళ్ల చిట్టి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెల్లంపల్లి

చిట్టినగర్, ఫిబ్రవరి 4: పార్టీలకతీతంగా నగరాల కులస్తులంతా కలిసి ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే సర్దార్ మరుపిళ్ల చిట్టి విగ్రహావిష్కరణ కార్యక్రమం వైసీపీ ప్రచార సభగా మారింది. ఆదివారం చిట్టినగర్ జంక్షన్‌లో చిట్టి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆవిష్కరణకు వచ్చిన ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగలక్ష్మి వేదికను అధికార పార్టీ ప్రచార కార్యక్రమంలా మార్చారు. వైసీపీని గెలిపించాలని, జగన్ సీఎం చేయాలని, వైసీపీ ప్రభుత్వం నగరాలకు పెద్ద పీట వేసిందని చెప్పారు. దీంతో స్టేజికింద ఉన్న యువకులు భారీ అరుపులు కేకలు పెట్టారు. దీంతో సహనం కోల్పోయిన ఎమ్మెల్యే, మేయర్లు తొట్టిగ్యాంగ్‌లు అరుపులు ఆపాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో వారు మరింతగా కేకలు పెట్టడంతో ఎమ్మెల్యే కోపంతో ఊగిపోయారు. ఇంతలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన మహేష్ చిట్టి విగ్రహానికి పూలమాలు వేస్తుండగా యువత భారీగా కేరింతలు పెట్టారు. మహేష్ యువతతో కలసి మరుపిళ్ల చిట్టికి జోహార్లు అర్పించారు. అధికార పార్టీ నాయకులంతా అయ్యేంతవరకు మైక్ మహేష్‌కు ఇవ్వకపోవడంతో విగ్రహ కమిటీ నాయకుడిపై అక్కడే ఉన్న నగరాల యువజన సంఘం నాయకులతోపాటు పోతిన మహేష్ యూత్ గొడవకు దిగారు. తోపులాట జరిగింది. అధికార పార్టీ నాయకులు మాట్లాడగానే స్టేజి దిగి వెళ్లి పోయారు. పోతిన మహేష్ వెయ్యి మందితో కోమలవిలాస్ సెంటర్ నుంచి వచ్చిన ర్యాలీని అధికార పార్టీ నాయకుల సమాచారంతో పోలీసులు అడ్డుకుని, అరగంట తరువాత విగ్రహావిష్కరణ చేశారని తెలిశాక వదిలేశారు. కమిటీ సభ్యులు కులాన్ని పక్కనే పెట్టి అధికార పార్టీకి దాసోహమయ్యారని నగరాల యువజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విగ్రహావిష్కరణలో ఎంపీ కేశినేని నాని, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు. జనసేన నగర అధ్యక్షు పోతిన వెంకట మహేష్, ఏపీ నగరాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీరావు, పోతిన వెంకట రామారావు పాల్గొన్నారు. విగ్రహావిష్కరణను అధికార పార్టీ సొంత కార్యక్రమంలా చేసిందని, ఆహ్వాన పత్రికలో నగరాల నాయకులను అగౌరవపర్చారని పలువురు నగరాల యువజన సంఘం నాయకులు దుయ్యబట్టారు. వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జీగా ఉన్న ఆసీఫ్‌ను ముఖ్యఅతిథిగా పిలవడంపై, నగరాల కులస్థుడు జనసేన నేత పోతిన వెంకట మహేష్‌తోపాటు పలువురుని ఆహ్వానితులుగా పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్‌కు హనుమంతరాయ చేపల మార్కెట్

దుకాణదారుల బకాయి రూ.70 లక్షలు

● వసూలులో శ్రద్ధ చూపని అధికారులు.. నోటీసులతో సరి

వన్‌టౌన్, ఫిబ్రవరి 4: కొత్తపేటలోని హనుమంతరాయ చేపల మార్కెట్‌లో దుకాణదారులు నగరపాలక సంస్థకు రూ.70 లక్షల మేరకు బకాయిపడ్డారు. మార్కెట్‌లో 80 కూరగాయల ప్లాట్‌ఫాంలు, 60 చేపల విక్రయాల ప్లాట్‌ఫాంలు, 200 పైగా దుకాణాలున్నాయి. ఎనిమిదేళ్ల నుంచి అద్దెలు చెల్లించకుండా వ్యాపారులు కాలయాపన చేస్తున్నారు. అధికారులు కూడా అద్దె చెల్లించాలని గట్టిగా అడగకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. దుకాణదారుల నుంచి కార్పొరేషన్‌లోని కొందరు మామూళ్లు తీసుకుని, అద్దెలు జమ చేయకుండా, నోటీసులతో సరిపెడుతున్నారని ఆరోపణలున్నాయి. మార్కెట్‌లో కూరగాయల ప్లాట్‌ఫాంలు 80 ఉంటే విక్రయదారులకు కేటాయించారు. వారంతా బూరాడవీరివీధిని ఆక్రమించి విక్రయాలు చేసుకోవడంతో అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి.

> **బకాయి వాస్తవమే**
>
> రూ.70 లక్షలు బకాయి వాస్తవమే. ఇప్పటికే రెండు సార్లు నోటీసులిచ్చాం. మూడోసారి నోటీసులకు స్పందించకుంటే దుకాణాలుసీజ్ చేస్తాం.
>
> -శ్రీనివాస్, కార్పొరేషన్ ఎస్టేట్ అధికారి

కార్మికులంతా ఏకమై జగన్‌కు బుద్ధి చెప్పాలి

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు

పాయకాపురం, ఫిబ్రవరి 4: కార్మికులంతా ఏకమై రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అహంకారి సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని, వైసీపీ అరాచక పాలనకు చమరగీతం పాడాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు పిలుపునిచ్చారు. టీఎన్‌టీయూసీ కార్మిక చైతన్య బస్సు యాత్ర ముగింపు సభ కుప్పం నియోజకవర్గంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక ఇవ్వడంతో భవన నిర్మాణ రంగంలో కార్మికుల జీవన విధానం బాగుండేదన్నారు. అసంఘటిత కార్మికుల బీమా సౌకర్యం, చేతి వృత్తిదారులకు ఉచితంగా పనిముట్లు, వివిధ పథకాలను అమలు చేసిందన్నారు. జగన్ రాక్షస పాలనతో కార్మికలోకం అతలాకుతలమైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికవర్గాలకు న్యాయం జరగాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. టీఎన్‌టీయూసీ నేతలు పరుచూరి ప్రసాద్, కోగంటి లెనిన్‌బాబు, అబ్బూరి సింధుజ, మోహనరావు, రెంటపల్లి శ్యామ్ పాల్గొన్నారు.

సొరంగం వద్ద ట్రాఫిక్ మళ్లింపు..ప్రజలకు ఇక్కట్లు



సితార-సొరంగం వద్ద ట్రాఫిక్ నిలుపుదల చేస్తున్న పోలీసులు

భవానీపురం, ఫిబ్రవరి 4: 44, 45వ డివిజన్ల మధ్యన ఉన్న సొరంగం రెండువైపులా కొండచరియలు జారిపడకుండా కంచె ఏర్పాటు పనుల కోసం ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. మళ్లింపుపై తగిన సమాచారం లేకపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు శని, ఆదివారాల్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్, కార్పొరేషన్, పోలీస్‌శాఖాధికారుల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో ట్రాఫిక్ మళ్లింపు సమయాలు తెలపకపోవడంతో భవానీ పురం, విద్యాధరపురం, చర్చి సెంటర్ల నుంచి సొరంగం వైపు రాకపోకలు సాగించేవారు అవస్థలు పడ్డారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కంచె పనులు చేయిస్తామని కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు ఉంటుందని, సొరంగం వైపు వనేవే అమలు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సుల కోసం అవస్థలు

సొరంగం పనుల ప్రారంభంతో కబేళా, ఫ్లైఓవర్ నుంచి చిట్టినగర్ వైపు బస్సుల మళ్లింపుతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే దసరా నుంచి విద్యాధరపురం నుంచి 5వ నెంబర్ రూట్ బస్సులను అమ్మవారి గుడివైపు నుంచి రానీయకపోవడంతో విద్యార్థులు, వివిధ పనులు కోసం వచ్చేవారు ఇక్కట్లు పాలవుతున్నారు. ఇప్పుడు 3, 5, 5జే, బస్సుల రూట్ మళ్లింపుతో ప్రజల సమస్యలు రెట్టింపయ్యాయి. విద్యాధరపురం మీదుగా 5వ నెంబర్ బస్సులను నడపాలని కోరుతున్నారు.

గాలీబ్ షహీద్ దర్గా అభివృద్ధిపై దృష్టి

భవానీపురం, ఫిబ్రవరి 4: 41వ డివిజన్‌లో సయ్యద్ హజ్రత్ గాలీబ్ షహీద్ దర్గా అభివృద్ధి, ముస్లింల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్(ఐజా) అన్నారు. దర్గా ప్రాంతంలో ముస్లిం పెద్దల ఆహ్వానం మేరకు ఆయన ఆదివారం దర్గాను దర్శించుకున్నారు. మహాత్ములకు చాదర్ సమర్పించారు. దర్గా కమిటీ సభ్యులు షేక్ ఖాజా, మొహ్మద్ అల్తాఫ్, రఫీబ్, హైదర్ అలీ, అఫ్రోజ్‌లు ఐజాను సత్కరించారు.

టీడీపీ నేతలు ఫ్లెక్సీలు చించినట్టు ఆధారాలు ఉన్నాయా?

● వైసీపీ ఆరోపణలపై టీడీపీ ఆరో డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్

మాచవరం, ఫిబ్రవరి 4: 6వ డివిజన్‌లో వైసీపీ ఫ్లెక్సీలు శనివారం అర్ధరాత్రి టీడీపీ నేతలు చించివేసినట్టు కార్పొరేటర్ వీపు అమర్నాథ్ అవాకులు చవాకులు పేలుతున్నారని టీడీపీ ఆరో డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఫ్లెక్సీలను చించేసింది టీడీపీ నేతలే అని అంటున్న అమర్నాథ్ వద్ద ఆధారాలు ఉంటే చూపాలని ఆయన ప్రశ్నించారు. ఫ్లెక్సీల చించివేతపై సరైన ఆధారాలు లేకుండా ప్రతిపక్షాలపై నిందలు వేస్తే ప్రజలు హర్షించరన్నారు.

కళాకారులకు సత్కారం



జానపద కళాకారులను సత్కరిస్తున్న బొండా ఉమా, గజల్ శ్రీనివాసరావు

విజయవాడ కల్చరల్: దామోదర్ జానపదం- మామ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జానపదం- సినీపదం పేరిట నిర్వహించిన సంగీత నాట్యవిభావరి ప్రేక్షకులను అలరించింది. భారతి, తిరుమోక్ష, తేజ, జయంతి చక్రవర్తి, హంస్సేన్‌బి, భావన, సాయి, శ్రీనివాస్, దామోదర్ గణ పతి జానపద పాటలతో అలరించారు. మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, గజల్ శ్రీనివాస్ కళాకారులను సత్కరించారు.

దేవదాయశాఖ స్థలంలో చర్చి నిర్మాణం

● నోటీసులిస్తున్నా తీసుకోని నిర్వాహకులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 4: బావాజీపేట ఐదోలైన్‌లో బావాజీ మఠానికి చెందిన దేవదాయశాఖకు చెందిన ఖరీదైన 200 చదరపు గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా చర్చిని నిర్మించడంపై గతంలో ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. అప్పటివరకు ఈ విషయాన్ని దేవదాయశాఖాధికారులు గుర్తించలేదు. స్థలాన్ని ఆక్రమించి చర్చిని నిర్మించడంపై దేవదాయ అధికారులు ఉదాసీన వైఖరి అవలంబించారు. అనంతరం చర్చి నిర్మాణం చేసిన వారికి నోటీసులు ఇస్తున్నప్పటికీ ప్రయోజనం ఉండడం లేదు. చర్చి నిర్వాహకులు నోటీసులు తీసుకోవడం లేదు. కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో దేవదాయశాఖాధికారుల చర్యలు శూన్యంగా ఉండడంతో నిర్వాహకులకు మరింత ఊతం ఇచ్చినట్లయింది.

రక్తదాతలకు అభినందన

చిట్టినగర్, ఫిబ్రవరి 4: దాడి మురళీకృష్ణ స్టూడెంట్స్, యూత్ ఆధ్వర్యంలో కామాక్షి విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం యువకులు రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన నిర్వాహకులను, రక్తదానం చేసిన యువకులను అభినందించారు. రక్తదానం మహాదానమని పేర్కొన్నారు.

మోతీ మసీద్ కమిటీ ఎన్నికల్లో

ఎండీ బాషా ప్యానల్ విజయం

చిట్టినగర్, ఫిబ్రవరి 4: మోతీ మసీద్(షాదీఖానా) కమిటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. సయ్యద్ ఖాజా ప్యానల్, ఎండీ బాషా ప్యానల్, షేక్ బాజీ ప్యానల్ పోటీ చేశాయి. ఎండీ బాషా ప్యానల్ ఎన్నికల్లో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ఎండీ ఫతావుల్లా ప్రకటించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పాయకాపురం, ఫిబ్రవరి 4: తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కొత్త రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన సక్కుల అప్పారావు నగరపాలక సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అప్పారావు పెద్ద కుమార్తె విశాఖపట్నంలోని ఓ కళాశాలలో చదువుతోంది. గతనెల 28న కుటుంబ సభ్యులతో కలసి విశాఖపట్నంలోని కుమార్తె వద్దకు వెళ్లాడు. తిరిగి శనివారం రాత్రి వచ్చే సరికి ఇంటి తలుపులకు వేసిన తాళం వేసినట్టే ఉంది. వెనుక డోర్ పగుల కొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూశారు. వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన 92 గ్రాముల బంగారపు ఆభరణాలు, 20 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 4: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి ప్రదర్శనను ప్రారంభించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన రాజ్యాంగం అనే పుస్తకాన్ని చిన్నారులతో చదివించారు.

ఏ సమస్య వచ్చినా డయల్ 100

సత్యనారాయణపురం ఫిబ్రవరి 4: ఏ సమస్య ఎదురైనా వజ్రాయుధమైన డయల్ 100ను ఉపయోగించుకోవాలని సత్యనారాయణపురం సీఐ వెంకటనారాయణ అన్నారు. సత్యనారాయణపురం పోలీసుస్టేషన్ పరిధిలోని గాంధీనగర్, పెజ్జోనిపేట ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం స్ట్రీట్‌వాక్ నిర్వహించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలకు పోలీసులు నిరంతరం అండగా ఉంటారని, సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మీ కాలనీలో, వీధిలో గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లయితే వెంటనే 100కు కాల్ చేయాలని కాల్ చేసిన ఐదు నిముషాల్లో కానిస్టేబుల్స్ అక్కడ ఉంటారన్నారు. మీప్రాంతంలో ఎవరైనా అనుమానంగా సంచరిస్తున్నా, మీకు ఎవరిపైన అయినా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు ఫోన్‌చేస్తే ఐదు నిముషాల్లో మీవద్ద ఉంటారని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీటర్లు పైన ప్రత్యేక నిఘా ఏర్పాటు ఉంచామన్నారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో నిఘా పెట్టండి

● కార్పొరేటర్‌కు మహిళల వినతి

30వ డివిజన్‌లో రాత్రి వేళల్లో బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు తిరుగుతున్నాయని ఆదివారం డివిజన్ పర్యటనకు వచ్చిన కార్పొరేటర్ జానారెడ్డికి స్థానిక మహిళలు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయంలో యువకులు రోడ్లపైన తిరుగుతూ రాళ్లతో, కర్రలతో కొట్టుకుంటున్నారని అడిగితే స్థానికులపై ఎదురు తిరుగుతున్నారని చెప్పారు. రాత్రి సమయంలో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని ఫిర్యాదు చేశారు. సీఐ గురుప్రకాష్‌తో జానారెడ్డి మాట్లాడారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో ప్రత్యేక నిఘాపెట్టాలని కోరారు. సీఐ ఆప్రాంతాన్ని కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. ప్రత్యేక బీట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

నున్న పోలీసుల ఫుట్ పెట్రోలింగ్



పైపుల రోడ్డు వద్ద ఫుట్ పెట్రోలింగ్ చేస్తున్న సీఐ దుర్గాప్రసాద్

పాయకాపురం, ఫిబ్రవరి 4: పైపుల రోడ్డు జంక్షన్ నుంచి వాంబేకాలనీ వరకు నున్న సీఐ ఎస్.దుర్గాప్రసాద్ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీఐ సూచించారు. ఎస్సై శేషారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భారతీ తీర్థమహాస్వామి జన్మదిన వేడుకలు నేటి నుంచి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4: భారతీ తీర్థమహాస్వామి 74వ జన్మదిన వేడుకలు ఈనెల 5వ తేదీ నుంచి 74 రోజులపాటు శివరామకృష్ణ క్షేత్రంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం క్షేత్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ ఉదయం 15మంది రుత్వికులతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్ర నవావరణ, సాయంత్రం మహా మంగళ హారతి, దాతలకు వేదాశ్రీరాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బులసు శివశంకర్ పాల్గొంటారని శృంగేరీ పీఠం ప్రతినిధి నరహరశెట్టి తెలిపారు. వివరాలకు కార్యాలయంలో పనిచేసే వేళలో సంప్రదించాలని సూచించారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్ - ఫ్రాన్స్ ద్వైపాక్షిక సంబంధాలు

ఇద్దరు వ్యక్తుల మధ్యే కాదు, రెండు దేశాల మధ్య విత్రత్వం దీర్ఘకాలం కొనసాగాలంటే భావసారూప్యత ఎంతో అవసరం. విపత్కర కాలంలో ఒకరికి ఒకరు వెన్నుదన్నుగా నిలవడం మరీ ముఖ్యం. ఫ్రాన్స్-భారత్‌ల మధ్య సుదీర్ఘ స్నేహ సంబంధాలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

1980ల్లో మిరాజ్ యుద్ధ విమానాలను అందించడం మొదలు, 1982లో భారత్‌కు అణు ఇంధనాన్ని అందించాల్సిన అమెరికా సహకరించనప్పుడు, ఆ స్థానంలో ఫ్రాన్స్ భారత్‌కు అణు ఇంధన సరఫరా చేయడం వరకూ ఒక సహకార ధోరణే కనిపిస్తుంది. అనంతరం 1998లో భారత్ అణు పరీక్షలు జరిపినప్పుడు అమెరికా వంటి అగ్ర దేశాలన్నీ భారత్‌పై ఆంక్షలు విధించినా, ఫ్రాన్స్ మాత్రం ఆ పని చేయకుండా తన మిత్రత్వాన్ని చాటుకుంది.

ఇలాంటి సయోధ్య స్నేహబంధం ఇటీవల మరోసారి రుజువైంది. తొలుత గత జూలైలో ప్రధాని మోదీని ఫ్రాన్స్ తమ 'బాస్టిల్ డే' పరేడ్‌కు ఆహ్వానించగా, ఈయేటి గణతంత్ర దినోత్సవ ముఖ్యఅతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్‌ను భారత్ ఆహ్వానించింది. ఈ పర్యటనల సందర్భంగా అనేక కీలక ఒప్పందాలు కుదిరిన నేపథ్యంలో, ఇరుదేశాల మధ్య సుదీర్ఘ స్నేహబంధం, నేటి ప్రపంచ పరిస్థితుల్లో అది మరింత బలపడాల్సిన ఆవసరం, సవాళ్ల చర్చనీయమైనాయి.

● ఇండో-ఫ్రాన్స్ సుదీర్ఘ ద్వైపాక్షిక బంధం

బహుళ ధ్రువ ప్రపంచం దిశగా భావసారూప్యం: ఫ్రాన్స్-భారత్ రెండూ ఎంతో భావసారూప్యం గల దేశాలు. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో అమెరికా, రష్యా కూటములపరంగా ప్రపంచం చీలిపోయిన సందర్భంలోనూ, భారతదేశం ఏ కూటమివైపు మొగ్గుచూపకుండా అలీన(నాన్ ఎలైన్‌మెంట్) ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించింది. అదేవిధంగా ఫ్రాన్స్ అమెరికాకు మిత్ర దేశమే అయినా కూడా తటస్థ వైఖరినే అవలంభించింది. అదేవిధంగా ఇరాన్‌పై అమెరికా దాడి సమయంలోనూ, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాలు అమెరికాకు సహకరించినా, ఫ్రాన్స్ మాత్రం ఇరాక్‌పై అమెరికా దాడిని వ్యతిరేకించింది. భారత్ కూడా ఇలాంటి దాడులను ఎప్పుడూ సమర్థించలేదు. ఇటీవల రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ పరిస్థితుల్లో కూడా రెండు దేశాలూ ఏ దేశానికీ మద్దతుగా నిలువలేదు. యుద్ధ విరమణనే కోరాయి. దాడులను ఖండించాయి.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో రష్యా, చైనా ఒక కూటమిగా, అమెరికా, పాశ్చాత్య దేశాలు మరోవైపు మోహరిస్తూ ఉన్న నేపథ్యంలో భారత్-ఫ్రాన్స్ తటస్థ కూటమిగా బహుళ ధ్రువ ప్రపంచం ఆవిష్కారానికి ఆస్కారం ఉంది. గ్లోబల్ సౌత్‌కు భారత్ నేతృత్వం వహిస్తూ, యూరోపియన్ యూనియన్‌కు ఫ్రాన్స్ ప్రాతినిధ్యంతో రెండు శక్తులనూ సమన్వయం చేయడం ద్వారా ఒక తటస్థ బహుళ ధ్రువ ప్రపంచం వైపు పయనించవచ్చు.

వ్యూహాత్మక సంబంధాలు: తొలినుంచే రెండు దేశాల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణం 1998లో వీటిమధ్య 'స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్(వ్యూహాత్మక భాగస్వామ్య) ఒప్పందానికి దారితీసింది. రక్షణ, భద్రతా రంగాల్లో సహకారం, అంతరిక్ష పరిశోధనల పరంగా, పౌర అణు ఇంధనపరంగా సహకారం ఈ ఒప్పందంలోని కీలక అంశాలు. భారతదేశ భౌగోళిక వ్యూహాత్మకత దృష్ట్యా ఫ్రాన్స్ తన ఇండో పసిఫిక్ ప్రాంతమైన 'రీ యూనియన్ ఐలాండ్'లో భారత వాయుసేనకు స్థావరం ఇవ్వడమే కాక, 2020లో 'ఇండియన్ ఓషన్ కమిషన్'లో భారత్‌కు అబ్జర్వర్‌గా స్థానం దక్కడానికి ఫ్రాన్స్ సహకరించింది. తద్వారా భారత్‌కు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఎంతో వ్యూహాత్మక ప్రయోజనాలు చేకూరాయి.

అదేవిధంగా ఇండో పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత కార్యకలాపాలు, సమ్మిళిత ప్రయోజనాలు, పరస్పర సహకారానికిగానూ ఏర్పడిన 'ఇండియా-ఫ్రాన్స్-ఆస్ట్రేలియా ట్రై లేటరల్ డైలాగ్'లో ఈ రెండు దేశాలూ కీలకపాత్ర పోషిస్తున్నాయి.



భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాల 25వ వార్షికోత్సవం సందర్భంగా తమ బంధాన్ని 2047 వరకూ పొడిగించుకొనేందుకు 'హొరిజన్ ఆఫ్ 2047 అగ్రిమెంట్ గత సంవత్సరం జరిగింది. దీంతో 1947లో భారత్-ఫ్రాన్స్ మధ్య ప్రారంభమైన దౌత్య సంబంధాలకు 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తవగా, 1998లో ఏర్పర్చుకున్న వ్యూహాత్మక సంబంధాలకు 50 ఏళ్ల పూర్తవుతాయి.

రాజకీయ మద్దతు: భారత్‌కు ఐక్యరాజ్యసమితి శాశ్వత సభ్యత్వం ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన తొలి శాశ్వత సభ్య దేశం ఫ్రాన్స్. అంతేకాక మిసైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజీమ్(ఎంటీసీఆర్), వాస్సెనార్ అగ్రిమెంట్, ఆస్ట్రేలియా గ్రూప్‌లలో భారత ప్రాతినిధ్యానికి కూడా ఫ్రాన్స్ ఇతోధికంగా సహకరించింది. జమ్మూ కాశ్మీర్ అం శంలో ఫ్రాన్స్ భారత్‌కు మద్దతు ఇవ్వడమే కాదు, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కూడా ఖండిస్తూ వస్తోంది. అంతేకాక చైనాకు దీటైన ప్రత్యామ్నాయ శక్తిగా భారత్‌కు తన మద్దతును తెలుపుతూ వస్తోంది.

ఆర్థిక సంబంధాలు: ఇరుదేశాల మధ్య ఇటీవలకాలంలో విస్తృతస్థాయిలో వాణిజ్యం జరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇరుదేశాల మధ్య 13.4 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది.

భారత్ నుంచి ఫ్రాన్స్‌కు ఏడు బిలియన్ డాలర్లపైగా ఎగుమతులు పెరిగాయి. అదేవిధంగా భారతదేశంలో ప్రత్యక్ష పెట్టుబడుల్లో 1.64 శాతం సమకూర్చుతూ భారత్‌లో విదేశీ పెట్టుబడులపరంగా ఫ్రాన్స్ 11వ స్థానంలో నిలిచింది. భారత్‌లో ఫ్రాన్స్‌కు చెందిన దాదాపు వెయ్యి సంస్థలు(ఎస్టాబ్లిష్‌మెంట్స్) 20 బిలియన్ డాలర్ల టర్నోవర్ కలిగి మూడు లక్షలమందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అదేవిధంగా భారత్‌కు చెందిన 150 కంపెనీలు ఫ్రాన్స్‌లో ఏడువేలమందికి ఉపాధినిస్తున్నాయి. ఇండో-ఫ్రాన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ కమిటీ(ఏఈటీసీ) ద్వారా భారత్-ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల పెరుగుదలకు, వ్యాపార అవరోధాల పరిష్కారానికి కృషి జరుగుతోంది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

మౌర్య సామ్రాజ్యం



భారతదేశంలో తొలిసారి గొప్ప పరిపాలనను అందించిన వారు మౌర్యులు. వీరు విశాల భారతదేశాన్ని ఆక్రమించారు. వాయువ్యంలో గ్రీకులను, మగధలో నంద వంశస్థులను నిర్మూలించారు. 'పాటలీపుత్రం' రాజధానిగా క్రీ.పూ.322 నుంచి క్రీ.పూ.185 వరకు పరిపాలించారు.

మౌర్యుల చరిత్రకు ఆధారాలు

మౌర్యుల చరిత్రకు అనేక సాహిత్య, పురావస్తు ఆధారాలతోపాటు గ్రీకు, చైనా చరిత్రకారుల రచనలు లభించాయి.

కౌటిల్యుని అర్థశాస్త్రం: సంస్కృతంలో రాసిన ఈ గ్రంథం మౌర్యుల పరిపాలన విధానాలు, చంద్రగుప్తుని రాజకీయ, రాజనీతి సిద్ధాంతాలను తెలియజేస్తుంది.

విశాఖదత్తుని ముద్రారాక్షసం: నందవంశంలోని చివరి రాజైన ధననందున్ని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి, వారి రాజ్యాన్ని ఆక్రమించుకున్నట్లు రాసి ఉంది. ఈ గ్రంథంలో విశాఖదత్తుడు మౌర్యులను 'హీనకులస్థులు'గా పేర్కొన్నాడు.

హేమచంద్రుని పరిశిష్టపర్వన్: ఈ గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడు జైనమతంలోని 'దిగంబర'శాఖను తన గురువైన 'బద్రబాహు' ద్వారా స్వీకరించిన విధానం రాసి ఉంది.

విదేశీ గ్రంథాలు: గ్రీకు రాయబారి మెగస్తనీస్ తన 'ఇండికా' గ్రంథంలో పాటలీపుత్రంలోని పరిపాలన, సమాజంలోని మతం, స్త్రీల దుస్థితి, ఆర్థిక రంగాల గురించి రాశాడు. చైనా యాత్రికుడు ఫాహియాన్ గుప్త ల కాలంలో భారతదేశం సందర్శించినప్పటికీ మౌర్యుల కాలం నాటి సామాజిక విధానాన్నే వివరించాడు.

అశోకుని శిలాశాసనాలు: భారతదేశంలో తొలిసారిగా అశోకుడు అనేక శాసనాలు వేయించాడు. బ్రాహ్మి లిపి, పాళి భాషలో అనేక శాసనాలున్నప్పటికీ, సంస్కృతంలో మాత్రం చెక్కించలేదు. దీనికి ముఖ్య కారణం ఆ కాలంనాటి ప్రజల వాడుక భాష 'పాళి' కావడం. సార్‌నాథ్, మస్కి, రుమిండై, కౌశాంబి, రాయలసీమలోని కర్నూలులో ఎర్రగుడి, రాజుల మందగిరి వద్ద అశోకుని శాసనాలు లభించాయి.

మౌర్యుల రాజకీయ చరిత్ర(322 - 185 క్రీ.పూ.)

మౌర్య వంశస్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. అలెగ్జాండర్ సేనాని సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి ప్రస్తుత ఆఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్- ఇరాన్ సరిహద్దులను ఆక్రమించాడు. గ్రీకులు చంద్రగుప్త మౌర్యున్ని 'యాండ్రకోటస్'గా పేర్కొన్నారు. చంద్రగుప్త మౌర్యుడు గ్రీకులతో వివాహ సంబంధాలు కుదుర్చుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా వారి నుంచి అరకోషియా(కాందహార్), కాబూల్, గెడోసియా(బెలూచిస్థాన్), మీరట్ మొదలైన ప్రాంతాలను కైవసం చేసుకున్నాడు. చివరికి చంద్రగుప్త మౌర్యుడు జైనమతం స్వీకరించాడు. కర్ణాటకలోని మైసూర్ వద్ద గల చంద్రగిరి పర్వతంపై 'సల్లేఖన' వ్రతం(ఉపవాస దీక్ష) చేపట్టి మరణించినట్లు జైన గ్రంథాల్లో ఉంది.

బిందుసారుడు(297- 273 క్రీ.పూ.): చంద్రగుప్త మౌర్యుని కుమారుడు. ఇతనికి 'సింహసేనుడు' 'అమిత్రఘాత' అనే బిరుదులున్నాయి. బిందుసారునికి సిరియా రాజు మొదటి అందయోకస్‌తో మంచి స్నేహం ఉండేది. స్నేహానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని, అత్తిపండ్లను బిందుసారునికి కానుకలుగా పంపేవాడు. తారాచంద్ అనే బౌద్ధటిబెట్ చరిత్రకారుడు బిందుసారుడిని రెండు సముద్రాల మధ్య ప్రాంతాన్ని పాలించినవాడు అని తన రచనల్లో పేర్కొన్నాడు. బిందుసారుని కాలంలో తక్షశిల రాష్ట్రంలో సైనిక తిరుగుబాటు జరిగింది. దీనిని యువరాజైన అశోకుడు కఠినంగా అణచివేశాడు. బిందుసారుడు చివరి దశలో 'అజీవకమతం'ను స్వీకరించాడు. బిందుసారుడు నాగార్జున గుహలో మరణించినట్లు, అందుకే వాటిని అజీవక మతస్థులకు అంకితం చేసినట్లు కొన్ని గ్రంథాల్లో రాసి ఉంది.

అశోకుడు(273 - 232 క్రీ.పూ.): బిందుసారుని కుమారుడు అశోకుడు. తన పట్టాభిషేకం సందర్భంగా రాజ్యంలో ఉన్న యుద్ధఖైదీలను విడుదల చేశాడు. భారతదేశంలో శాసనాలు ముద్రించిన తొలిరాజు. బ్రాహ్మిలిపిలో పాళి భాషలో గల అశోకుని శాసనాలను జర్మనీకి చెందిన జేమ్స్‌ప్రిన్సెస్ అనే చరిత్రకారుడు తొలిసారిగా గుర్తించి, చదివాడు. అశోకుడు వాయువ్య ప్రాంతంలో సెబాష్‌ఘర్, మన్సార శాసనాలు; ఆఫ్ఘానిస్థాన్‌లో ఖంతహాల్ శాసనం చెక్కించాడు. సిరియా రాజు రెండో అంటియోకస్‌తో, ఈజిప్ట్‌రాజు ఫిలడేల్ఫిస్‌తో, మాసిడోనియా రాజు అంటియోగానస్‌తో, సైరస్‌రాజు మాగాస్‌తో, ఎపిరస్ రాజు అలెగ్జాండర్‌తో మంచి స్నేహసంబంధాలు కొనసాగించాడు.

సామ్రాజ్యకాంక్షతో కళింగపై దండయాత్ర చేశాడు. ఈ యుద్ధం తరవాత అశోకుడు బౌద్ధ దీక్షను స్వీకరించాడు. 3వ బౌద్ధమత సమావేశాన్ని పాటలీపుత్రలో నిర్వహించాడు. 'దేవానాంప్రియ', 'ప్రియదాసి' అనే బిరుదులు అశోకునికి ఉన్నాయి. నైతిక సూత్రాలు ప్రచారం చేయడానికి 18 మంది దర్మమహా మాత్రులను అశోకుడు నియమించారు. దయ, దాతృత్వం, సంక్షేమం ముఖ్యమైన లక్షణాలు 'ధర్మ' సూత్రంలో పేర్కొన్నారు. 232 క్రీ.పూ.లో అశోకుడు మరణించాడు.

చివరి మౌర్యరాజులు: అశోకుడి మరణం తరవాత కుణాలుడు రాజ్యానికి వచ్చాడు. ఈ కాలంలో మౌర్య సామ్రాజ్యం రెండుగా చీలిపోయింది. తరవాత వచ్చిన రాజులు దాదాపు 50 సంవత్సరాలు పాలించారు. చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని, అతని సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించి శుంగ వంశాన్ని స్థాపించాడు.

సమాజం పరిస్థితులు: మౌర్యుల కాలంలో బానిస వ్యవస్థ లేదని మెగస్తనీస్, ఉండేదని కౌటిల్యుడు తమ రచనల్లో పేర్కొన్నారు. బహుభార్యత్వం, బాల్య వివాహాలు, సతీసహగమనం మౌర్యుల పాలనలో సాధారణం. వ్యభిచార వృత్తి ఉండేదని డియోడోరస్ రాశాడు. 8 రకాల వివాహాలు జరిగేవని, వీటితో పాటు స్వయం వరం, రాక్షస వివాహం, గాంధర్వ వివాహం కూడా ఉండేవని చరిత్రకారులు పేర్కొన్నారు. మౌర్యులు మద్యపాన ప్రియులు అని మెగస్తనీస్ వ్యాఖ్యానించాడు. ప్రజలు గోధుమ, బార్లీని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. నూలు, పట్టు, వస్త్రాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. బంగారం, వెండి, రత్నాలు కలిగిన ఆభరణాలు ధరించేవారు. జూదం ఆడటం, జంతువులతో పోరాటాలు, మల్ల యుద్ధాలు, ఉత్సవాలు వీరి వినోదాలు.



డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట

భారతదేశ చరిత్రలో ఏ రాజవంశానికి లేని కేంద్రీకృత పాలన వ్యవస్థ మౌర్యుల కాలంలో కన్పిస్తుంది. అశోకుడు పాటలీపుత్రం కేంద్రంగా ఉంటూ మారుమూల గ్రామమైన సిద్ధాపురంలోని విషయాలను తెలుసుకునేవాడు. మౌర్యులకున్న విస్తృత అధికార యంత్రాంగం చరిత్రలో ఏ రాజవంశంలోనూ కన్పించదు. నిరపేక్ష, నిరంకుశ రాజరికం అధికారాలు చెలాయించేవారు. దేశచరిత్రలోనే తొలిసారిగా శ్రేయోరాజ్యం స్థాపించారు. వీరి పాలనలో మూడు దశలు ప్రధానంగా కన్పిస్తాయి అవి..కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ ప్రభుత్వం, స్థానిక పాలన.

కేంద్ర ప్రభుత్వం: రాజుకు సహాయం చేయడానికి మంత్రిపరిషత్ ఉండేదని మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో రాశాడు. పాలనలో ఆయా విభాగాలను పర్యవేక్షించడానికి 32 మంది అధ్యక్షులు ఉండేవారు. వీరిలో 'సన్నిదాత', 'కోశాధికారి', 'సంహర్తి' పన్నులు వసూలు చేసే అధికారులు.

మౌర్యుల పరిపాలన విధానం

ప్రాంతీయ పాలన: పాలన సౌలభ్యం కోసం మౌర్యులు తమ సామ్రాజ్యాన్ని నాలుగు ప్రాంతాలుగా, ఆహారాలుగా, రాష్ట్రాలుగా విభజించారు. తూర్పు ప్రాంతానికి తోసలి; పశ్చిమ ప్రాంతానికి తక్షశిల; మధ్య ప్రాంతానికి ఉజ్జయిని, అవంతి; దక్షిణ ప్రాంతానికి సువర్ణగిరి ముఖ్యస్థానాలు. రాష్ట్రాలకు పాలనాధికారులను కుమార మాత్యులు అని అంటారు. వీరికి సహాయంగా రజుక, యుక్త అనే అధికారులు ఉంటారు. 'పురుష' అనే అధికారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమాచారం అందించేవారు.

స్థానిక పాలన: స్థల లేదా స్థానిక ప్రధాన పాలన విభాగాలు. వీటి పాలనను స్థానిక, గ్రామిక నిర్వహించేవారు. పాలనలో చివరి భాగం గ్రామం. గ్రామణి పాలన బాధ్యతలు నిర్వహిస్తారు.

నగర పాలన: మెగస్తనీస్ తన ఇండికాలో 30 మంది సభ్యులతో 6 కమిటీలను పురపాలక సంఘం నిర్వహించినట్లు రాశాడు.

సైనిక పాలన: మెగస్తనీస్ రచనల్లో పాటలీపుత్ర నగర పాలన గురించి ఉంది. ఒక్కో కమిటీతో ఐదుగురు సభ్యుల చొప్పున సైనిక పాలన బాధ్యతలు నిర్వహించారు. కాల్బలం, సైనిక జీతభత్యాల నిర్వహణ. అశ్వికదళం, గజదళం, రథ బలం, నౌకాదళం ముఖ్యమైన విభాగాలు. సైనిక చికిత్సలకు అంబులెన్స్ వ్యవస్థ ఉండేదని చాణక్యుడు రాశాడు. సైన్యంలో ఆరు లక్షల కాల్బలం, 30 వేల అశ్వదళం, 9 వేల గజబలం ఉండేదని 'ప్లేని' తన నేచురల్ హిస్టరీ గ్రంథంలో రాశాడు.

పోతిన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

● అధికార పార్టీ నేతలపై నగరాల యువజన సంఘం ఆగ్రహం



పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వస్తున్న మహేష్

వన్‌టౌన్/చిట్టినగర్, ఫిబ్రవరి 4: స్థానిక సెంటర్‌లో ఏర్పాటుచేసిన పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దివంగత కార్మిక నేత సర్దార్ మరుపిళ్ల అప్పలస్వామి (చిట్టి) కాంస్య విగ్రహావిష్కరణకు కొత్తపేట కోమలవిలాస్ సెంటర్ నుంచి జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాగిన ర్యాలీకి కొత్తపేట పోలీసులు అడ్డుకున్నారు.దీంతో పోలీసులకు, మహేష్‌కు వాగ్వాదం జరిగింది. ర్యాలీని ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులను ప్రశ్నించగా పార్టీ జెండాలతో ర్యాలీలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. చిట్టి విగ్రహాన్ని నగరాల సంఘం ఏర్పాటు చేసింది. ఆదివారం సాయంత్రం విగ్రహావిష్కరణకు ఏర్పాటు చేశారు. శిలాఫలకంపై మహేష్ పేరును చిట్టచివరన రాయించడంపై నగరాల యువజన సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. సామాజికవర్గానికి చెందిన పోతిన మహేష్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జికి ప్రాధాన్యత ఇచ్చారని, దీన్ని పూర్తిగా వైసీపీ కార్యక్రమంగా మార్చేశారని విమర్శించారు. దీంతో గందరగోళం ఏర్పడింది. తొలుత కొత్తపేటలో ర్యాలీని మరుపిళ్ల చిట్టి మనవడు శ్రీకాంత్ జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో నగరాల సామాజికవర్గ యువత, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.



వాగు సెంటర్ వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

మతాలు వేరైనా మానవులంతా ఒక్కటే!

5వ రోజుకు చేరుకున్న నవదిన ప్రార్థనలు



గుణదల, ఫిబ్రవరి 4: మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని సోదరీ సోదర భావంతో ప్రేమగా జీవించాలని ఏలూరు మేత్రాసనం ఫాదర్ తోట గాబ్రియేలు అన్నారు. గుణదలమాత నూరు శతాబ్ది మహోత్సవాల్లో భాగంగా ఆ దివారం సాయంత్రం జరిగిన 5వ రోజు నవదిన ప్రార్థనలకు తోట గాబ్రియేలు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. భక్తులను ఉద్దేశించి ఆయన సందేశమిస్తూ కన్య మరియ పవిత్రాత్మ ద్వారా గర్భందాల్చి ప్రభువుకు జన్మనిచ్చిందన్నారు. పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ నూరు వసంతాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకునేందుకు భక్తులు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. 5వ రోజు నవదిన ప్రార్థనలకు భక్తులు వెల్లువెత్తారు. ఎస్ఎస్ సీ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్‌రాజు, తోట గాబ్రియేలు వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితర గురువులు మరియతల్లి గుహవద్ద సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. నున్న,అజిత్‌సింగ్‌నగర్,పాయకాపురం ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న బొండా ఉమా, కేశినేని చిన్ని

ఉచిత మెగా మెడికల్ క్యాంపు

● 4వేల మందికి కేశినేని ఫౌండేషన్ ఉచిత వైద్య పరీక్షలు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 4: కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో ఆదివారం న్యూ రాజరాజేశ్వరిపేట లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు జరిగింది. ఈ క్యాంపును టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని చిన్ని ప్రారంభించారు. న్యూ రాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ పాఠశాలలో జరిగిన మెడికల్ క్యాంపులో 4వేల మందికి ఉచితంగా వైద్యం అందించారు. 15 60 మందికి కంటి పరీక్షలు, 226 మందికి గుండె పరీక్షలు, 194 మంది మహిళలకు ప్రసూతి పరీక్షలు, 260 మందికి ఆర్థో పరీక్షలు, 1439 మం దికి జనరల్ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు మందులను ఉచితంగా అం దజేశారు. క్యాంపుకు వచ్చిన 3వేల మందికి వైద్య శిబిరంలో భోజన ఏర్పాట్లు చేశారు. బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వంలో వైద్యం అందట్లేదని ఆరోగ్య శ్రీ పథకం పేరుకే ఉందన్నారు. వైద్యం ప్రజలకు భారంగా మారిందని అందుకే కేశినేని చిన్ని కార్పొరేట్ స్థాయి మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ మెడికల్ క్యాంపు నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు, మాజీ కార్పొరేటర్ శ్రావణి, కంచి ధనశేఖర్, దాసరి కనకారావు, పాల్గొన్నారు.

నగర విద్యార్థులకు జాతీయ పురస్కారాలు

కృష్ణలంక, ఫిబ్రవరి 4: నగరానికి చెందిన యువ విద్యార్థులు జాతీయ పురస్కారాలను సాధించి నగర ఖ్యాతిని చాటారు. యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, తెలంగాణ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న ఆదివారం హనుమకొండ తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ భవనం నందు నిర్వహించిన జాతీయ పురస్కారాల మహోత్సవ సభలో అతిథుల చేతుల మీదుగా స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూ ల్ విద్యార్థి మేడా సింధూశ్రీకి చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్, పేపర్ క్విల్లింగ్ రంగంలో తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం. ఆంధ్రా లయోలా కళాశాల విద్యార్థి లంకే లోకేష్‌బాబుకి విజువల్ కమ్యూనికేషన్ రంగంలో తెలుగు వెలుగు స్ఫూర్తి కళారత్న జాతీయ పురస్కారాలను పొందారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పాలోజు రాజ్‌కుమార్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ రమేష్, యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ సంస్థ కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్య నేర్చిన కళాశాలకు ప్రిన్సిపాల్‌గా

బాధ్యతలు చేపట్టడం మరపురాని జ్ఞాపకం

● పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్

మొగల్రాజపురం, ఫిబ్రవరి 4: విద్య నేర్చిన కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడమనేది మరుపురాని జ్ఞాపకమని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేశ్ ఆనందం వ్యక్తం చేశారు. పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాల ప్రాంగణంలో జరిగింది. 1975 నుంచి ఇటీవల వరకు విద్యాభ్యాసం చేసి వివిధ వృత్తుల్లో స్థిరపడిన 200 మంది పైగా పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు అసోసియేషన్ నివేదికను చదవి వినిపించారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, చెన్నైకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కె.అనిల్‌కుమార్ రెడ్డి, డీఆర్‌డీవో సైంటిస్ట్ వీడీవీ పద్మజ, కస్టమ్స్ అండ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అడిషనల్ కమిషనర్ నూతలపాటి సౌమ్య, ఎస్.జయప్రకాష్ నారాయణ చౌదరి, ఫొటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాసరెడ్డి, లెక్చరర్ సైకాలజిస్ట్ పీవీ.రాధిక, జయేష్‌షా, సుంకర అక్కయ్య నాయుడు, నాటక కళారంగంలో బంగారు నంది గ్రహీత రావులపల్లి శ్రీనివాసులును సత్కరించారు. సంఘం వెబ్‌సైటును ఆవిష్కరించి వచ్చే ఏడాది స్వర్ణోత్సవ వేడుకలకు రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు. కళాశాల డీన్ రాజేష్, ఉపాధి శిక్షణా విభాగం అధిపతి కావూరి శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

అజిత్‌సింగ్‌నగర్: సెంట్రల్‌కు చెందిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన పలువురు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ఆదివారం బొండా ఉమా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన 100 మందికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాకతీయ కమ్మవారి ఆత్మీయ సమావేశం

పాయకాపురం: స్థానిక ప్రకాష్‌నగర్ సెంటర్ వద్ద ఉన్న రవీంద్ర ఫంక్షన్ హాల్‌లో కాకతీయ కమ్మవారి ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. పాల్గొన్న కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు కమ్మ సంఘం మద్దతు పలక ం హర్షణీయమన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూ ల మాల వేసి నివాళులర్పించారు. ఆచంట సునీత, మూల్పూరి కల్యాణి, ఉషారాణి పాల్గొన్నారు.

బాధ్యతలు గుర్తెరిగి పనిచేయాలి

● వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల

వన్‌టౌన్: బాధ్యతలు గుర్తెరిగి పనిచేస్తేనే నాయకత్వ మనుగడ కొనసాగుతుందని వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం వాసవీ జిల్లా 212కు చెందిన వివిధ క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులకు, కోశాధికారులకు వారి బాధ్యతల గురించి శిక్షణా తరగతులను నిర్వహించారు. శారద, స్పందన ఆయనకు సహకరించారు. జిల్లా గవర్నర్ సతీష్ అధ్యక్షత వహించారు. సంతోష్, చక్రవర్తి, బొడ్డు శ్రీనివాసరావు, సురేష్, రోజా, శివకుమార్, రీజియన్ చైర్మన్లు అనీల్‌కుమార్, చెన్నకేశవులు, అంజనీశ్వేత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం హజరత్తయ్యను సత్కరించారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

ఎన్టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 4: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని, బందరు రోడ్డు హోటల్ మనోరమ పక్కన 2వ వీధి, హోటల్ తనీయా నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 4, 5, 6, తేదీల్లో 3 రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొ డిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. సోమ, మం గళవారం 2రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

గోల్డ్ అప్రైజర్ సంఘ అధ్యక్షుడిగా చక్రవర్తి

గవర్నర్‌పేట: ఆలిండియా యూనియన్ బ్యాంకు గోల్డ్ అప్రైజర్ యూనియన్ అధ్యక్షుడిగా నగరానికి చెందిన కేఎస్ చక్రవర్తి ఎన్నికయ్యారు. ఆదివారం యూనియన్ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ప్రస్తుత అధ్యక్షుడు రాఘవాచారి అనారోగ్య కారణాలతో అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో కో-ఆప్షన్ ద్వారా అధ్యక్షుడిగా చక్రవర్తిని ఎన్నుకున్నట్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి యాసోజు కుమారస్వామి తెలిపారు. యూనియన్ రాష్ట్ర శాఖకు ఉపాధ్యక్షుడిగా ఉన్న చక్రవర్తి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల పలువురు సంఘ సభ్యులు అభినందించారు.

ఆంధ్రజ్యోతి నవ్య
కుటుంబ కదంబం



జీవితం నేర్పే అనుభవాల నుంచి పాఠాలను చాలా మంది నేర్చుకుంటారు. నేర్చుకున్న పాఠాలను సమాజ హితం కోసం ఉపయోగించాలనుకొనేవారు కొద్దిమందే ఉంటారు. అలాంటి వారిలో మానసి పొద్దర్ కూడా ఒకరు. చిన్నతనంలో లైంగిక అత్యాచారానికి గురయిన మానసి తానే ఒక సైకాలజిస్ట్‌గా.. థెరపిస్ట్‌గా ఎదిగారు. హీల్ గ్రో థ్రైవ్ ఫౌండేషన్‌ను స్థాపించి అనేక మందికి సాయం చేస్తున్నారు. మానసి అనుభవాలు ఆమె మాటల్లోనే.

మానసి ప్రయాణం
సమాజహితమే!

చిన్నప్పటి అనుభవాలు- పెద్దయిన తర్వాత మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. చిన్నప్పుడే లైంగిక అత్యాచారానికి గురి అయితే ఆ బాధ మనస్సులో ఎప్పటికీ ఉండిపోతుంది. జీవితంలో ఎవరినీ నమ్మలేని విధంగా తయారుచేస్తుంది. దాని నుంచి బయటకు రావటం అంత సులభం కాదు. నా జీవితంలో కూడా అలాంటి అనుభవాలు ఉన్నాయి. వాటి నుంచి నేను బయటకు రాగలిగాను. ఈ రోజున నేను నా అనుభవాలు పంచుకుంటున్నానంటే దానికి కూడా ఒక కారణం ఉంది. మన సమాజంలో లైంగిక అత్యాచారాలకు గురి అయిన వారిపై సానుభూతి ఎక్కువగా ఉండదు. కుటుంబ సభ్యులు కూడా సాయపడలేరు. నాది కూడా ఆ విధమైన కథే! నేను పుట్టింది కోల్‌కత్తాలో. పెరిగింది ఒక ఉమ్మడి కుటుంబంలో. చిన్నప్పుడే మా తాతగారు చనిపోయారు. దీనితో నాయనమ్మకు ఆదరణ కరువు అయింది. కుటుంబంలో ఆమెకు ఉన్న స్థానం తగ్గిపోయింది. ఆ రోజులు తలుచుకుంటే- ఇప్పటికీ నాకు కళ్లలో నీళ్లు వస్తాయి. నేను పదేళ్ల వయస్సులోనే రజస్వల అయ్యాను. మా స్నేహితులందరికన్నా పెద్దగా కనిపించేదాన్ని. నాకు 13 ఏళ్లు ఉన్నప్పుడు మా ఇంట్లో పని చేసే ఒక వ్యక్తి నాపై లైంగిక అత్యాచారం చేశాడు. అతని ప్రవర్తన గురించి ఎవరితో చెప్పుకోవాలో తెలిసేది కాదు. అమ్మతో చెబితే తిడుతుందని భయం. నాన్నతో నాకు అంత సాన్నిహిత్యం లేదు. దాంతో నేను ఎవరితో మాట్లాడేదాన్ని కాదు. ఒంటరిగా రోజులు గడుపుతూ ఉండేదాన్ని. స్కూల్లో కూడా నాకు చేదు అనుభవాలే ఎదురయ్యేవి. ఇంట్లో పరిస్థితుల వల్ల స్కూల్లో సరిగ్గా చదవలేకపోయేదాన్ని. ఒకస్థితిలో అత్యాచారం అనేది అతి సాధారణమైన విషయమే అనుకొనేదాన్ని. 15 ఏళ్ల వయసులో ఒక రోజు ధైర్యం చేసి మా స్కూల్లో టీచర్‌కు నా కథ చెప్పాను. కానీ ఆవిడ నమ్మలేదు. నాకు మంచి మార్కులు రావటం లేదు కాబట్టి తిట్టకుండా ఈ కథను అల్లాననుకుంది. ఆ అనుభవంతో నేను మరింత కుంగిపోయాను. ఈ అనుభవాల వల్ల నాకు ఎక్కువ మంది స్నేహితులు ఉండేవారు కాదు.

మా ఇంట్లో వాళ్లకు ఈ విషయం తెలిసేలోపు నా కాలేజీ చదువు పూర్తయిపోయింది. నాకు పెళ్లి చేశారు. నా భర్త కూడా చాలా హింసాత్మకంగా ఉండేవాడు. అప్పటికే నాకు ఒక చిత్రమైన మానసిక పరిస్థితి ఏర్పడింది. ఎవరైనా నాతో తప్పుగా ప్రవర్తిస్తే- తప్పు వారిది కాదు.. నాదే అనుకొనేదాన్ని. ఎక్కడో తప్పు జరుగుతోందని తెలుసు. కానీ దానిని ఎలా సరిచేయాలో తెలిసేది కాదు. కొద్ది మంది స్నేహితులతో నా బాధలు చెప్పుకొనేదాన్ని. వారు చాలా పట్టుపట్టిన తర్వాత 2007లో నా భర్తకు విడాకులు ఇచ్చాను. ఆ సమయంలోనే నేను థెరపీకి వెళ్లాను. చాలా మంది థెరపీ వల్ల ప్రయోజనం ఏముటుందనుకుంటారు. కానీ థెరపీ నా జీవితంలో చాలా పెద్ద పాత్ర పోషించింది. అప్పటి దాకా మనసులో ఉన్న బాధలు, బెంగలు అన్నీ బయటకు చెప్పగలిగాను. అంతే కాదు.. ఆ సమయంలోనే నేను ఇతరుల బాధలను అర్థం చేసుకోగలనని తెలిసింది. నా జీవితంలో జరిగిన సంఘటనల మాదిరిగా అనేక మంది జీవితాల్లో కూడా జరిగి ఉండవచ్చని అనిపించింది. ఆ సమయంలో నా స్నేహితులను కలిసినప్పుడు వారికి సంబంధించిన అనేక విషయాలు వినేదాన్ని. కానీ ఎప్పుడూ ఎవరికీ సలహాలు ఇవ్వలేదు. ఇతరులకు సాయపడటానికి సైకాలజీ చదివితే మంచిదనిపించింది. న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి అప్లై చేశా. సీటు రావటంతో అక్కడ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. రెండేళ్లు ప్రాక్టీసు చేశా. ఆ తర్వాత భారత్‌కు తిరిగి వచ్చేశా.

ఒక దశాబ్దం క్రితం థెరపీకి ఎక్కువగా డిమాండ్ ఉండేది కాదు. ఉద్యోగాలు ఎక్కువగా వచ్చేవి కావు. దాంతో నేను దాచుకున్న డబ్బులతో ఫౌండేషన్‌ను స్థాపించా. ఆ రోజు నుంచి ఇప్పటి దాకా అతి తక్కువ ఫీజు తీసుకొని థెరపీ సెషన్స్ ఇస్తూ ఉంటాం. ప్రస్తుతం మా దగ్గర 20 మంది పనిచేస్తున్నారు. మేము ఇప్పటి దాకా సుమారు 1000 మందికి పైగా సాయపడ్డాం. మా దగ్గరకు వచ్చే వారిలో ఎక్కువ మంది మధ్యతరగతి వారే ఉంటారు. వారికి మానసిక వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియదు. ఒక వేళ వెళ్లినా - డాక్టర్లు తీసుకొనే ఫీజును భరించలేరు. దానితో చాలా మంది వైద్యమే చేయించుకోరు. లైంగిక అత్యాచార బాధితురాలిగా నాకు నా పేషెంట్ల బాధ తెలుసు. అందుకే వారితో ఎక్కువగా కనెక్ట్ కాగలుగుతా. నాలా కాకుండా త్వరగా బయటపడమని సలహా ఇస్తూ ఉంటా. బయటకు రావటానికి అవసరమైన మార్గాలను సూచిస్తూ ఉంటా.

వాస్తవానికి ఇదంతా ఒక్క రోజులో జరిగే పని కాదు. మానసిక సమస్యలకు ఒక్క రోజులో పరిష్కారం దొరకదు. మనసులోని బాధను తొలగించటం అంత సులభం కాదు. కానీ ప్రయత్నం ఎక్కడో ఒకచోట మొదలవ్వాలి. ఆ ప్రయత్నంలో నాదొక చిన్న పాత్ర అనే విషయం ఎంతో తృప్తిని ఇస్తూ ఉంటుంది.



పిల్లలను తల్లితండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వారిలో ఎలాంటి మార్పులు వస్తున్నాయో గమనిస్తూ ఉండాలి. ఎప్పుడైనా సాయం కావాల్సి వస్తే- వారికి అవసరమైన సాయాన్ని అందించాలి. అవసరమైతే థెరపిస్ట్‌తో కూడా మాట్లాడించాలి. వీటన్నింటి కన్నా తల్లి తండ్రులకు లైంగిక అత్యాచారాల పట్ల అవగాహన పెరగాలి. అప్పుడే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి.



ధైర్యం, ఆత్మవిశ్వాసం
రెండు కళ్ళుగా...

యాసిడ్ దాడిలో చూపు పోగొట్టుకొని, ఎన్నోసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించిన గతం ఆమెది. ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో... మహిళా సాధికారతకు ఆమె బ్రాండ్ అంబాసిడర్. స్వయంకృషితో ఎదిగి, ఎందరికో చేయూత అందిస్తున్న ఉత్తరాఖండ్‌కు చెందిన కవితా బిస్త్ కథ ఇది.

"అవి నేను ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్న రోజులు. నా వయసు పంతొమ్మిదేళ్ళు. ఎన్నో కలలు. వాటిని నిజం చేసుకొనే ప్రయత్నాలు... చక్కగా సాగిపోతున్న నా జీవితం అనూహ్యంగా చీకటిమయమైపోయింది. అది 2008 ఫిబ్రవరి రెండో తారీకు. ఆఫీసుకు వెళ్ళడానికి బస్టాప్‌లో నిలబడి ఉన్నాను. బైక్ మీద ఇద్దరు వ్యక్తులు వచ్చి నా ముందు ఆగారు. వాళ్ళు ముఖానికి ముసుగులు వేసుకొని ఉన్నారు. ఏం జరుగుతోందో గమనించేలోపే... వాళ్ళు నా ముఖం మీద ఏదో ద్రవం పోసి పరారయ్యారు. ఆట పట్టించడానికి ఎవరో నీళ్ళు పోసి ఉంటారనుకున్నాను. హఠాత్తుగా ముఖమంతా మంట. ముఖం మీద చర్మం కరిగిపోతోంది. నేను పెద్దగా కేకలు పెట్టాను. "ఏదీ కనిపించడం లేదు. నన్ను కాపాడండి" అని అరిచాను. నాచుట్టూ కార్లు, వాహనాలు వెళ్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. జనం మాట్లాడుకుంటున్నారు. కానీ ఎవరూ సాయం చెయ్యడానికి ముందుకురాలేదు. అలాగే సొమ్మసిల్లిపోయాను. ఒక గంట తరువాత... అటుగా వెళ్తున్న మా పొరుగింటి వ్యక్తి నన్ను చూశారు. నా ముఖం మీద ఎవరో యాసిడ్ పోశారని స్థానికులు చెప్పడంతో... ఆయన నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. కానీ ఎఫ్ఐఆర్ లేకుండా అడ్మిట్ చేసుకోవడం కుదరదన్నారు. దాంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాం. తల్లితండ్రులు కానీ, సంరక్షకులు కానీ లేకుండా ఎఫ్ఐఆర్ ఫైల్ చెయ్యమని పోలీసులు చెప్పారు. ఇంతలో ఈ విషయం నేను పని చేస్తున్న కంపెనీలో తెలిసింది. నాకోసం అంబులెన్స్ పంపించారు. నన్ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్చారు. ఇదంతా వాళ్ళూ వీళ్ళూ చెప్పిందే. ఎందుకంటే ఆ సంఘటన తరువాత ఆరు రోజులకు కాని నాకు స్పృహ రాలేదు. నేను మేలుకొనేసరికి మా అమ్మానాన్నా నా దగ్గరే ఉన్నారు. నా కళ్ళు బాగా దెబ్బతిన్నాయని వాళ్ళు చెబితే తెలిసింది. నాలుగు నెలలపాటు ఆసుపత్రిలోనే గడిపాను. వైద్యులు అనేక సర్జరీలు చేసినా, నా చూపు శాశ్వతంగా పోకుండా కాపాడలేకపోయారు. నామీద దాడి చేసిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అతను ఇంటికి దగ్గర్లోనే ఉండేవాడు. నన్ను పెళ్ళి చేసుకుంటానని నా రూమ్‌మేట్ ద్వారా కబురు పెట్టాడు. నాకు ఆ ఆలోచన లేదని చెప్పాను. అతను ఆ జవాబును భరించలేకపోయాడు. మరొకరి సాయంతో నా మీద యాసిడ్ దాడి చేశాడు. అరెస్టయిన ఆరు నెలల్లో జైలునుంచి బయటకు వచ్చేశాడు. కానీ నా పరిస్థితే నానాటికీ అధ్వాన్నమైపోయింది.



నా పేరు చెప్పి పిల్లల్ని భయపెట్టేవారు...

ఆసుపత్రినుంచి డిశ్చార్జి అయ్యాక... ఉత్తరాఖండ్‌లో నా స్వస్థలమైన కనాల్ గ్రామానికి వచ్చేశాను. అప్పుడే అసలు పోరాటం ప్రారంభమైంది. శరీరానికి అయిన గాయాలు ఎంతో కొంత కాలానికి ఏదో ఒక విధంగా మానిపోతాయి. మానసికమైన, భావోద్వేగపరమైన గాయాలు తగ్గడం అంత సులువు కాదు. రెండేళ్ళపాటు నా గదిలోంచి బయటకు రాలేదు. మా బంధువులు, ఇరుగుపొరుగువారు నన్ను హీనంగా చూశారు. "అల్లరి చెయ్యకుండా నిద్రపో.. లేకపోతే కవితా దీదీని పిలుస్తా" అంటూ వికృతంగా మారిన నా ముఖాన్ని గుర్తు చేసి పిల్లల్ని భయపెట్టేవారు. నాలో వేదన నానాటికీ పెరిగింది. అనేకసార్లు ఆత్మహత్యకు కూడా ప్రయత్నించాను. కానీ చావడం ఏ సమస్యకూ పరిష్కారం కాదనిపించింది. "ఎవరేమనుకున్నా సరే... నా బతుకు నాది. నా దుస్థితిని క్షణక్షణం గుర్తుచేసే మనుషులు, వాతావరణానికి దూరంగా వెళ్ళాలి. నా జీవితానికి ఒక అర్థం కల్పించుకోవాలి" అనుకున్నాను. 2011లో డెహ్రాడూన్‌లోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీకాప్డ్'లో చేరాను. కంప్యూటర్ల వినియోగం, కుట్టుపని, కొవ్వొత్తులు, ఎన్వలప్ కవర్ల తయారీ నేర్చుకున్నాను. ఆ సంస్థ నుంచి బయటకు వచ్చాక... కుట్లు, అల్లికలే నాకు జీవనోపాధి అయ్యాయి. అదే సమయంలో నాకు సందీప్ రావత్ పరిచయం అయ్యారు. ఆయన వివిధ వైకల్యాలున్న పిల్లల కోసం 'యుఎస్ఆర్ ఇందు సమితి స్కూల్' నడుపుతున్నారు. ఆ స్కూల్‌లో పిల్లలకు ఇంగ్లీష్, లెక్కలు నేర్పడం మొదలుపెట్టాను. నా ఆదాయంలో ఎక్కువ భాగం పొదుపుచేసి, ముప్పై మందికి పైగా పిల్లల్ని చదివిస్తున్నాను. అనేక మంది మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం, ప్రభుత్వ పథకాలు అందడం కోసం కూడా సాయపడ్డాను. ఆ తరువాత 'కవిత ఉమెన్ సపోర్ట్ హోమ్' పేరుతో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాను. దానికి అవసరమైన భూమినీ, మౌలిక సదుపాయాలను సందీప్ రావత్ సమకూర్చారు. ప్రస్తుతం గ్రామీణ మహిళలకు కుట్టుపని, బొమ్మల తయారీ తదితరాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వాళ్ళు తయారు చేసిన బొమ్మలు, కొవ్వొత్తులు, హ్యాండ్ బ్యాగ్స్‌లాంటి వస్తువులను విక్రయిస్తున్నాం. వాటివల్ల వారికి కొంత ఆదాయం లభిస్తోంది. నా గురించి తెలుసుకున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం నన్ను అభినందిస్తూ... 2015లో మహిళా సాధికారతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ప్రస్తుతం నేను ఓపెన్ యూనివర్సిటీలో బిఎ సైకాలజీ, మరోవైపు టీచింగ్‌లో డిప్లమా చేస్తున్నాను. యాసిడ్ దాడి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. పదహారేళ్ళుగా అంధురాలుగానే జీవిస్తున్నాను. అయితే ఈ కాలంలో చాలా నేర్చుకున్నాను. నా కాళ్ళ మీద నేను నిలబడ్డాను. తోటివారికి నాకు వీలైనంత చేయూత అందిస్తున్నాను. ఇప్పుడు నా కుటుంబం నన్ను చూసి సంతోషపడుతోంది. సమాజం నన్ను గౌరవంగా చూస్తోంది. నేను నా ముఖాన్ని దాచుకోను, మేకప్ వేసుకోను, నా కళ్ళకు అద్దాలు తగిలించుకోను. 'నేను నేనుగా' ఉండడమే నాకు సంతృప్తినిస్తోంది. నేను సాధిస్తున్నవాటికి గర్వపడుతున్నాను. ధైర్యం, ఆత్మవిశ్వాసం... ఇప్పుడు అవే నా రెండు కళ్ళు"

అరటితో అసలైన లుక్!



- అరటిపండును గుజ్జుగా చేసుకోవాలి. బౌల్‌లో ఈ గుజ్జును వేసి అందులో టీస్పూన్ నారింజ రసం, టీస్పూన్ పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే యంగ్‌లుక్ వస్తుంది.
- బౌల్‌లో ఒక చిన్న అరటిపండు గుజ్జును వేసి అందులో రెండు టీస్పూన్ల అలొవెరా జెల్ వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా క్రష్ చేసి ఫేస్‌కు పట్టించాలి. మెడ చుట్టూ కూడా పట్టించుకోవాలి. ఆరిన తర్వాత చన్నీటితో ముఖాన్ని శుభ్రం చేయాలి. ఇలా చేస్తే చర్మంమీద ఉండే మంటలు తొలగిపోతాయి.
- అరటిపండులో సగం తీసుకుని మెత్తగా చూర్ణం చేసుకోవాలి. ఇందులోకి టీస్పూన్ వేపాకులతో చేసిన చూర్ణం, చిటికెడు పసుపు వేసి బాగా కలపాలి. దీన్ని ఫేస్‌ప్యాక్‌లా వేసుకోవాలి. ముప్ఫయి నిముషాల తర్వాత మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే మొటిమలు తగ్గిపోతాయి.
- బౌల్‌లో సగం అరటిపండుతో చేసిన గుజ్జు, టేబుల్ స్పూన్ తేనె వేసి మిశ్రమంగా కలపాలి. దీన్ని అప్లై చేస్తే ఫ్రెష్‌గా ఫీలవుతారు. ముఖ్యంగా అరటిపండులో ఎ,సి విటమిన్లు ఉండటం వల్ల హైపిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. నొప్పుల్లాంటివి తగ్గిపోతాయి.
- సగం అరటిపండు మిశ్రమాన్ని తీసుకుని అందులోకి రెండు చుక్కల నిమ్మరసం, టేబుల్ స్పూన్ శనగపిండి వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖంతో పాటు మెడచుట్టూ అప్లై చేయాలి. దీనివల్ల ముఖం మీద ఉండే నల్లటి వలయాలు తొలగిపోతాయి.
- పొడిచర్మం ఉండే వాళ్లు అరటిపండు చూర్ణానికి, రెండు టీస్పూన్ల కొబ్బరినూనె, టీస్పూన్ తేనె కలిపి చూర్ణం చేయాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషాల తర్వాత కడిగేస్తే చర్మంలో కాంతి వస్తుంది.
- సగం అరటిపండు మిశ్రమం, రెండు టేబుల్ స్పూన్లు ఓట్స్ తీసుకోవాలి. ఇందులోకి కొద్దిగా తేనెను కలిపి మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని అప్లయ్ చేసి ఇరవై నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. చక్కటి ఫలితం ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అరటిపండు గుజ్జు, టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, అర టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి పదిహేను నిముషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే చర్మంలో మెరుపు వస్తుంది.

నవ్య | చిత్రజ్యోతి



పవర్ ప్యాక్డ్ షెడ్యూల్ పూర్తి

సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'మాయావన్'. సీవీ కుమార్ దర్శకుడు. ఏకే ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేశ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. నీల్ తాజాగా తన ఫస్ట్ పవర్ ప్యాక్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్నారు. సందీప్ కిషన్, నీల్ ఈ చిత్రంలో యాక్షన్ ప్యాక్ష్ పాత్రల్లో కనిపించడానికి కొత్తగా మేకోవర్ అయ్యారు. ఆకాంక్ష రంజన్ కపూర్ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

నిర్మాత అయిన మరో దర్శకుడు



నేను లోకల్, 'సినిమా చూపిస్తా మావా', 'ధమాక' వంటి సూపర్ హిట్ చిత్రాలు అందించిన దర్శకుడు త్రినాథరావు నక్కిన ఇప్పుడు నిర్మాతగా మారారు. కొత్త వారిని ప్రోత్సహించడం కోసం, కొత్త టాలెంట్‌ను వెలుగులోకి తీసుకు రావడం కోసం ఆయన 'నక్కిన నరేటివ్స్' పేరుతో చిత్ర నిర్మాణ సంస్థ నెలకొల్పారు. ఈ బేనర్‌పై ఓ సినిమా కూడా ప్రారంభించేశారు. షూటింగ్ దాదాపు పూర్తయిందని నక్కిన చెప్పారు. 'న్యూ ఏజ్ కంటెంట్, అందించడంతో పాటు కొత్త వారిని ప్రోత్సహించడానికి స్థాపించిన సంస్థ ఇది. యంగ్ ట్యాలెంట్‌తో ఓ సినిమా తీశాను. త్వరలోనే టైటిల్, ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం' అని చెప్పారు.

మస్త్ షేడ్స్‌తో హలో అమ్మాయి



అభినవ్ గోమఠం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మస్త్ షేడ్స్ ఉన్నాయ్ రా'. వైశాలి రావు కథానాయిక. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి తిరుపతిరావు దర్శకుడు. భవాని కాసుల, ఆరీం రెడ్డి, ప్రశాంతి వి నిర్మాతలు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'హలో అమ్మాయి' అంటూ సాగే ఈ గీతాన్ని కిట్టు విస్సాప్రగడ రాశారు. టీ సంజీవ్ స్వరాలందించారు. సిడ్ శ్రీరామ్ అద్భుతంగా ఆలపించారు. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అలీరాజా కీలకపాత్రలు పోషిస్తున్నారు.



ఓటీటీలో రిలీజ్ చేస్కో అన్నారు

విధు వినోద్ చోప్రా

బాలీవుడ్‌లో ఇటీవల చిన్న సినిమాగా విడుదలై ఘన విజయం సాధించిన చిత్రం '12th ఫెయిల్'. పేదరికాన్ని అధిగమించి ఐపీఎస్ అధికారిగా ఎదిగిన మనోజ్‌కుమార్ శర్మ జీవిత కథ ఆధారంగా దర్శకుడు విధు వినోద్ చోప్రా రూపొందించిన సినిమా ఇది. రూ. 20 కోట్లతో నిర్మిస్తే ఇప్పటికి రూ 60 కోట్లు వసూలు చేసింది. పెద్ద చిత్రాల పోటీని తట్టుకుని బరిలో నిలిచింది. విక్రాంత్ మాస్సే, మేధా శంకర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విజయోత్సవంలో దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాను థియేటర్‌లో ఎవరూ చూడరు. మహా అయితే ఓపెనింగ్ కలెక్షన్లు ఏ రెండు లక్షలు, మొత్తం మీద రూ. 30 లక్షలు వస్తే గొప్పే. అందుకే థియేటర్‌లో కాకుండా ఓటీటీలో విడుదల చేసుకో అన్నారు చాలా మంది. వాళ్లలో నా భార్య కూడా ఉంది. అయినా కంటెంట్ మీద నమ్మకంతో నేను థియేటర్‌లోనే విడుదల చేశాను. నా సొంత డబ్బులతో పబ్లిసిటీ చేశాను. సినిమా ఫలితం ఏమిటన్నది మీ అందరికీ తెలిసిందే' అన్నారు.

హృదయానికి హత్తుకునే ట్రూ లవర్



మణికందన్, శ్రీ గౌరిప్రియ, కన్నరవి ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ట్రూ లవర్'. నజరేత్ పసీలియన్, మగేశ్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేశన్ నిర్మించారు. ఓ విభిన్న ప్రేమకథగా దర్శకుడు వ్యాస్ రాజ్ మలిచారు. ఈ సినిమా తెలుగు వెర్షన్‌కు దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. హీరో మణికందన్ మాట్లాడుతూ 'యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ చిత్రం నచ్చుతుంది. తెలుగు నేర్చుకొని నా పాత్రకు డబ్బింగ్ చెప్పాను' అన్నారు. మారుతి మాట్లాడుతూ "ట్రూ లవర్ చూస్తుంటే నేను తీసిన 'ఈ రోజుల్లో', 'బస్టాప్' చిత్రాలు గుర్తుకొచ్చాయి. కథను హృదయానికి హత్తుకునేలా దర్శకుడు తెరకెక్కించాడు' అని చెప్పారు. ట్రూ లవర్స్ కోసం రెండు రోజులు ముందుగానే ప్రీమియర్ షోస్ వేస్తున్నామని ఎస్‌కేఎన్ తెలిపారు.



అయ్యో పాపం సారూ...

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్'. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్' అనేది ఉపశీర్షిక. దివ్య భారతి హీరోయిన్. 'పాగల్' ఫేమ్ నరేశ్ కుప్పిలి దర్శకుడు. చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా నుంచి 'అయ్యో పాపం సారూ' అంటూ సాగే గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. ఈ పాటకు సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించగా లియోన్ జేమ్స్ స్వరపరిచారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ప్రస్తుతం హీరో హీరోయిన్లపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నాం. యాక్షన్ ఎపిసోడ్స్ ఆకట్టుకుంటాయి. టెక్నికల్‌గా ఈ చిత్రం ఉన్నత స్థాయిలో ఉంటుంద'న్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రసూల్ ఎల్లోర్

మార్కెట్ మహాలక్ష్మి కథేంటి?



'కేరింత' ఫేమ్ పార్వతీశం, ప్రణీకాన్వికా జంటగా నటిస్తున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేష్ కలారు నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్, ముక్కు అవినాశ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను రచయిత బీవీఎస్ రవి చేతుల మీదుగా యూనిట్ ఆవిష్కరించింది. పార్వతీశం ఈ సినిమాతో సక్సెస్ కొడతాడని దర్శకుడు తెలిపారు. మార్కెట్ మహాలక్ష్మీ అనే యువతి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా చిత్ర కథ సాగుతుందని నిర్మాత తెలిపారు.

అపోలో మైక్రోసిస్టమ్స్ లాభంలో 35 శాతం వృద్ధి

హైదరాబాద్: అపోలో మైక్రోసిస్టమ్స్ లిమిటెడ్ (ఏఎంఎస్ఎల్) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.91.84 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.10 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.6.60 కోట్లు)తో పోల్చితే లాభం 35 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ.71.73 కోట్ల నుంచి రూ.77.46 కోట్లకు పెరిగాయని కంపెనీ పేర్కొంది. ఏరోస్పేస్, రక్షణ, ట్రాన్స్‌పోర్టేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలకు అవసరమైన టెక్నాలజీ సొల్యూషన్లను ఏఎంఎస్ఎల్ అందిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ		విజయవాడ	538
హైదరాబాద్	535	విశాఖపట్నం	555
5వ తేదీ		వరంగల్	537
చిత్తూరు	573	దజను గుడ్లు రూ.72	
గోదావరి	538		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	111	గోదావరి	113
వరంగల్	111	విజయవాడ	113
కరీంనగర్	111	గుంటూరు	117
మహబూబ్‌నగర్	111	ఒంగోలు	117
కర్నూలు	111	చిత్తూరు	123
విశాఖపట్నం	107		

ఈసారికీ అంతే

రెపో రేట్లలో యథాతథ స్థితి!
8న ఆర్‌బీఐ పాలసీ

ముంబై/న్యూఢిల్లీ: ఈ వారంలో జరగబోయే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో కూడా కీలక రెపో రేటు విషయంలో యథాతథ స్థితికే మొగ్గుచూపే ఆస్కారం ఉందంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇదే చివరి ఎంపీసీ సమావేశం. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలోని ఎంపీసీ మంగళవారం నుంచి మూడు రోజుల పాటు దేశీయంగాను, అంతర్జాతీయంగాను తాజా ఆర్థిక స్థితిని, ద్రవ్యోల్బణం తీరుతెన్నులను సమీక్షించనుంది. సమీక్ష అనంతరం గురువారం (8వ తేదీ) ఉదయం దాస్ ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు. ఇప్పటికీ రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి పరిధిలో గరిష్ఠ స్థాయిలోనే ఉన్నందు వల్ల ఈ సారి కూడా రెపో రేటు తగ్గింపు అవకాశాలు ఇంచుమించుగా లేనట్టేనన్నది ఆర్థిక నిపుణుల అభిప్రాయం. సుమారు ఏడాది కాలంగా ఆర్‌బీఐ రెపో రేటును ఎలాంటి మార్పులు లేకుండా 6.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తోంది. చివరిసారిగా గత ఏడాది ఫిబ్రవరి పాలసీలో రెపో రేటును 6.25 శాతం నుంచి 6.5 శాతానికి పెంచారు. గత ఏడాది జూలైలో గరిష్ఠ స్థాయి 7.44 శాతం నుంచి తగ్గుతూ వస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు నెలలో 5.69 శాతం వద్ద ఉంది. ఆర్‌బీఐ అంచనాల ప్రకారం జూన్ చివరి వరకు ద్రవ్యోల్బణం 5 శాతం కన్నా పైనే ఉండవచ్చు. దీనికి తోడు వృద్ధి కూడా బలంగానే ఉన్నందు వల్ల రేట్ల తగ్గింపునకు తక్షణ ఒత్తిడి కూడా ఏమీ లేదన్నది విశ్లేషకుల అభిప్రాయం.

ఎన్ఎఫ్ఐఆర్ ముసాయిదా బిల్లు రెడీ: నేషనల్ ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ రిజిస్ట్రీ (ఎన్ఎఫ్ఐఆర్) ఏర్పాటుకు వీలు కల్పించే ముసాయిదా బిల్లు సిద్ధమైందని, జూలై సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో ప్రతిపాదించే ఆస్కారం ఉన్నదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. రుణ సంబంధిత సమాచారం సిద్ధం చేయడం కోసం ప్రభుత్వ నిర్వహణలోని సంస్థ ఒకటి ఏర్పాటు చేయడం, ఎన్ఎఫ్ఐఆర్‌గా వ్యవహరించే ఆ సంస్థ ద్వారా లెండింగ్ ఏజెన్సీలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉంచడం దీని లక్ష్యం.



ముకేశ్ అంబానీ బ్రాండింగ్ అదుర్స్

ప్రపంచంలో రెండో స్థానంలో అంబానీ

న్యూఢిల్లీ: సంపద సృష్టిలోనే కాదు, బ్రాండ్ ఇమేజీ సృష్టికర్తగానూ రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మరోసారి తన సత్తా చాటారు. బ్రాండ్ ఫైనాన్స్ అనే సంస్థ ప్రపంచంలోని మేటి సంస్థల సీఈఓలతో రూపొందించిన బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్-2024లో ముకేశ్ అంబానీకి మన దేశం నుంచి ఒకటో స్థానం, ప్రపంచ సీఈఓల జాబితాలో రెండో స్థానం దక్కింది. అంబానీ ఈ ఇండెక్స్‌లో రెండో స్థానం సంపాదించడం వరుసగా ఇది రెండో సంవత్సరం. చైనా ఎలక్ట్రానిక్ దిగ్గజం టెన్సెంట్ చీఫ్ హౌటెంగ్ మా కేవలం 1.3 శాతం అధిక స్కోరుతో అంబానీని తోసిపుచ్చి ప్రథమ స్థానంలో నిలిచారు.

సత్య నాదెళ్లను అధిగమించి: బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్-2024లో ముకేశ్ అంబానీ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌లను వెంబడించిపోయారు. ఉద్యోగులు, మదుపరులు, ఇతర స్టేక్ హోల్డర్లు, సామాజిక ప్రయోజనాలను సమతౌల్యం చేస్తూ కంపెనీ సుస్థిర అభివృద్ధికి దోహదం చేసే సీఈఓలకు ఈ ఇండెక్స్‌లో స్థానం లభిస్తుంది. కాగా గత ఏడాది ఈ ఇండెక్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్న టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఈ సంవత్సరం ఐదో స్థానానికి ఎదిగారు. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) చీఫ్ అనీశ్ షా, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ వరుసగా 6, 16వ స్థానాల్లో నిలిచారు.

'పేటీఎం'కు గుడ్‌బై చెప్పండి

ఇతర యాప్‌లకు మళ్లండి.. ట్రేడర్లకు సీఏఐటీ సూచన

న్యూఢిల్లీ: పేటీఎం సంక్షోభం దేశంలోని చిరు వ్యాపారులనూ భయపెడుతోంది. వ్యాపారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తమ వ్యాపార లావాదేవీల కోసం పేటీఎం యాప్‌నకు గుడ్‌బై చెప్పి, ఇతర పేమెంట్ యాప్‌లకు మారాలని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) తన సభ్యులకు సూచించింది. పేటీఎం వ్యాలెట్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో సీఏఐటీ ఈ సూచన చేసింది. వ్యాపారుల నిధులకు భద్రతతో పాటు ఆర్థిక లావాదేవీలకు అంతరాయం లేకుండా ఉండేందుకు ఈ చర్యలు అవసరమని తెలిపింది. పేటీఎం వ్యాలెట్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ద్వారా అక్రమ నగదు లావాదేవీలు, రూ.వందల కోట్ల విలువైన అనుమానాస్పద లావాదేవీలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 29 నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్.. కొత్త డిపాజిట్ల స్వీకరణ, రుణ లావాదేవీలు, టాప్-అప్స్ నిలిపివేయాలని ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే.

డిపాజిట్ల సేకరణలో బీఓఎందే పైచేయి

న్యూఢిల్లీ: దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ల సేకరణలో వృద్ధిపరంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) అగ్రగామిగా ఉంది. పలు బ్యాంకులు డిపాజిట్ల సేకరణలో ఎదురీదుతున్న సమయంలో బీఓఎం, ఎస్‌బీఐ మాత్రమే డిసెంబరు త్రైమాసికంలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోగలిగినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. డిపాజిట్ల సేకరణలో బీఓఎం 17.89 శాతం వృద్ధిని నమోదు చేయగా ఎస్‌బీఐ 12.84 శాతం వృద్ధిని నమోదు చేసింది.

ఆయిల్ కంపెనీల పెట్టుబడి రూ.1.2 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఐఓసీ, ఇతర ఆయిల్ కంపెనీలు పెద్దఎత్తున పెట్టుబడులకు సిద్ధమవుతున్నాయి. ఈ పెట్టుబడులు ఎంత లేదన్నా రూ.1.2 లక్షల కోట్ల వరకు ఉంటాయని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 5% ఎక్కువ. ఈ రూ.1.2 లక్షల కోట్లలో రూ.30,800 కోట్లు ఓఎన్‌జీసీ, ఓఎన్‌జీసీ విదేశ్ రూ.5,580 కోట్లు, ఐఓసీ రూ.30,910 కోట్లు, బీపీసీఎల్ రూ.13,000 కోట్లు, గెయిల్ రూ.8,000 కోట్లు, హెచ్‌పీసీఎల్ రూ.12,500 కోట్లు, ఆయిల్ ఇండియా రూ.6,880 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నాయి.

22,250 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 5-9 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్త్ర

నిఫ్టీ గత వారం 21,854-21,450 పాయింట్ల మధ్యన కదలాడి 501 పాయింట్ల లాభంతో 21,854 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,599, 21,205, 20,092, 19,652 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,450
నిరోధ స్థాయిలు: 22,050, 22,150, 22,250 (21,950 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,650, 21,550, 21,450 (21,750 దిగువన బేరిష్)

లాభాల బాటలోనే..!

రెండు వారాల వరుస నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బయటపడ్డాయి. ఒడుదొడుకులకు లోనైనప్పటికీ బడ్జెట్ వారంలో అదరగొట్టాయి. ఈ వారం కూడా అదే జోరును కనబరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలక నిరోధ స్థాయిలను అధిగమించిన నిఫ్టీ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు పుంజుకోవటం, హెవీవెయిట్ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరటం ఇందుకు దోహదం చేసింది. నిఫ్టీ ఫిబ్రవరి ఫ్యూచర్స్ నిరోధ స్థాయి 22,200, మద్దతు స్థాయి 21,880 వద్ద ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

వీగార్డ్ ఇండస్ట్రీస్: డిసెంబరు త్రైమాసికంలో ఈ కంపెనీ అంచనాలను మించి ఫలితాలను ప్రకటించింది. దీంతో ఈ కౌంటర్‌లో మూమెంటమ్ పెరిగింది. గత 8 నెలలుగా ఈ షేరు రూ.280 స్థాయిలో కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.310 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.300/305 స్థాయిల్లో ప్రవేశించి రూ.355/380 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.290 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ పోర్ట్స్: చివరి ఏడు సెషన్ల నుంచి ఈ షేరు పూర్తిగా బుల్లిష్‌నెస్‌ను ప్రదర్శిస్తూ వస్తోంది. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు విడుదల చేసినప్పటి నుంచి అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. గత శుక్రవారం రూ.1,261 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ట్రేడర్లు రూ.1,250/1,260 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,330/1,420 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌టీపీసీ: గత రెండేళ్లుగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. త్రైమాసిక ఫలితాలు విడుదల చేసిన ప్రతిసారి ఈ షేరు దూసుకుపోతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు, డివిడెండ్ ప్రకటనతో గత రెండు వారాలుగా ఈ షేరు మరింత దూకుడును ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 3.26 శాతం లాభంతో రూ.332.50 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.330/325 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.365/395 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.314 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా స్టీల్: త్రైమాసిక ఫలితాలు విడుదలైనప్పటి నుంచి ఈ కౌంటర్‌లో బుల్‌రన్ మొదలైంది. కొన్ని రోజులుగా ఒడుదొడుకులు ఎదురవుతున్నా ప్రస్తుతం నిలదొక్కుకుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.138.70 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.135 స్థాయిలో ప్రవేశించి రూ.155/170 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.129 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: ఈ ఏడాది ఆరంభం నుంచి స్వల్పకాలిక డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేరు ప్రస్తుతం పుంజుకుంటోంది. త్వరలో కంపెనీ క్యూ3 ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.583 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.580/570 శ్రేణిలో ఎంటర్ అయి రూ.625/655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.555 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

జీవితకాల గరిష్ఠంలో అప్రమత్తం

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 21,500 వద్ద బలమైన అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై చివరికి జీవితకాల గరిష్ఠ స్థాయి 22,125 వరకు వెళ్లింది. కాని బలమైన ఇంట్రాడే రియాక్షన్‌తో 300 పాయింట్లు నష్టపోయింది. అయినా ముందు వారంతో పోల్చితే 500 పాయింట్లకు పైగా లాభపడి 21,850 వద్ద ముగిసింది. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతను ఇది సూచిస్తోంది. మార్కెట్ ఇక్కడ స్వల్పకాలిక నిరోధం ఏర్పరచుకునేందుకు ఇది సంకేతం. అందువల్ల స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. రాబోయే కొద్ది రోజుల్లో కన్సాలిడేషన్ లేదా కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ సానుకూలంగానే ఉంది. గత నాలుగు వారాలుగా మార్కెట్ 22,000-21,000 పాయింట్ల మధ్యన కదలాడుతోంది. మరోసారి స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే రాబోయే కొద్ది రోజుల్లో ఇక్కడ బలం ప్రదర్శించడం తప్పనిసరి. ట్రెండ్‌లో స్పష్టత కోసం కొంత సమయం పట్టవచ్చు.



వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన మానసిక అవధి 22,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన నిరోధం 22,150. ఇదే జీవితకాల గరిష్ఠ స్థాయి. గత నెలలో రెండు సార్లు ఇక్కడ నుంచే బలమైన కరెక్షన్ ఏర్పడింది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 21,650 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21,400. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 1,000 పాయింట్ల లాభంతో 45,950 వద్ద ముగిసింది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే తదుపరి నిరోధం 46,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 47,100. బలహీనపడి మద్దతు స్థాయి 45,600 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్‌కు 22,150 వద్ద డబుల్ టాప్ ఏర్పడింది. ఇక్కడే అప్రమత్త ట్రెండ్ కనిపించింది. కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. మరింత స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించి కొత్త శిఖరాల దిశగా పయనం సాగించాలంటే 22,150 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి లేదా బ్రేకౌట్ చేయాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం:	22,000, 22,080
మద్దతు:	21,860, 21,800

www.sundartrends.in



విజయం పరిపూర్ణం

- దేవిస్ కప్ పోరులో పాకిస్థాన్ చిత్తు
- వరల్డ్ గ్రూప్-1కు భారత్ అర్హత

ఇస్లామాబాద్: డేవిస్ కప్‌లో పాకిస్థాన్‌పై తనకు తిరుగు లేదని భారత్ మరోసారి నిరూపించింది. తాజా పోరుకు ముందు ఏడుసార్లు దాయాదితో తలపడగా..అన్నిసార్లూ మనోళ్లదే విజయం. ఆదివారంనాటిది 8వ గెలుపు. ఈ విజయంతో మనోళ్లు వరల్డ్ గ్రూప్-1లో తలపడేందుకు అర్హత సాధించారు. ఇక..60 ఏళ్ల తర్వాత పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టిన భారత జట్టు 4-0తో ప్రత్యర్థిని చిత్తుచేసి ఈ పర్యటనను చిరస్మరణీయం చేసుకుంది. శనివారం రెండు సింగిల్స్‌లో గెలిచి 2-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఇక రెండోరోజు..డబుల్స్ మ్యాచ్‌లో యుకీ భాంబ్రి/సాకేత్ మైనేని ద్వయం 6-2, 7-6 (5)తో ముజావిల్ ముర్తజా/అకీల్ ఖాన్ జోడీని ఓడించింది. ఇక..అంతగా ప్రాధాన్యంలేని నాలుగో మ్యాచ్‌లో తాను ఆడతానని భారత ఆటగాడు పూనాచా కోరడంతో ఆ మ్యాచ్‌ని నిర్వహించారు. 28 ఏళ్ల పూనాచా 6-3, 6-4తో షోయబ్‌పై సునాయాసంగా నెగ్గడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. దీంతో చివరి రివర్స్ సింగిల్స్‌ను ఆడించలేదు.

కేన్, రచిన్ శతకమోత

- న్యూజిలాండ్ 258/2 ● సౌతాఫ్రికాతో తొలి టెస్టు



మౌంట్ మాంగనుయ్: కేన్ విలియమ్సన్ (112 బ్యాటింగ్), రచిన్ రవీంద్ర (118 బ్యాటింగ్) అజేయ శతకాలతో.. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఆదివారం ఆరంభమైన మ్యాచ్‌లో మొదటి రోజు ఆటముగిసే సరికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 258/2 స్కోరు చేసింది. క్రీజులో ఉన్న కేన్, రచిన్ మూడో వికెట్‌కు అభేద్యంగా 219 పరుగులు జోడించారు. కేన్‌కు టెస్టుల్లో ఇది 30వ శతకం. ఈ క్రమంలో 29 శతకాల వీరులు డాన్ బ్రాడ్‌మన్, విరాట్ కోహ్లీలను అధిగమించాడు.

తొలిసారి భార్య ఫొటో షేర్ చేశాడు



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ తన 8వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా భార్య సఫా బేగ్‌తో కలిసున్న ఫొటోను పోస్ట్ చేశాడు. గతంలోనూ ఇర్ఫాన్ భార్యతో ఉన్న ఫొటోలను షేర్ చేసినా.. అందులో ఆమె ముఖం కనిపించేది కాదు. దీంతో అతనిపై చాలా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు తొలిసారి భార్య ముఖం కనిపించేలా ఉన్న ఫొటోను షేర్ చేసి అభిమానులను సర్‌ప్రైజ్ చేశాడు. సౌదీ మోడల్ సఫాను ఇర్ఫాన్ 2016లో వివాహం చేసుకొన్నాడు.

ఇక..బౌలర్ల చేతుల్లో

ఇంగ్లండ్ లక్ష్యం 399 • ప్రస్తుతం 67/1
భారత్ రెండో ఇన్నింగ్స్ 255 • గిల్ శతకం

రెండో టెస్టు



శుభ్‌మన్ గిల్ (104)

సాగర తీరాన రెండో టెస్టు అత్యంత ఆసక్తికరంగా సాగుతోంది. లక్ష్యం 399 పరుగులైనా.. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్ అభిమానుల్లో గుబులు పుట్టిస్తుండగా..వారి దూకుడుకు చెక్ పెట్టేందుకు భారత బౌలర్లు సైతం ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సోమవారం ఆట ఎలాంటి మలుపులు తీసుకుంటుందన్నది ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఫామ్ కోల్పోయి తంటాలు పడుతూ.. జట్టులో చోటు అవసరమా? అనే విమర్శలకు శుభ్‌మన్ గిల్ (147 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 104) చెక్ పెట్టాడు. దాదాపు ఏడాది తర్వాత కెరీర్‌లో మూడో శతకంతో ఆకట్టుకున్నాడు. అతడి ఆట తీరుతోనే ఇంగ్లండ్ ముందు 399 పరుగుల రికార్డు ఛేదన చేరింది. అయితే ఈ లక్ష్యాన్ని ప్రత్యర్థి ఇప్పటికే ఓవర్‌కు 4.79 రన్‌రేట్‌తో ఆరంభించింది. మూడో రోజు ఆదివారం ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 14 ఓవర్లలోనే 67/1 స్కోరుతో ఉంది. ఓపెనర్లు క్రాలే (29 బ్యాటింగ్), డకెట్ (28) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. విజయానికి ఇంకా 332 పరుగుల దూరంలో ఉన్న ఇంగ్లండ్‌కు మరో రెండు రోజుల సమయం ఉండగా.. భారత్ 9 వికెట్ల దూరంలో ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు ప్రమాదకరంగా కనిపించకపోవడంతో బంతికి, బ్యాట్‌కు మధ్య సమరంలో విజేత ఎవరో తేలనుంది. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 78.3 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. గిల్‌కు జతగా అక్షర్ పటేల్ (45) మాత్రమే ఆకట్టుకోగలిగాడు. స్పిన్నర్ హార్ట్‌లీకి 4, రెహాన్‌కు 3, అండర్సన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

గిల్ అండగా..: ఓవర్‌నైట్ స్కోరు 28/0తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత బ్యాటర్లు ఎప్పటిలాగే తడబడ్డారు. అయితే ఈసారి గిల్ ఆదుకున్నాడు. గత 12 ఇన్నింగ్స్‌లో కనీసం అర్ధసెంచరీ కూడా చేయలేకపోయిన అతను ఈసారి పూర్తి సాధికారికంగా బ్యాటింగ్ కొనసాగించాడు. తీవ్ర ఒత్తిడిలోనే క్లాస్ ఇన్నింగ్స్ చూపుతూ కీలకమైన శతకంతో జట్టును పటిష్ఠ స్థితిలో నిలపడమే కాకుండా జట్టులో తన చోటును పదిలం చేసుకున్నాడు. గిల్ తర్వాత అక్షర్‌దే అత్యధిక స్కోరు. చివర్లో అశ్విన్ (29) పోరాటం ఆధిక్యాన్ని పెంచేందుకు తోడ్పడింది. వాస్తవానికి టీ బ్రేక్ సమయానికే భారత్ ఆధిక్యం 370 పరుగులకు చేరింది. చేతిలో మరో 4 వికెట్లున్నాయి. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్ ముందు తాము ఎంత ఆధిక్యంలో ఉన్నా ప్రమాదమే అనే ఆందోళన భారత జట్టులో కనిపించింది. కానీ మరో 28 పరుగులు చేసి మిగతా వికెట్లను కోల్పోవడంతో ఆధిక్యం 400లోపే ముగిసింది. ఆరంభంలోనే కెప్టెన్ రోహిత్ (13), డబుల్ సెంచరీ హీరో యశస్వీ జైస్వాల్ (17)లను వరుస ఓవర్లలో పేసర్ అండర్సన్ పెవిలియన్‌కు చేర్చాడు. గిల్ ఆరంభంలో నెమ్మదిగా ఆడినా కుదురుకున్నాక ఆత్మవిశ్వాసంతో షాట్లు ఆడాడు. శ్రేయాస్ అయ్యర్(29)తో కలిసి మూడో వికెట్‌కు 81 పరుగులు జోడించాడు. మిడాఫ్ నుంచి వెనక్కి పరిగెడుతూ స్టోక్స్ అందుకున్న సూపర్ క్యాచ్‌తో శ్రేయాస్ వెనుదిరిగాడు. రజత్ (9) విఫలం కాగా.. అక్షర్ బ్యాటింగ్ సత్తాను మరోసారి నిరూపించుకున్నాడు. రెండో సెషన్‌లో గిల్ స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుంటూ పరుగులు సాధించాడు. రెహాన్ ఓవర్‌లో 6,4,4తో చెలరేగి 14 రన్స్ సాధించిన గిల్ కాసేపటికే శతకం కూడా పూర్తి చేశాడు. కానీ ఊపు మీదున్న అతడిని బషీర్ వెనక్కిపంపాడు. అప్పటికే అక్షర్‌తో కలిసి గిల్ ఐదో వికెట్‌కు 89 పరుగులు జోడించడం విశేషం. అటు చక్కగా కుదురుకున్న అక్షర్ సైతం స్వల్ప వ్యవధిలోనే హార్ట్‌లీకి చిక్కాడు. ఇక ఆఖరి సెషన్ ఆరంభ రెండు ఓవర్లలోనే భరత్ (6), కుల్దీప్ (0) వికెట్లను భారత్ కోల్పోయింది. ఈ దశలో అశ్విన్‌కు బుమ్రా (26 బంతుల్లో 0) అండగా నిలవడంతో తొమ్మిదో వికెట్‌కు 26 పరుగులు సమకూరాయి.

వైజాగ్‌లో ఆడకపోతే అంతే..

గతేడాది మార్చి నుంచి గిల్ టెస్టుల్లో పేలవ ప్రదర్శన కొనసాగిస్తున్నాడు. దీంతో వైజాగ్ టెస్టుకు ముందు టీమ్ మేనేజ్‌మెంట్ అతడికి అల్టిమేటం జారీ చేసినట్టుగా సమాచారం. ఒకవేళ రెండో టెస్టులో విఫలమైతే వేటు ఖాయమయ్యేదట. అదే జరిగితే ఈనెల 9 నుంచి గుజరాత్‌తో జరిగే రంజీ మ్యాచ్‌లో పంజాబ్ తరఫున బరిలోకి దిగాల్సిందేనని గిల్ తన కుటుంబసభ్యులకు కూడా తెలిపినట్టు మీడియా కథనం. కానీ ఒత్తిడిలోనూ అద్భుత ఆటతీరుతో చెలరేగిన గిల్.. కీలక సమయంలో సెంచరీతో రాణించి జట్టులో తన స్థానానికి ఢోకా లేకుండా చేసుకున్నాడు.

3 — ఇంగ్లండ్ జట్టు నాలుగో ఇన్నింగ్స్‌లో ఇప్పటికే మూడుసార్లు 399+ స్కోర్లు సాధించింది.

టెస్టుల్లో ఇంగ్లండ్ అత్యధిక ఛేదన (378) రికార్డు భారత్‌పైనే ఉంది. అయితే ఇప్పటిదాకా భారత గడ్డపై ఏ పర్యాటక జట్టూ 300+ రన్స్‌ను ఛేదించలేదు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 253

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) అండర్సన్ 17; రోహిత్ (బి) అండర్సన్ 13; గిల్ (సి) ఫోక్స్ (బి) బషీర్ 104; శ్రేయాస్ (సి) స్టోక్స్ (బి) హార్ట్‌లీ 29; రజత్ (సి) ఫోక్స్ (బి) రెహాన్ 9; అక్షర్ (ఎల్బీ) హార్ట్‌లీ 45; భరత్ (సి) స్టోక్స్ (బి) రెహాన్ 6; అశ్విన్ (సి) ఫోక్స్ (బి) రెహాన్ 29; కుల్దీప్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 0; బుమ్రా (సి) బెయిర్‌స్టో (బి) హార్ట్‌లీ 0; ముకేశ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 78.3 ఓవర్లలో 255 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-29, 2-30, 3-111, 4-122, 5-211, 6-220, 7-228, 8-229, 9-255, 10-255. **బౌలింగ్:** అండర్సన్ 10-1-29-2; బషీర్ 15-0-58-1; రెహాన్ 24.3-5-88-3; రూట్ 2-1-1-0; హార్ట్‌లీ 27-3-77-4.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బ్యాటింగ్) 29; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రెహాన్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 14 ఓవర్లలో 67/1. వికెట్ పతనం:** 1-50. **బౌలింగ్:** బుమ్రా 5-1-9-0; ముకేశ్ 2-0-19-0; కుల్దీప్ 4-0-21-0; అశ్విన్ 2-0-8-1; అక్షర్ 1-0-10-0.



రూట్‌కు గాయం

ఇంగ్లండ్ వెటరన్ బ్యాటర్ జో రూట్ చేతి వేలికి గాయం కావడంతో ఆదివారం తొలి సెషన్‌లోనే మైదానం వీడాడు. 18వ ఓవర్‌లో గిల్ క్యాచ్‌ను స్లిప్‌లో అందుకునే క్రమంలో గాయపడిన రూట్ తిరిగి ఫీల్డింగ్‌కు రాలేదు. అయితే అంతర్గత గాయం కాకపోవడంతో రూట్ బ్యాటింగ్‌కు దిగుతాడని ఇంగ్లండ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది.

గెలుపు ముంగిట ఆంధ్ర

పట్నా: బిహార్‌తో రంజీలో ఆంధ్ర జట్టు విజయానికి కేవలం 2 వికెట్ల దూరంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 313/5తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 463 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డి (159) సెంచరీతో, రషీద్ (91) అర్ధ శతకంతో రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బిహార్ మూడో రోజు ఆట ముగిసేసరికి 111/8 స్కోరు చేసింది. లలిత్ మోహన్ (4/27), శశికాంత్ (3/8) ప్రత్యర్థి బ్యాటర్లను హడలెత్తించారు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు బిహార్ ఇంకా 170 పరుగుల వెనుకంజలో ఉంది. చేతిలో 2 వికెట్లే ఉన్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో బిహార్ 182 పరుగులు చేసింది.

సిరీస్ భారత్-ఎ వశం

అహ్మదాబాద్: షామ్స్ ములాని (5/60) తిప్పేయడంతో.. ఇంగ్లండ్ లయన్స్‌తో మూడో, ఆఖరి అనధికార టెస్టులో భారత్-ఎ 134 పరుగుల తేడాతో గెలిచింది. మూడు టెస్టుల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకొంది. 403 పరుగుల ఛేదనలో భాగంగా.. ఓవర్‌నైట్ స్కోరు 83/2తో ఆటకు ఆఖరి రోజైన ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లయన్స్ 268 రన్స్‌కు కుప్పకూలింది. ఓలీ రాబిన్సన్ (80), అలెక్స్ (55) అర్ధ శతకాలు సాధించారు. సారాంశ్ 3 వికెట్లు తీశాడు. భారత్-ఎ 192, 409 పరుగులు చేయగా.. లయన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 199 రన్స్‌కు ఆలౌటైంది.

సీఈవో నియామకంపై వెనక్కు తగ్గను

ఐఓఏ చీఫ్ పీటీ ఉష

న్యూఢిల్లీ: సీఈవో నియామకంపై వెనక్కు తగ్గే ప్రశ్నే లేదని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) చీఫ్ పీటీ ఉష స్పష్టంజేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిబంధనల మేరకు ఐఓఏ సీఈవోగా రఘురామ్ అయ్యర్‌ను గతనెలలో నియమించారు. అయితే సీఈవోకి నెలకు రూ. 20 లక్షలతో పాటు అలవెన్సులు కలిపి ఏడాదికి రూ. 3 కోట్లు ప్యాకేజీగా నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ ఈసీ సభ్యులు ఉషపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. ఈసీ ఆమోదం లేకుండా వేతనం నిర్ణయించారంటూ.. మొత్తం 15 మంది ఈసీ సభ్యుల్లో 12మంది రఘురామ్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు అధ్యక్షురాలు పీటీ ఉషకు లేఖ రాశారు.

ఇబ్రహీం సెంచరీ

అఫ్ఘాన్ రెండో ఇన్నింగ్స్ 199/1
శ్రీలంకతో టెస్టు

కొలంబో: ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (101 బ్యాటింగ్) అజేయ శతకంతో కదం తొక్కడంతో శ్రీలంకతో ఏకైక టెస్టులో అఫ్ఘానిస్థాన్ పోటీలోకి వచ్చింది. ప్రత్యర్థి భారీ మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అధిగమించే దిశగా పయనిస్తోంది. మూడోరోజు ఆట ఆఖరికి రెండో ఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ వికెట్ నష్టానికి 199 పరుగులు చేసింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 42 రన్స్ వెనుకంజలో నిలిచింది. అంతకుముందు..ఓవర్‌నైట్ స్కోరు 410/6తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 29 పరుగులు జోడించి మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 రన్స్ చేయడంతో.. ఆతిథ్య జట్టుకు 241 పరుగులు ఆధిక్యం లభించింది.

బుల్స్, జెయింట్స్ జయకేతనం

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ సీజన్-10 పదోవారం ముగింపు పోటీల్లో బెంగుళూరు బుల్స్, గుజరాత్ జెయింట్స్ జట్లు విజయఢంకా మోగించాయి. ఆదివారం జరిగిన పోరులో బెంగుళూరు 42-37తో యు ముంబాపై నెగ్గింది. బుల్స్ రైడర్లు సుశీల్, అక్షిత్ కీలక సమయాల్లో రాణించి జట్టును గెలుపుతీరాలకు చేర్చారు. మరో మ్యాచ్‌లో గుజరాత్ 42-30తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. గుజరాత్ విజయంలో రైడర్లు రాకేష్, రోహిత్ ముఖ్య భూమిక పోషించారు.



నేటి నుంచి అసెంబ్లీ

- తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం
- రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ
- ఎల్లుండి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శాసనసభా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ పట్టుబడితే.. దానికి సభానాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి శాసనసభా వ్యవహారాల కమిటీ సమావేశంలో సమ్మతిస్తే.. అదనంగా మరొక రోజు సమావేశాలు కొనసాగే అవకాశం ఉందని అసెంబ్లీవర్గాలు తెలిపాయి. తొలిరోజు ఉదయం 10 గంటలకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఉభయసభలూ మంగళవారానికి వాయిదా పడతాయి. ఆ వెంటనే శాసనసభాపతి తమ్మినేని సీతారాం నేతృత్వంలో శాసనసభా వ్యవహారాల కమిటీ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి సభానాయకుడు జగన్, టీడీపీ శాసనసభా పక్ష ఉపనేత కింజరాపు అచ్చెన్నాయుడు హాజరవుతారు. ప్రశ్నోత్తరాలకు సమయం ఇవ్వాలని ఈ సమావేశంలో టీడీపీ పట్టుబట్టే వీలుంది. చివరి అసెంబ్లీ సమావేశాలు కావడంతో కనీసం వారం రోజులైనా సభ నిర్వహించాలని పట్టుబట్టేందుకు టీడీపీ సిద్ధమవుతోంది. మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. అలాగే, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి పట్ల శాసనమండలిలో సభ్యులు సమావేశమై సంతాపతీర్మానాన్ని ప్రవేశ పెడతారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను బుధవారం ఉదయం 11 గంటలకు శాసనసభలో ప్రవేశపెడతారు. శాసనమండలిలో గతేడాది మాదిరిగానే ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

జగన్ విఫల సీఎం: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలతో ప్రజలను వంచిస్తున్న సీఎం జగన్‌కు ప్రజాకోర్టులో శిక్ష ఖాయమని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన విఫల ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ఆదివారమిక్కడ ఉండవల్లిలోని ఆయన నివాసంలో టీడీపీ శాసనసభాపక్ష (టీడీఎల్పీ) సమావేశం జరిగింది. ప్రజాకోర్టు-జగన్ నెరవేర్చని హామీలపై టీడీఎల్పీ రూపొందించిన చార్జిషీటును విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఊరూరా తిరిగి అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. మేనిఫెస్టో, పాదయాత్రలో మొత్తం 730 హామీలివ్వగా.. వాటిలో 21 శాతం కూడా అమలు చేయలేదని.. కానీ 99 శాతం అమలు చేశామని చెబుతూ ప్రజలను వంచిస్తున్నారని అన్నారు. మోసపూరిత మాటలతో ప్రజలను మోసగిస్తున్న జగన్‌కు మరో రెండు నెలల్లో ప్రజాకోర్టులో శిక్ష తప్పదన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, యనమల, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

నేడు చింతలపూడిలో 'రా.. కదలిరా..'

ఏలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చింతలపూడిలో సోమవారం జరగనున్న తెలుగుదేశం పార్టీ 'రా.. కదలిరా..' భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. లక్షమందికి పైగా హాజరయ్యే ఈ భారీ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు. దీనికోసం సోమవారం మధ్యాహ్నం 1.45 గంటలకు ఆయన అనకాపల్లి జిల్లా గొందుపాలెం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 2.45 గంటలకు చింతలపూడి శివారు అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 2.55 గంటలకు రోడ్డు మార్గంలో బయల్దేరి బహిరంగ సభ వేదిక వద్దకు వస్తారు. అనంతరం ఆయన పార్టీ కేడర్, అభిమానులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సభ ముగియగానే సాయంత్రం 4.45 గంటలకు చంద్రబాబు తిరిగి హెలీప్యాడ్ వద్దకు చేరుకుని తాడేపల్లిలోని ఆయన నివాసానికి పయనమవుతారు. ఈ బహిరంగ సభ వేదికగా చంద్రబాబు సమక్షంలో వందలాది మంది వైసీపీ, కాంగ్రెస్‌ను వీడి టీడీపీలోకి చేరేందుకు సమాయత్తమవుతున్నారు. నియోజకవర్గంలోని తిమ్మిరెడ్డిపల్లి, ప్రగడవరం తదితర గ్రామాల నుంచి భారీ చేరికలు ఉంటాయని స్థానిక నాయకులు చెబుతున్నారు. కాగా, టీడీపీ భారీ బహిరంగ సభపై పోలీసులు దృష్టిపెట్టారు. సభకు ఎంతమంది హాజరవుతున్నారు..? ఏర్పాట్లు ఏ స్థాయిలో చేస్తున్నారు అంటూ ఎస్పీ మేరీ ప్రశాంతి టీడీపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

అధికారుల బదిలీలపై టీడీపీ అభ్యంతరం

- ఐపీఎస్, డీఎస్పీల బదిలీలపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అచ్చెన్న లేఖ

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో వైసీపీ సానుభూతిపరుడైన తిరుపతి ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డిని ప్రకాశం జిల్లా ఎస్పీగా నియమించడంతోపాటు, తిరుపతి కలెక్టర్ లక్ష్మీ షా ప్రొటోకాల్ ధిక్కరించి ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించడంపై టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేయనున్నందున ఆయనకు సహకరించేందుకే ఎస్పీ పరమేశ్వరరెడ్డిని ఒంగోలుకు బదిలీ చేశారని ఆరోపించారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. పి.పరమేశ్వరరెడ్డి గతంలో సీఎం వ్యక్తిగత భద్రత అధికారిగా పనిచేశారని, తిరుపతి ఎస్పీగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే అక్రమాలపై వంతపాడుతూ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఆయన్ను ప్రకాశం జిల్లాకు బదిలీ చేయడం ద్వారా ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఎన్నికల కమిషన్‌కు మరో లేఖ రాశారు. తెనాలి, విజయవాడ తూర్పు, పుత్తూరు, నగరి, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా అవకతవకలపై విచారణ జరపాలని కోరారు.

మైలవరం నుంచే పోటీ చేస్తా: దేవినేని

ఇబ్రహీంపట్నం (ఎన్టీఆర్ జిల్లా), ఫిబ్రవరి 4: తాను మైలవరం నుంచే పోటీ చేస్తానని, ఈ నెల రెండో వారంలో అన్నేరావుపేట నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని గుంటుపల్లి సీపీ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన 'మీటింగ్ విత్ లీడర్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేశినేని నాని, వసంత కృష్ణప్రసాద్, సుజనా చౌదరి తలా ఒక పార్టీలో ఉంటూ, అవకాశాలను బట్టి పార్టీలు మారుస్తూ, ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వాళ్ల పనులు చేయించుకుంటున్నారన్నారు. తాను మాత్రం పసుపు కండువా కప్పుకొని చచ్చిపోతానే తప్ప, పార్టీ మారే ప్రసక్తే లేదని, అధినేత చంద్రబాబు, కార్యకర్తల మాటే తనకు శిరోధార్యమని స్పష్టం చేశారు. 2009లో పార్టీ మారాలని, లేకుంటే మైలవరం నియోజకవర్గం వదిలి వెళ్లాలంటూ బెదిరించినా పార్టీ వీడలేదన్నారు.

జగన్ ఓటమే లక్ష్యం

- గల్ఫ్ నుంచి రానున్న జనసేన మహిళా వలంటీర్లు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

భావితరాల భవిష్యత్తు కోసం.. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పిడి దిశగా ప్రతి ఒక్కరితో పాటు ప్రవాసీయులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జనసేన సౌదీ అరేబియా శాఖ పిలుపునిచ్చింది. రానున్న ఎన్నికల్లో ప్రచారం చేయడానికి ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో మహిళా వలంటీర్లతో సహా ప్రవాసీయులను పంపించాలని కూడా నిర్ణయించింది. జనసేన ప్రాబల్య ప్రాంతంగా భావించే ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రవాసీయులు పెద్ద సంఖ్యలో సౌదీ, ఇతర గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్నారు. సౌదీలోని పారిశ్రామిక నగరమైన జుబేల్‌లో ఆదివారం జరిగిన జనసేన విస్తృతస్థాయి సమావేశంలో.. విశాఖ నగరంతో పాటు ఉత్తరాంధ్రలో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలుగుదేశంతో కలిసి ముందుకు వెళ్తూ రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విశాఖ నగర జనసేన అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని పార్టీ విధానాలను వివరించారు. జనసేన సౌదీ అరేబియా కన్వీనర్లు జి.భాస్కర్ రావు, నగేశ్, చింతల సీతరామమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పార్టీ నేతలు అంకాబత్తుల గౌరీ శంకర్, అప్పాజీ, గణేశ్, చక్రధర్, వాజీద్.. సమన్వయం చేస్తూ రానున్న ఎన్నికల్లో ప్రచారం చేయడానికి ప్రత్యేకంగా మహిళలు, ప్రవాసీయులను పంపించాలని నిర్ణయించారు.



సౌదీలోని జుబేల్ నగరంలో సమావేశమైన జనసేన సౌదీ అరేబియా శాఖ నేతలు

ఎవరికి ఏ సీటు?

(మొదటి పేజీ తరువాయి)

ఇంట్లోకి తోడ్కొని వెళ్లారు. సుమారు మూడు గంటల పాటు చర్చలు జరిపారు. ప్రధానంగా సీట్ల సర్దుబాటు, ఉమ్మడి మేనిఫెస్టో, ప్రచార కార్యాచరణపై చర్చలు సాగాయి. రాత్రి 9.30 గంటలకు మరోసారి పవన్ ఉండవల్లికి వచ్చి చంద్రబాబుతో మంతనాలు జరిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానాన్ని తీసుకుని.. అక్కడ అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది.. ఎవరికి విజయావకాశాలు ఉన్నాయి.. తమ తమ సర్వేల నివేదికల ఆధారంగా చర్చలు జరిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జనసేనాని 32 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలు ఇవ్వాలని కోరారు. ఇందులో 20 స్థానాలిచ్చేందుకు చంద్రబాబు అంగీకరించారని.. వాటిపై ఏకాభిప్రాయం కూడా కుదిరిందని జనసేన వర్గాలు తెలిపాయి. టీడీపీ మరో ఐదు స్థానాలు ఇచ్చే అవకాశం ఉందని, 27 ఇవ్వాలని పవన్ కోరుతున్నారని అంటున్నాయి. అలాగే కాకినాడ, మచిలీపట్నం ఎంపీ సీట్లను ఇప్పటికే జనసేనకు ఇచ్చారు. తాజాగా అనకాపల్లి గానీ, తిరుపతి గానీ ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలిసింది. రెండు పార్టీల శిబిరాల నుంచి 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం ప్రకారం.. ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖపట్నం జిల్లాలో సీట్ల సర్దుబాటే ఈ పార్టీలకు కష్టతరంగా ఉన్నట్లు సమాచారం. జనసేనకు ఎక్కువ మంది నాయకులు అక్కడే ఉన్నారు. అక్కడే ఆ పార్టీ ఎక్కువ సీట్లు కోరుతోంది. టీడీపీకి కూడా బలమైన నాయకత్వం ఆ జిల్లాల్లోనే ఉంది. దీంతో రెండు పార్టీల్లో ఎక్కడ ఎవరికి మంచి అభ్యర్థి ఉన్నారు.. ఎవరికి విజయావకాశాలు ఉన్నాయో బేరీజు వేసుకుని.. తదనుగుణంగా ముందుకెళ్లాలని అధినేతలిద్దరూ నిర్ణయించారు. అదే సమయంలో సామాజిక సమీకరణలు, వైసీపీ అభ్యర్థులు, సర్వేల్లో వస్తున్న ఫలితాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాల్లో జనసేన అడిగిన స్థానాల్లో విజయనగరంలో 1, విశాఖ-6, తూర్పుగోదావరి-6, పశ్చిమ గోదావరి-4, కృష్ణా-3, గుంటూరు-2, ప్రకాశం-2, నెల్లూరు-2, కడప-1, చిత్తూరు-2, కర్నూలు-1, అనంతపురంలో 2 ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో రాజానగరం, రాజోలు, కాకినాడ రూరల్, యలమంచిలి, భీమవరం, నరసాపురం, పోలవరం, విజయవాడ (పశ్చిమ), తెనాలి, దర్శి సహా 20 స్థానాలపై ఏకాభిప్రాయం కుదిరిందని చెబుతున్నారు.

జనసేనకు ఇచ్చే సీట్లలో కొన్ని..

నియోజకవర్గం	జిల్లా
యలమంచిలి	అనకాపల్లి
రాజోలు	డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ
రాజానగరం	తూర్పు గోదావరి
భీమవరం	పశ్చిమ గోదావరి
నరసాపురం	పశ్చిమ గోదావరి
పోలవరం	ఏలూరు
విజయవాడ పశ్చిమ	ఎన్టీఆర్
తెనాలి	గుంటూరు
దర్శి	ప్రకాశం
కాకినాడ రూరల్	కాకినాడ

ఒకే చోట కాకుండా..

జనసేనకు కేటాయించే సీట్లన్నీ ఒకేచోట ఉండకుండా వివిధ ప్రాంతాల్లో ఉండేలా సర్దుబాటు చేసే ప్రయత్నం కూడా జరుగుతోంది. ఉదాహరణకు.. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో జనసేన కోరుతున్న సీట్లన్నీ భీమవరం డెల్టా ప్రాంతం చుట్టుపక్కలే ఉన్నాయి. అందువల్ల అక్కడ తగ్గించి మెట్ట ప్రాంతంలోని గిరిజన నియోజకవర్గం పోలవరం ఇవ్వాలని అనుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూడా ఇలాంటి సర్దుబాటే జరుగుతున్నట్లు తెలిసింది. కాకినాడ రూరల్ సీటు జనసేనకు ఇచ్చి.. కాకినాడ అర్బన్ సీటులో తాను పోటీ చేయాలని టీడీపీ నిర్ణయించింది. కొన్ని చోట్ల ఒకే నియోజకవర్గంలో రెండు పార్టీలకు గట్టి అభ్యర్థులు ఉన్నచోట సమస్య వస్తోంది. ఉదాహరణకు విజయనగరం జిల్లా నెల్లిమర్లలో టీడీపీ ఇన్‌చార్జిగా బంగార్రాజు ఉన్నారు. ఆయన నాలుగేళ్లుగా అక్కడ చురుగ్గా పనిచేస్తున్నారు. జనసేనలో అదే నియోజకవర్గంలో లోకం మాధవి అనే మహిళా నేత ఉన్నారు. ఆమెకు అవకాశం కల్పించాలని జనసేన ఆసక్తిగా ఉంది. కానీ బంగార్రాజుకు విజయావకాశాలు బాగా ఉన్నాయని టీడీపీ నాయకత్వం భావిస్తోంది. ఆ జిల్లాలో నెల్లిమర్లకు బదులు జనసేనకు గజపతినగరం ఇస్తామని ప్రతిపాదించినట్లు సమాచారం.

గట్టి అభ్యర్థి ఉంటే తిరుపతి జనసేనకే!

రాయలసీమ జిల్లాల్లో జనసేన ఆశిస్తున్న వాటిలో తిరుపతి, మదనపల్లె, రాజంపేట, అనంతపురం వంటివి ఉన్నాయి. జనసేనకు గట్టి అభ్యర్థి ఉంటే తిరుపతి సీటు ఆ పార్టీకి ఇవ్వడానికి టీడీపీ సుముఖంగా ఉన్నట్లు చెబుతున్నారు. కానీ జనసేన తరఫున ప్రతిపాదనలో ఉన్న నేతలకు సర్వేల్లో మొగ్గు రాకపోవడంతో ఆ సీటు విషయం ఇంకా తేలలేదు. విశాఖ నగరంలో తమ పార్టీలోకి కొత్తగా వచ్చిన ఒక నేతను దృష్టిలో ఉంచుకుని ఒక సీటును జనసేన నాయకత్వం కోరుతోంది. ఏ సీటు ఇవ్వవచ్చో అంతర్గతంగా టీడీపీ కసరత్తు చేస్తోంది. జనసేనకు ఏదైనా సీటు ఇస్తే అక్కడ టీడీపీకి ఇన్‌చార్జిగా ఉన్న నేతను మరో స్థానంలో సర్దుబాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం, తూర్పుగోదావరి నిడదవోలు, కృష్ణా జిల్లా పెడన కూడా చర్చల్లో నలుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఎవరూ లేకుండా ఏకాంత చర్చలు..

ఆదివారం రాత్రి రెండో దఫా భేటీ అయిన బాబు, పవన్ అర్ధరాత్రి వరకు చర్చలు కొనసాగించారు. సోమవారం నుంచి చంద్రబాబు జిల్లాల పర్యటనకు వెళ్తుండడంతో వీలైనన్ని ఎక్కువ సీట్లపై ఆదివారమే స్పష్టత తేవాలన్నది వారి ప్రయత్నంగా చెబుతున్నారు. త్వరగా స్పష్టత వస్తే ఎవరికి వారు తమ పార్టీల్లో నేతలతో చర్చలు, సంప్రదింపులు, బుజ్జగింపులు పూర్తి చేసుకోవచ్చన్నది వారి ఆలోచనగా తెలుస్తోంది. చర్చల సరళిపై చంద్రబాబు, పవన్ ఎవరి వద్దా పెదవి విప్పడం లేదు. పూర్తిగా వారిద్దరే ఏకాంతంగా మాట్లాడుకుంటున్నారు. ఈ నెల 8న మరోసారి సమావేశమవుతారు. ఈ భేటీ తర్వాత రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఉమ్మడి మేనిఫెస్టో, ఉమ్మడి బహిరంగ సభల నిర్వహణపై స్పష్టత వస్తుందని ఆ పార్టీల వర్గాలు తెలిపాయి. మరోవైపు.. ఈ నెల 14న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రెండు పార్టీల ఉమ్మడి బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. అందులో చంద్రబాబు, పవన్ ఇద్దరూ పాల్గొంటారు. ఉమ్మడి మేనిఫెస్టోను ఆ సందర్భంగా విడుదల చేయాలని నిశ్చయించారు. అదే సభలో పొత్తు కుదిరిన సీట్ల వివరాలు కూడా ప్రకటిస్తారా.. లేక మరో సందర్భం ఎంచుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. కలిసి ఒకరోజు పాదయాత్ర చేస్తే ఎలా ఉంటుందన్నదానిపైనా చర్చించుకున్నారు. అపోహలకు తావు లేకుండా పరస్పరం సహకరించుకోవాలని, ఎవరి పార్టీ నేతలకు వారు పరిస్థితిని వివరించి.. కలిసి పనిచేసే వాతావరణం నెలకొల్పాలని ఉభయులూ అనుకున్నారు.



పవన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న బాబు

టీడీపీ నేతలకు ముందే చెప్పి..

ఏదైనా సీటు జనసేనకు ఇస్తున్నప్పుడు ఆ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలను ముందుగా పిలిపించి పరిస్థితిని వివరించి వారి ఆమోదం తీసుకోవాలని టీడీపీ నాయకత్వం యోచిస్తోంది. ఈ వారంలోనే ఈ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

నెల్లూరు సిటీకి నారాయణే!

- కోటంరెడ్డికి రూరల్.. ఆత్మకూరులో ఆనం
- సింహపురి జిల్లాలో ఏడు సీట్లలో టీడీపీ అభ్యర్థులు ఖరారు
- మిగతా 3 సీట్లపై కొనసాగుతున్న కసరత్తు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మెజారిటీ సీట్లలో టీడీపీ అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. మొత్తం పది సీట్లు ఉండగా ఏడు సీట్లలో అభ్యర్థులను ఖరారు చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. మరో మూడు సీట్లపై కసరత్తు నడుస్తోంది. జిల్లా కేంద్రం నెల్లూరు సిటీ స్థానంలో టీడీపీ అభ్యర్థిగా నారాయణ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి పొంగూరు నారాయణే మళ్లీ పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో ఆయన ఇక్కడ స్వల్ప తేడాతో ఓడిపోయారు. నెల్లూరు రూరల్‌లో సిటింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పోటీ చేయనున్నారు. వైసీపీ నుంచి అదే నియోజకవర్గంలో గెలిచిన ఆయన ఆ పార్టీ నాయకత్వంతో విభేదించి టీడీపీలోకి వచ్చిన సంగతి తెలిసిందే. వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణకే తిరిగి టికెట్ ఇవ్వనున్నారు. ఈ సీటు కావాలని ఇక్కడ సిటింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరుతున్నా.. ముందు అనుకున్న ప్రకారం ఆయన్ను ఆత్మకూరులోనే నిలపాలని నాయకత్వం నిర్ణయించింది. అక్కడ ఆయనకు విజయావకాశాలు బాగా ఉంటాయని టీడీపీ నాయకత్వం భావిస్తోంది. మరో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తిరిగి సర్వేపల్లిలో నిలుపనున్నారు. ఒక దశలో ఆయన కోడలు శ్రుతి పేరు కూడా పరిశీలనకు వచ్చినా తర్వాత వెనక్కి వెళ్లింది. గూడూరులో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను తిరిగి నిలుపుతున్నారు. కావలిలో కావ్య కృష్ణారెడ్డి పేరును టీడీపీ ఇటీవల ఖరారు చేసింది. ఉదయగిరి, కోవూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలపై ఇంకా కసరత్తు కొనసాగుతోంది. ఉదయగిరిలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, పారిశ్రామికవేత్త కాకర్ల సురేశ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కోవూరుకు ఇన్‌చార్జిగా పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి ఉన్నారు. ఇదే సీటును డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సుమంత్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదు. సూళ్లూరుపేటకు పోటీ అధికంగా ఉంది. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త కృష్ణయ్య, మాజీ మంత్రి పరసా రత్నం, డాక్టర్ సందీప్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతిబాబు రేసులో ఉన్నారు. ఎవరు మెరుగైన అభ్యర్థి అవుతారన్నదానిపై టీడీపీ నాయకత్వం క్షేత్ర స్థాయి పరిశీలన చేయిస్తోంది.

నెల్లూరు జిల్లాలో టీడీపీ ఖరారు చేసిన అభ్యర్థులు..

నియోజకవర్గం	అభ్యర్థి
నెల్లూరు	పొంగూరు నారాయణ
నెల్లూరు రూరల్	కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి
ఆత్మకూరు	ఆనం రామనారాయణరెడ్డి
సర్వేపల్లి	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
వెంకటగిరి	కురుగుండ్ల రామకృష్ణ
గూడూరు	పాశం సునీల్‌కుమార్
కావలి	కావ్య కృష్ణారెడ్డి

వైసీపీ అభ్యర్థి తేలాక..

నెల్లూరు లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. వైసీపీ అభ్యర్థి ఎవరో తెలిశాక నిర్ణయం తీసుకునే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ కంపెనీ అధినేత పేరు పరిశీలనలో ఉంది.

మాటలు చెప్పండి.. మాయలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

వలంటీర్లకు, ఎఫ్ఏవో ప్రతినిధులకూ ప్రభుత్వ ధనాన్నే జీతాలుగా చెల్లిస్తున్నారు. కానీ.. వారు పని చేసేది మాత్రం అచ్చంగా వైసీపీ కోసం! వలంటీర్లపై పర్యవేక్షణకే ఎఫ్ఏవోఏను నియమించారు. ఇప్పుడు... సచివాలయాల్లోనే మీటింగ్‌లు పెట్టి వలంటీర్లకు మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నారు. 'తమ వారు'కారనే చిన్న అనుమానం ఉన్నా, నిష్పాక్షికంగా వ్యవహరిస్తారని భావించినా... ఆ వలంటీర్లను ముందే గుర్తించి బయటికి పంపిస్తున్నారు. ఆ తర్వాత మిగిలిన వాళ్లకు 'కర్తవ్య బోధ' చేస్తున్నారు. తమ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి తమ ఆదేశాల మేరకు ప్రచారం చేయాలని స్పష్టం చేస్తున్నారు.

పొలిటికల్ ఫాంటసీ చిత్రం...

జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో అభివృద్ధిని అటకెక్కించారు. అమరావతి లేదు. పోలవరం పూర్తి కాదు. పెట్టుబడులు రావు. పరిశ్రమలు లేవు. రోడ్లు వేయలేదు. ఇళ్లు కట్టలేదు. కట్టిన టిడ్కో ఇళ్లూ ఇవ్వలేదు. ఎప్పటి నుంచో అమలులో ఉన్న పథకాల పేరు, అమలు తీరు మార్చి బటన్ నొక్కడమే జగన్ చేస్తున్నది. ఈ సభలలో కూడా బటన్ నొక్కుడుపై గొప్పలు, విపక్షాలపై విమర్శలు తప్ప అంతకుమించి చేసిందేమిటో జగన్ చెప్పుకోలేకపోతున్నారు. అయినా సరే.. వచ్చే ఐదేళ్లలో అద్భుతాలు సృష్టిస్తారని, ఆదాయం పెంచేస్తారని, అడ్డగోలుగా చేసిన అప్పులు కూడా తీర్చేస్తారని, పథకాలు బ్రహ్మాండంగా అమలు చేస్తారంటూ ప్రజలకు 'పొలిటికల్ ఫాంటసీ సినిమా' చూపించాలని వలంటీర్లను ఆదేశిస్తున్నారు.

వలంటీర్లపైనా వల...

'ప్రజలను మాయ చేయండి' అని చెబుతున్న ఎఫ్ఏవో ప్రతినిధులు... వలంటీర్లపైనా వల వేస్తున్నారు. 'మీరు ఫుల్‌టైమ్ వైసీపీ కోసమే పని చేయండి. ఎన్నికల తర్వాత మీ పరిస్థితి మారిపోతుంది. ఈ విషయాన్ని జగన్ మీకు రహస్యంగా చెప్పమన్నారు' అని అంతర్గత సమావేశాల్లో చెబుతున్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం వలంటీర్ల అవసరమన్నట్లుగా నూరిపోస్తున్నారు. ఇప్పటి నుంచే ఓట్లకు గేలం వేసే పనిలో ఉండాలని, అందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి అందుతుందని పేర్కొంటున్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని వలంటీర్లు చెప్పినప్పుడు... అన్నీ జగనన్న చూసుకుంటారని ఎఫ్ఏవో ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇక మండల స్థాయి అధికారులు (ఎంఎల్‌వో) నుంచి వలంటీర్లకు ప్రత్యేక సందేశాలు కూడా వెళ్తున్నాయి. సేవారత్న అవార్డు కింద ప్రతి వలంటీర్‌కు రూ.20 వేల నగదు ఇస్తామని, ఎన్నికల తర్వాత జీతాన్ని రూ.10 వేలకు పెంచుతామని ఆశ పెడుతున్నారు.

రెండు నెలలు జగన్ సేవలోనే...

పింఛన్ పంపిణీని మినహాయిస్తే... వలంటీర్లు చేస్తున్న ప్రతి పనీ జగన్ రాజకీయాలతోనే ముడిపడి ఉంది. ఇక.. ఫిబ్రవరి 1వ తేదీ పింఛను పంపిణీ తర్వాత పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా అవతరించాలని ఎంఎల్‌వోలు వలంటీర్లకు స్పష్టం చేస్తున్నారు. దీనిపై వారందరికీ వాట్సాప్ సందేశాలు పంపిస్తున్నారు. "ఫిబ్రవరి నుంచి పింఛన్ పంపిణీ తప్ప ఇతర పనులు ఉండవు. ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సేవలు అందించాలి. వలంటీర్లందరూ యాక్టివ్‌గా ఉండాలి. లేకుంటే విధుల నుంచి తొలగిస్తాం" అని బెదిరిస్తున్నారు. త్వరగా కులగణన పూర్తి చేస్తే... వలంటీర్లకు శిక్షణ ఉంటుందని చెబుతున్నారు. ఇక... 'సేవా రత్న' పేరుతూ అందరికీ పారితోషికం ఇస్తామని వల వేస్తున్నారు.

రోడ్డుకు అడ్డంగా గోడ కట్టి టీడీపీ నిరసన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను వెంటనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా, టీడీపీ, జనసైనికులు ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామం నుంచి సత్యప్రభ 4కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి రమణయ్యపేట గ్రామం వద్ద శిథిల రహదారికి అడ్డంగా గోడ కట్టి వందలాది మంది అనుచరులతో నిరసన చేపట్టారు. ఆందోళనలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

షర్మిలకు వైరల్ జ్వరం.. నేడు, రేపు పర్యటనలు రద్దు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర చలి, జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్నారు. వైరల్ ఫీవర్ కారణంగా సోమ, మంగళవారాల్లో జరగాల్సిన రచ్చబండ, బహిరంగ సభలు నిలుపుదల చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 7న ఉదయం పదిగంటలకు దర్శిలో రచ్చబండ, సాయంత్రం 5 గంటలకు బాపట్లలో బహిరంగ సభ జరుగుతాయి.

మోదీ అంటే భయమా జగన్: మాణిక్కం ఠాగూర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): "జగన్.. నీకు ప్రధాని మోదీ అంటే భయమా?" అని ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్కం ఠాకూర్ నిలదీశారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా మాట్లాడరా? బిహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల కంటే ఏపీకి కేంద్ర పన్నుల్లో చాలా తక్కువ వాటా ఇస్తున్నప్పటికీ ప్రశ్నించలేరా అని ఎక్స్(ట్విట్టర్) వేదికగా నిలదీశారు.

షర్మిలను తిడితే.. విజయమ్మను తిట్టినట్లే: తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 4: వైసీపీ ఉన్మాదులు వైఎస్ షర్మిలను తిట్టడమంటే పరోక్షంగా వైఎస్ విజయలక్ష్మిని తిట్టడమేనని, నీచాతినీచంగా ఆమెపై ఆరోపణలు చేస్తుంటే కొడుకుగా జగన్ ఏం చేస్తున్నాడని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి వేంపల్లెలో ప్రశ్నించారు.

సొంత చెల్లిపై నీచ ప్రచారం: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సొంత చెల్లి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై సోషల్ మీడియా వేదికగా పేటీఎం బ్యాచ్ నీచ ప్రచారం చేస్తోందని, దీనిని ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు.

అధర్మ భేటీ!

(మొదటి పేజీ తరువాయి)

బడా అధికారులకు కేసుల నుంచి విముక్తి కల్పించడంపై దృష్టి పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 17 మంది అధికారుల కేసులు రెవెన్యూ కోర్టు ద్వారా వినబోతున్నారు. కేసుల పరిశీలనకు శుక్రవారం నోటీసులు ఇచ్చారు. సోమవారం వినబోతున్నారు. ఇందుకు మంత్రి పేషీ అన్ని ఏర్పాట్లు చేసింది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుందన్న ప్రచారం జరుగుతుండగా మంత్రి ఆ శాఖలో అత్యంత కీలకమైన డిసిప్లినరీ కేసుల పరిష్కారం శరవేగంగా చేపట్టబోతున్నారు. ఇప్పుడు ఇదే అంశం రెవెన్యూ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌ఓ) నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు తప్పులు చేస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. డిప్యూటీ కలెక్టర్లను ఆర్‌డీఓ, డీఆర్‌ఓ, ఇతర ప్రాజెక్టు అధికారులుగా నియమిస్తుంటారు. ఆ సమయంలో వారిపై అభియోగాలు వస్తే విచారణ చేయించి శాఖాపరమైన చర్యలు తీసుకునే అధికారం సీసీఎల్ఏకు ఉంది. సస్పెన్షన్, సర్వీసు నుంచి తొలగింపు, పెన్షన్, ఇతర వేతన ప్రయోజనాల నిలుపుదల వంటివి ప్రభుత్వ స్థాయిలో తీసుకుంటారు. అధికారులపై చర్యలు తీసుకుంటూ సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ కార్యదర్శి జారీ చేసే క్రమశిక్షణా చర్యల ఆదేశాల అమలును నిలుపుదల చేయాలని రెవెన్యూ మంత్రి వద్ద అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా వచ్చే అప్పీళ్లను మంత్రి రెవెన్యూ కోర్టు ద్వారా విని ప్రభుత్వం విధించిన శిక్షలను యథావిధిగా అమలు చేయాలని సిఫారసు చేయడమో లేక వాటి తీవ్రతను తగ్గించడమో చేస్తారు. కొన్ని కేసుల్లో అసలు ఏ శిక్షలు అవసరం లేదని కూడా సిఫారసు చేసిన సందర్భాలున్నాయి. ఇది రెగ్యులర్‌గా జరిగే ప్రక్రియ. అయితే, ఇలాంటివన్నీ ఓ పద్ధతి ప్రకారం చేస్తారు. అప్పీళ్లను వినడం కోసం ఓ తేదీని ఖరారు చేశాక 15 రోజుల ముందే నోటీసులు ఇస్తుంటారు.

శరవేగంగా విచారణ

రాష్ట్రంలో అతి త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండటంతో ఈలోగా పెండింగ్ అప్పీళ్లను పరిష్కరించాలని మంత్రి భావించినట్లుగా ఉంది. ఇందుకోసం రెండో తేదీన (శుక్రవారం) 17 మంది అధికారులకు నోటీసులు ఇచ్చారు. ఆ వెంటనే సోమవారం కేసుల పరిశీలన, హియరింగ్ ఉంటుందని, ఆ రోజు అంతా హాజరు కావాలని రెవెన్యూ శాఖ అదనపు కార్యదర్శి వీరాంజనేయులు పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు. హాజరుకాని వారి పట్ల ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డుల ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటారని స్పష్టంగా చెప్పారు. అయితే ఈ నోటీసులు అందరికీ చేరడానికే కనీసం 72 గంటలు పడుతుంది. అలాంటిది ఆ వ్యవధిలోనే రెవెన్యూ కోర్టు నిర్వహించాలని నిర్ణయించడం పలు అనుమానాలకు తావిచ్చేలా ఉంది. కనీసం 10-15 రోజులు సమయం ఇవ్వకుండా 72 గంటల వ్యవధిలోనే నోటీసులు, కేసుల పరిష్కారం చేయాలనుకోవడం ఉన్నతాధికార వర్గాలను విస్మయపరుస్తోంది. సదుద్దేశంతోనే రెవెన్యూ కోర్టు నిర్వహించాలనుకుంటే కనీసం వారం లేదా పదిరోజుల గడువు ఇవ్వాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల లోపే కేసులు సెటిల్ చేసుకోవాలని అధికారుల తరఫున ఓ డిప్యూటీ కలెక్టర్ (ఇటీవలే పదోన్నతి పొందారు) రాయబారం నడిపారని తెలిసింది. గతంలో తప్పుచేసిన పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను సర్వీసు నుంచి తొలగిస్తూ, మరికొందరిని సస్పెండ్ చేస్తూ సీసీఎల్ఏ నిర్ణయాలు తీసుకున్నారు. ఆ డిప్యూటీ కలెక్టర్ రాయబారం నడిపి వారితో మంత్రి ధర్మాన వద్ద అప్పీళ్లు వేయించారు. వారు కోరుకున్నట్లుగానే సీసీఎల్ఏ నిర్ణయాలను సమీక్షించి కఠిన నిర్ణయాలను రద్దు చేసి సాధారణ క్రమశిక్షణా చర్యలకు ధర్మాన సిఫారసు చేయడం అప్పట్లోనే సంచలనమైంది. ఇప్పుడు ఏకంగా 17 మంది అధికారుల కేసులను మంత్రి ధర్మాన సమీక్షించబోతున్నారు.

అవన్నీ తీవ్ర కేసులే

ప్రభుత్వ, దేవదాయ, ప్రభుత్వ ఆసక్తి ఉన్న భూములను పరాధీనం చేయడం, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి పాస్‌బుక్‌లు ఇప్పించడం, భూమి రికార్డుల్లో సవరణలు, ఇంకా అనేక తీవ్రమైన తప్పిదాలకు పాల్పడ్డారని అభియోగాలు ఎదుర్కొంటున్న వారు, ఇప్పటికే ఆయా కేసుల్లో ప్రభుత్వం విధించిన క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొంటున్న అధికారులు మంత్రి ధర్మాన ప్రసాదరావు వద్ద అప్పీల్‌కు వెళ్లారు. ఈ కేసులన్నీ తీవ్రమైనవే. అందులో ఉమ్మడి ప్రకాశం జిల్లా దేవదాయ భూముల పరాధీనం కేసులో రివర్షన్ ఎదుర్కొంటున్న డిప్యూటీ కలెక్టర్‌లు కూడా ఉన్నారు. ప్రభుత్వం సిఫారసు చేసిన చర్యలను ఎత్తివేయాలని లేదా తగ్గించాలని కోరుతూ వచ్చిన అప్పీళ్లు ఇవి. ధర్మ విచారణలో మంత్రి ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నారు? ఆయన కరుణిస్తారా? లేక ప్రభుత్వ నిర్ణయాలకు కట్టుబడి ఉంటారా? అన్నది తేలనుంది.

అప్పీళ్లు వీరివే: అప్పీళ్లు చేసుకున్న 17 మంది అధికారుల్లో ఎం.ఎస్.మురళి (మదనపల్లె ఆర్‌డీఓ), కె.లలిత (జేడీ, మహిళా, శిశు సంక్షేమశాఖ), శ్రీదేవి (మాజీ వీఆర్‌ఓ), వి.అంకిరెడ్డి (మాజీ వీఆర్‌ఓ), డి.సుదర్శనం (యూఎల్‌సీ మాజీ స్పెషల్ ఆఫీసర్), కె.గోవిందరావు, నాగమణి (పోలవరం ప్రాజెక్టు), డి.తిప్పేనాయక్-డిప్యూటీ కలెక్టర్ (ధర్మవరం మాజీ ఆర్‌డీఓ), ఎన్.రమేశ్ (రాప్తాడు మాజీ తహసీల్దార్), పి.గ్లోరియా(డిప్యూటీ కలెక్టర్-తుళ్లూరు క్యాపిటల్ సిటీ), ఆర్.చిరంజీవిరావు (మండల సర్వేయర్), కుమార్, నరసింహం (కావలి మాజీ ఆర్‌డీఓ), జయదేవి (డిప్యూటీ కలెక్టర్), పి.శ్రీరామచంద్రమూర్తి (డిప్యూటీ కలెక్టర్), ఆదినారాయణ, పీవీఎస్ఆర్ కృష్ణమూర్తి ఉన్నారు.

కళ్లముందే కుప్పకూలింది!

- పేకమేడలా కూలిపోయిన మూడంతస్థుల భవనం
- 4 రోజుల క్రితం వరకూ అందులో లాడ్జి నిర్వహణ
- పక్కనే భవనం నిర్మాణానికి పునాదులతో ఒరుగుదల
- ముందు జాగ్రత్తగా లాడ్జిని ఖాళీచేసిన నిర్వాహకుడు



దోర్నాలలో కుప్పకూలిన మూడంతస్థుల భవనం

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 4: మూడంతస్థుల భవనం పేకమేడలా కుప్పకూలింది. ప్రకాశం జిల్లా దోర్నాలలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం సమీపంలో శ్రీశైలం రోడ్డులో జరిగిన ఈ ఘటనతో దాదాపు రూ.కోటి వరకూ నష్టం వాటిల్లినట్లు భవన యజమాని పరుచూరి సుబ్బారావు తెలిపారు. సుమారు 20ఏళ్ల క్రితం సుబ్బారావు మూడంతస్థుల భవనం నిర్మించి లాడ్జి నిర్వహణకు అద్దెకు ఇచ్చారు. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఆయన సోదరుడు పరుచూరి రామారావు నూతన భవన నిర్మాణం కోసం 20 రోజుల క్రితం పది అడుగుల లోతున పునాదులు తీయించారు. ప్రస్తుతం కుప్పకూలిన భవనానికి 5 అడుగుల వరకు మాత్రమే పునాదుల ఉన్నాయి. పైగా నూతన భవనం కోసం తీసిన పునాదుల్లోకి లాడ్జి నుంచి వ్యర్థపు నీరు వచ్చి చేరుతోంది. దీంతో మట్టిలో పటుత్వం తగ్గి పాత భవనం ఓ వైపునకు ఒరిగింది. ఆందోళన చెందిన లాడ్జి నిర్వాహకుడు నాలుగు రోజుల క్రితమే నిర్వహణ నిలిపి వేశారు. ప్రస్తుతం అందులో ఎవరూ ఉండటం లేదు. ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా ఈ భవనం కుప్పకూలింది.



'విజయవాడ డిక్లరేషన్'ను విడుదల చేస్తున్న సీఎఫ్‌డీ నేతలు

ఓటుపై చైతన్యం అవసరం

- లేదంటే మన ఆస్తుల్ని లాగేసుకుంటారు!
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల హెచ్చరిక

విజయవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఓటర్లలో చైతన్యం లేకపోతే మన ఆస్తులను లాగేసుకుంటారని, పాలకులు అలాంటి చట్టాల్నే రూపొందిస్తారని కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య హెచ్చరించారు. వీసాలతో అనేక నగరాలు తిరిగే యువతకు తమ ఓటు ఉందోలేదో తెలుసుకునేంత తీరిక ఉండట్లేదని ఆక్షేపించారు. 'ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' అనే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పద్మనాభయ్య మాట్లాడుతూ.. నగరాల్లో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పండగ వాతావరణం కనిపిస్తుంటే, నగరాలు, పట్టణాల్లోని ఓటర్లు మాత్రం ముసుగులు కప్పుకొని నిద్రపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి ఒక వలంటీర్ వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం మాజీ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జనాభాలో 65 శాతం ఓటర్ల జాబితాలో ఉంటే దొంగ ఓటర్లు ఉన్నట్టేనన్నారు. దేశంలో అత్యధిక శాతం ఓటింగ్ నమోదవుతున్న రాష్ట్రాల్లో పశ్చిమబెంగాల్ మొదటిస్థానంలో, ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో ఉన్నాయని చెప్పారు. మన రాష్ట్రంలో ఓటింగ్ 79 శాతం నమోదవుతున్నా.. ఇది ఇంకా మెరుగుపరడాలన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ నగర, పట్టణ ఓటర్లలో నిర్లిప్తత ఎక్కువగా కనిపిస్తోందని, వారిలో చైతన్యం తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. అనంతరం 'ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' పేరుతో విజయవాడ డిక్లరేషన్‌ను రూపొందించారు. దీన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఆమోదించింది. సమావేశంలో రోటరీ ఇంటరాక్ట్ డైరెక్టర్ పట్టాభి రామయ్య, మాజీ ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్, రాష్ట్ర గ్రంథాలయాల సంఘ కార్యదర్శి రావి శారద తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం వలంటీర్లకు కుక్కర్లు

- వెలంపల్లి 'విందు' రాజకీయం.. ఎన్నికల్లో గెలిపించాలంటూ కానుక



వెలంపల్లి పంచిన కుక్కర్లతో వలంటీర్లు

విజయవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం వలంటీర్లను వాడుకునేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు వలంటీర్లకు ప్రత్యేకంగా విందు సమావేశం ఏర్పాటు చేసి, అందరికీ కుక్కర్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం అందరూ సహకరించాలని అసలు విషయం చెప్పారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే అయిన ఆయన్ను సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పంపిన సంగతి తెలిసిందే. ప్రస్తుత సెంట్రల్ సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అనుచరగణం నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. ఆదివారం 61, 62, 63, 64 డివిజన్ల వలంటీర్లతో నగరంలో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లింది వలంటీర్లేనని అన్నారు. తన గెలుపు కోసం ప్రతి వలంటీర్ సహకరించాలని కోరారు. వలంటీర్లందరికీ విందు భోజనం ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరికీ కుక్కర్‌ను బహుమతిగా ఇచ్చి పంపారు.

ఈ వేసవి భగభగ!

- తీవ్ర వడగాలులు, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే చాన్స్

విశాఖపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవిలో తొలుత మోస్తరు వేడి, ఆ తరువాత క్రమేపీ తీవ్రమైన ఎండలతో వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పలు మోడళ్లను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాకు వచ్చారు. గతేడాది కంటే మరింత తీవ్రమైన వేసవి చూడబోతున్నామని ఒక నిపుణుడు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో తీవ్రంగా ఉన్నందున దాని ప్రభావంతో వేసవి హాట్‌గా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ తరువాత ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడే క్రమంలో పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా వాతావరణ పరిస్థితులు ఏర్పడి సెప్టెంబరు నాటికి లానినా పరిస్థితులు నెలకొంటాయని విశ్లేషించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్‌నాటికి తటస్థ పరిస్థితులు నెలకొనేందుకు 73 శాతం అవకాశం ఉందని నాలుగు రోజుల క్రితమే భారత వాతావరణశాఖ(ఐఎండీ) తెలిపింది. ఈ ఏడాది ప్రారంభంనాటికి మరింత బలపడిన ఎల్‌నినో.. మే, జూన్ నుంచి బలహీనపడి తొలుత తటస్థంగా తరువాత లానినా దశకు చేరుకుంటుందని, ఈ క్రమంలో ఈ ఏడాది చివరికల్లా బలమైన లానినాగా మారుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. సెప్టెంబరునాటికి లానినా ఏర్పడనున్నందున నైరుతిలో మంచి వర్షాలు కురుస్తాయని విశ్లేషించింది. కాగా, ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని, అయితే, వచ్చే నైరుతి సీజన్‌లో వర్షాలపై ఇప్పుడే పూర్తిగా చెప్పలేమని ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్ రాజీవన్ వివరించారు. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో 60 శాతం లానినా పరిస్థితులు ఏర్పడతాయని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్(నోవా) అంచనా వేసింది. భారత దేశ వాతావరణంపై ఎల్‌నినో ఎక్కువ ప్రభావం చూపుతుందని, రానున్న వేసవి వేడిగా ఉంటుందని, నైరుతి రుతుపవనాలు బలహీనంగా కొనసాగుతాయని, అయితే సీజన్ చివరినాటికి మంచి వర్షాలు కురవడంతోపాటు వచ్చే శీతాకాలంలో తీవ్రమైన చలి ఉంటుందని విశ్లేషించింది. ఈ ఏడాది వేసవిలో వేడి ప్రభావం పెరగడంతో వాతావరణంలో అనూహ్య మార్పులు వస్తాయని నోవా తెలిపింది. అయితే రానున్న సీజన్‌లో ఎండలపై వచ్చే నెలలో పూర్తిస్థాయిలో అంచనా నివేదిక విడుదల చేస్తామని వాతావరణ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రెండు నెలల తరువాత ఎల్‌నినో తీవ్రత తగ్గి తటస్థ పరిస్థితులు నెలకొంటాయని వివరించారు.

'అర్జునుడు' తన ఆడపడుచుల్ని రక్షించాడే కానీ.. ఎప్పుడూ తూలనాడలేదు. జగన్ తనను తాను అర్జునుడిగా పోల్చుకోవడం ఆశ్చర్యంగా ఉంది. సొంత చెల్లి షర్మిలను అత్యంత నీచంగా మాట్లాడుతుంటే ప్రోత్సహించే వ్యక్తి.. తోబుట్టువుకి గౌరవం ఇవ్వని వ్యక్తి.. సొంత చిన్నాన్నను నిర్దాక్షిణ్యంగా చంపేసిన వాళ్లను వెనకేసుకొచ్చే వ్యక్తి.. అర్జునుడితో పోల్చుకుంటున్నాడు.

ఎవరు కౌరవులు, ఎవరు అర్జునుడని.. నేను మాట్లాడను. ఇది కలియుగం. మనమెవరం అర్జునుడు, కృష్ణుడు, కౌరవులతో పోల్చుకోవద్దు. మీరు జగన్. మీది వైసీపీ. నేను పవన్. నాది జనసేన. ఎవరు మంచివాళ్లు, ఎవరు ప్రజలకు అండగా ఉండేవాళ్లు, ఎవరు దోపిడీదారులనేది ప్రజలకు బాగా తెలుసు. వారే నిర్ణయిస్తారు. - పవన్ కల్యాణ్

చెల్లికే గౌరవం ఇవ్వని జగన్.. అర్జునుడా?

- నేను పవర్ స్టార్ కాదు.. ప్రజా కూలీ
- దుర్మార్గపు పాలన అంతమే లక్ష్యం: పవన్



ఎంపీ బాలశౌరికి కండువా కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్

పారిపోవడానికి 'సిద్ధ'మా?: బాలశౌరి

సీఎం జగన్ ఎక్కడ మాట్లాడినా తాను అబద్ధాలు చెప్పనని చెబుతారని, కానీ, అలా చెప్పడమే జగన్ చెప్పే పెద్ద అబద్ధమని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆదివారం పవన్ సమక్షంలో జనసేనలో చేరాక ఆయన మాట్లాడారు. "మాట్లాడితే పైన దేవుడు ఉన్నాడు అంటారు. నాకు, షర్మిల, సునీతకు కూడా అదే దేవుడు ఉన్నాడని జగన్ గుర్తుంచుకోవాలి. సిద్ధం, సిద్ధం అంటూ రాష్ట్రం మొత్తం పోస్టర్లు వేశారు. జగన్ పారిపోవడానికి సిద్ధంగా ఉన్నారా?" అని వ్యాఖ్యానించారు.

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): "తోడబుట్టిన సొంత చెల్లెలు వైఎస్ షర్మిలకే గౌరవం ఇవ్వలేని వాడు అర్జునుడు ఎలా అవుతాడు?" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ సీఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. చెల్లెలు షర్మిలను కొందరు నీచంగా తిడుతుంటే.. అన్నగా వారిని అడ్డుకోవాల్సింది పోయి, ఆయనే స్వయంగా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి మన ఇంట్లో ఆడపడుచులకు గౌరవం ఇస్తాడా? అని ప్రశ్నించారు. "జగన్ బాధ వర్ణనాతీతం. ఆయన్ని అందరూ ఇబ్బంది పెట్టేస్తున్నట్టు, ఆయన ఒక అర్జునుడిలాగా.. మేమంతా కౌరవుల్లాగ మాట్లాడుతున్నారు. ప్రజలే గాండీవం.. ప్రజలే ఆయుధాలు. ప్రజలే శ్రీకృష్ణుడని మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా ఉంది" అని పవన్ ఎద్దేవా చేశారు. ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమక్షంలో వైసీపీ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆయన తనయుడు పార్టీలో చేరారు. పవన్ మాట్లాడుతూ.. జనసేనలో చేరిన వల్లభనేని బాలశౌరిని, ఆయన తనయుడు అనుదీప్‌ను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామన్నారు. బాలశౌరి జనసేన తరఫున మరోసారి పార్లమెంట్‌లో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌పై విరుచుకుపడ్డారు. వివేకానందరెడ్డి కుమార్తె సునీత తనకు రక్షణ లేదు, చంపేస్తామని ఫోన్లు వస్తున్నాయని చెబుతున్నారంటే జగన్ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

జగన్ అబద్ధాలకు అంతులేదు

జగన్ మాట్లాడితే 'సిద్ధం' అంటున్నారు. రాష్ట్రమంతా పోస్టర్లు వేస్తున్నారు. దేనికి సిద్ధం? నేను అబద్ధమే చెప్పనన్న జగన్ చెప్పేదే అబద్ధాలని బాలశౌరి అన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామన్నారు. పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. మద్య నిషేధం చేస్తామన్నారు. అవన్నీ మరిచిపోయారు. చెప్పుకొంటూ పోతే అబద్ధాల లిస్ట్‌కి అంతులేదు. జగన్ గారూ.. మీరు బాధపడకండి మేం వస్తున్నాం. ఎన్నికల రంగంలోకి అడుగు పెడుతున్నాం. మేం మౌనంగా ఉన్నామనుకుని, ఏమీ ఆలోచించడం లేదని అనుకోవద్దు. ప్రతి రోజూ ఒక సభ పెడతాం. మిమ్మల్ని ఎండగడతాం. మాటకు మాట కాదు.. మాటలతో ఏకేస్తాం. మాటలు కత్తుల్లా వస్తాయి. కాచుకోండి. లక్షల మందితో సభలు పెట్టుకోండి. పిల్లలకు ఇంటర్ మీడియట్ పరీక్షలు రద్దుచేసి మరీ మీరు సభలు నడుపుకోండి. అన్నింటికీ బదులు చెల్లించాల్సిన సమయం వస్తుంది. జనసేన ఏడు సూత్రాల భావంతో కట్టుబడి ఉంది. ఏడు సూత్రాల దండకి మణిహారమైన బాలశౌరి వచ్చి చేరారు. మనందరం కలిసి రాష్ట్ర ప్రయోజనాలు, భవిష్యత్తు కోసం పనిచేద్దాం. నేను ఎప్పుడూ ఎన్నికల గురించి మాట్లాడను. భవిష్యత్ తరాల కోసం ఆలోచిస్తాను.

పొత్తుల్లో కష్టం ఉంటుంది!

2024లో జనసేన-టీడీపీ ప్రభుత్వం స్థాపిస్తాం. కష్టమే అయినా పోరాటం చేయాలి. విజయం తేలికేం కాదు. జగన్‌ఎన్ని మోసాలు చేసినా, మాయలు చేసినా వాటన్నింటినీ అధిగమించి మనం ప్రభుత్వాన్ని స్థాపించాలి. పొత్తుల్లో కొంత కష్టం ఉంటుంది. ఏదేమైనా అసెంబ్లీలో జనసేన చాలా బలమైన ముద్ర వేస్తుంది. దీనిలో బాగంగానే ప్రతి సీటు గెలిచే సీటవ్వాలి. జగన్ అనే దుర్మార్గపు పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోకపోతే భవిష్యత్తును మనం ఊహించలేం. ఎలాంటి నాయకులు వచ్చినా జనసేన తరఫున మద్దతుగా నిలవండి. నాయకులు పడ్డ ప్రతి కష్టానికీ గుర్తుపు వచ్చేలా అందరినీ దృష్టిలో పెట్టుకుంటాం.

ఇంత దిగజారుడా!

సొంత చెల్లికి గౌరవం ఇవ్వలేని వాడు, మన ఇంట్లో ఆడపడుచులకు ఇస్తాడని నేను అనుకోను. ఇంత వ్యక్తిగతంగా దిగజారి విమర్శలు చేయడం కరెక్టు కాదు. ఇంత దిగజారుడు రాజకీయం ఒక్క వైసీపీలో తప్ప దేశంలో ఎక్కడా లేదు. మాట్లాడితే మీరు.. పవర్ స్టార్, పవర్ స్టార్ అంటున్నారు. పవర్‌లో లేనిదానికి పవర్ స్టార్ ఎందుకు? నేను సినిమాల్లోనే ఆ పదం ఎప్పుడూ వాడను. నన్ను ప్రజల మనిషి అంటేనే ఇష్టం. అదే నాకు పెద్ద బిరుదు. పవర్ స్టార్ అనే కంటే ప్రజల కోసం పనిచేసే కూలీ అంటే ఎక్కువ సంతోషిస్తా. నాకు ఆశలు లేవు. ప్రజల కోసం నిలబడాలన్నఆకాంక్ష తప్ప.



'ఓపీఎస్ హామీ సమాధి' పేరుతో శవపేటికను తయారు చేసి నివాళులు అర్పిస్తున్న సీపీఎస్‌ఈఏ నేతలు

ఓపీఎస్ అమలుచేసే వారికే మద్దతు

- మోసం చేసిన పార్టీని గద్దె దించేందుకు సిద్ధం
- 'సాగర సంగ్రామ దీక్ష'లో సీపీఎస్‌ఈఏ నేతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేసే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతిస్తామని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ సీపీఎస్‌ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్ స్పష్టం చేశారు. ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలోని జీవీఎంసీ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం వద్ద 'సాగర సంగ్రామ దీక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ.. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ఐదేళ్ల క్రితం పాదయాత్ర, ఎన్నికల ప్రచారం సందర్భంగా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి 118 చోట్ల హామీ ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 'తెలియక హామీ ఇచ్చాం' అని మాటమార్చారని, ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఏపీ సీపీఎస్‌ఈఏ ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల మరియదాస్ మాట్లాడుతూ.. సీపీఎస్‌తో పాటు పలు అంశాల్లో మోసం చేసిన ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. 'సీపీఎస్‌ను రద్దు చేస్తారా? గద్దె దిగుతారా?.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.. లేదా గద్దె దిగాలి" అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. 'పాత పెన్షన్ హామీ సమాధి' అంటూ శవపేటిక తయారుచేసి దానికి నివాళులర్పిస్తూ వినూత్న నిరసన తెలిపారు. సీపీఎస్ రద్దు చేస్తామని జగన్ ఇచ్చిన హామీని, మోసం చేసిన విధానాన్ని కట్టప్ప బాహుబలికి వెన్నుపోటు పొడిచినట్టుగా అభివర్ణిస్తూ ఫ్లెక్సీని ప్రదర్శించారు.

మిర్చి రైతుకు నష్టాల మంట

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మిర్చి రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. తెగుళ్ల తాకిడితో క్రిమిసంహారక మందులకు పెట్టుబడులు పెరిగి సతమతమౌతున్నారు. వర్షాభావం, తుఫాను, చీడపీడల దాడితో దిగుబడులు తగ్గినా, మార్కెట్‌లో ధరలు గిట్టుబాటు కావట్లేదని వాపోతున్నారు. ఏటా 4.85 లక్షల ఎకరాల్లో సాగయ్యే మిర్చిని 2023-24లో 5.47లక్షల ఎకరాల్లో వేశారు. నవంబరు వరకు తీవ్ర వర్షాభావం, డిసెంబరులో మిచౌంగ్ తుఫాను కారణంగా చాలావరకు పంట దెబ్బతిన్నది. నల్లతామర, బొబ్బర తదితర తెగుళ్ల ఆశించడంతో రైతులకు పెట్టుబడులు పెరిగాయి. క్రిమిసంహారక మందులకే రూ.30వేలపైగా ఖర్చు చేయాల్సి వచ్చింది. కోత, కళ్లం కూలీ ఖర్చు ఎకరానికి రూ.15వేలు దాకా అవుతోంది. నీటి తడుల కోసం ఇంజన్లు, ట్యాంకర్లకు రూ.10వేల దాకా వెచ్చించాల్సి వచ్చింది. సాధారణంగా ఎకరానికి 50క్వింటాళ్ల వరకు అయ్యే విర్చి, ఇప్పుడు 30క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి నెలకొంది. వచ్చిన దిగుబడిలో సగం నాశిగానే ఉంటోంది. మార్కెట్‌లో తగిన ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. గుంటూరు, ఆదోని వంటి మార్కెట్లలో తేజ, బాడిగి, కడ్డీబాడిగి రకం మిర్చి క్వింటా రూ.20-22వేల దాకా ఉంటున్నా, డెలెక్స్ లల్లీ, సింగింట, డీడీ, సూపర్-10, 5531, తాలు రకాల మిర్చికి రూ.12-14వేలు మధ్య వస్తోంది. ఎకరానికి రూ.లక్షన్నరపైగా పెట్టుబడి పెట్టినా.. నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గత నాలుగేళ్లలోనూ మిర్చి సాగు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాలేదు. 2019, 2020లో అధిక వర్షాలు, అకాల వర్షాలతో రైతులు నష్టపోయారు. 2021, 2022లో నల్లతామర పురుగు ఆశించి, పంటంతా తుడుచుపెట్టుకుపోయింది.

రుణాల రీషెడ్యూల్ ఇంకెప్పుడు?

- కరువు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల రైతుల దైన్యం
- వరుస విపత్తులు, నష్టాలతో అప్పుల ఊబిలోకి..
- కౌలురైతుల పరిస్థితి మరీ దారుణం
- ఈ ఏడాదైనా సాయం అందుతుందని కొండంత ఆశ
- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనైనా ప్రకటిస్తారో లేదో?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయాన్ని పండగ చేస్తున్నామని, రైతును చేయి పట్టుకుని నడిపిస్తామంటూ ప్రగల్భాలు పలికిన ప్రభుత్వ పెద్దలు.. రుణమాఫీ చేయలేకపోయినా, రుణాల రీషెడ్యూల్ అయినా చేస్తారని రైతులు కొండంత ఆశతో ఉన్నారు. గత నాలుగేళ్లు ఎంతిచ్చినా, ఎంత మందికి ఎగనామం పెట్టినా, ఈ ఏడాదైనా సాయం చేస్తారని ఎదురుచూస్తున్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రీషెడ్యూల్ ఊసే ఎత్తకపోవడంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

రాష్ట్రంలో కరువు, తుఫాన్.. వంటి వరుస విపత్తులతో నష్టాలపాలైన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా కౌలురైతులు సాగు కోసం చేసిన బాకీలు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడే దుస్థితి నెలకుంది. జగన్ సర్కార్ గొప్పగా చెప్పే సున్నావడ్డీ రాయితీ, పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసా-పీఎంకిసాన్ పథకాల లబ్ధిని నెలలు గడుస్తున్నా, రైతుల ఖాతాలకు చెల్లింపులు జరపలేదు. ఈ ఏడాది కరువు, తుఫాన్‌తో పంటలు దెబ్బతిని, రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని కేంద్రబృందాలు గుర్తించినా.. కనీసం పంట రుణాల రీషెడ్యూల్‌కు కూడా ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోవడం పట్ల రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. గత నాలుగేళ్ల పరిస్థితి పక్కనబెడితే ఈ ఏడాదైనా సర్కార్ సాయం చేస్తుందని రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. పంట రుణాలు రీషెడ్యూల్ చేయడం వల్ల ఈ ఏడాది రైతులకు ఉపశమనం కలుగుతుంది. రానున్న రోజుల్లో విడత వారీగా చెల్లించే వెసులుబాటు ఉంటుంది. లేకపోతే.. వచ్చే నెల(మార్చి) నాటికి పంట రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు, సహకార సంఘాల అధికారులు రికవరీ కోసం రైతులకు నోటీసులిచ్చి, ఒత్తిళ్లు పెంచే అవకాశం లేకపోలేదు.

కరువు మండలాలు 103 మాత్రమే...

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 440 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉంటే, కేవలం 103 మండలాలనే కరువు ప్రభావిత మండలాలుగా జగన్ సర్కార్ గుర్తించింది. వర్షాభావం వల్ల ఖరీఫ్‌లో 90లక్షల ఎకరాలకు 62.45లక్షల ఎకరాలే సాగయ్యాయి. దాదాపు 27వేల ఎకరాలు ఖాళీ విత్తనమే పడలేదు. రబీలో 57.5లక్షల ఎకరాలకు, ఇప్పటి వరకు 35లక్షల ఎకరాలే సాగులోకి వచ్చాయి. రబీలోనూ వర్షాభావం కొనసాగుతోంది. దీంతో సాగునీటికి గ్యారెంటీ లేక, పెట్టుబడులు పెరిగి, విపత్తుల భయంతో చాలా మంది రైతులు సాగుకు దూరమవుతున్నారు. ఉద్యాన రైతుల పరిస్థితి ఇంతే ఉంటోంది. ఈ నేపథ్యంలో రైతులకు అందించే సాయంలో జాప్యం జరిగితే, రైతులు అప్పులపాలవ్వాల్సి వస్తోంది. కనీసం కరువు మండలాల రైతులకైనా ఇంత వరకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందలేదు. పంటల బీమా పరిహారం ఇవ్వలేదు. రూ.లక్షలోపు రుణాలు తీసుకునే సన్నచిన్నకారు రైతుల నుంచి వడ్డీతో సహా వసూలు చేసిన సర్కార్.. రెండేళ్ల నుంచి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను రైతుల ఖాతాలకు తిరిగి జమ చేయలేదు. రైతుభరోసా, పీఎం కిసాన్ మూడో కిస్తీ పంట కోసే నాటికే ఇస్తామని చెప్పి, రబీ పంటలు కోసే సమయం దగ్గర పడ్డా ఇవ్వలేదు.

ఇదీ బ్యాంకుల వార్షిక ప్రణాళిక తీరు!

2023-24 బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళికలో స్వల్పకాలిక పంట రుణాలు రూ.లక్షా48వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు వచ్చినా, లక్ష్యాన్ని చేరుకోలేదు. ఖరీఫ్‌లో స్వల్పకాలిక పంట రుణాలు రూ.82వేల కోట్లతో 56%, దీర్ఘకాల రుణాల్లో రూ.43వేల కోట్లుతో 58% మాత్రమే బ్యాంకర్లు రుణాలిచ్చాయి. రబీలో కూడా రుణ లక్ష్యాలు చేరుకోలేదని బ్యాంకర్లే చెప్తున్నారు. ఏడాది మొత్తంగా 3లక్షల మంది కౌలురైతులకు రూ.4వేల కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా, లక్ష మందికి కూడా పంట రుణాలు అందలేదు. సాగుదారు హక్కు పత్రాలు మాత్రం 8లక్షల మందికి పైగా జారీ చేసినా, రుణాలు, రాయితీలు మాత్రం కౌలురైతులందరికీ అందట్లేదు. ఈ ఏడాది కరువు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో లక్షలాది రైతులు పంట నష్టాలు చవిచూశారు. ఈ ఏడాది బ్యాంకులు, సహకార సంఘాలు ఇచ్చిన పంట రుణాల్లో దాదాపు సగం దాకా వర్షాభావం, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల రైతులే ఉన్నారని రైతు సంఘాలు అంచనా వేస్తున్నాయి. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనైనా రుణాలు రీషెడ్యూల్ ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు.

నివాసాల చెంతనే అక్రమంగా గోవధ

- ఇద్దరు వైసీపీ నాయకుల అరెస్ట్
- అనుమతి లేకుండా కబేళా నిర్వహణ
- కాపాడేందుకు ప్రయత్నించిన ఎంపీ భరత్?
- వార్త వైరల్ కావడంతో సహకరించని పోలీసులు
- రాజమహేంద్రవరంలో కలకలం



ఎంపీతో హబీబుల్లా ఖాన్(మెడలో వైసీపీ కండువా ఉన్న వ్యక్తి)

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అధికారం అండగా ఉంటే ఏదైనా చేయొచ్చన్నది వైసీపీ నాయకుల నైజం. అక్రమంగా గోవధ కబేళాను కూడా నిర్వహించేస్తున్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో వైసీపీ నేతలు నిర్వహిస్తున్న ఆ కేంద్రంపై పోలీసులు దాడి చేసి ఒక మూగ జీవాన్ని బతికించారు. నిందితులను వెనకేసుకొస్తూ ఎంపీ భరత్‌రామ్ పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాంపేట ప్రాంతంలోని మదన్‌సింగ్‌పేటలో జనా వాసాల మధ్య వైసీపీ నాయకుడు హబీబుల్లా ఖాన్ రేకులతో షెడ్లు వేసి గోమాంస కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. దుర్వాసనతో స్థానికులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడంలేదు. ఆదివారం రాష్ట్రీయ గో రక్షా వాహిని గో సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు వైష్ణవ్ దినేశ్ సంఘ్ సభ్యులతో అక్కడికి వెళ్లి 112కి ఫోన్ చేయగా, వెంటనే వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వధించిన ఒక గోవు కళేబరం అక్కడ ఉండగా.. వధించడానికి సిద్ధంగా ఉన్న మరో గోవును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేంద్రాన్ని నడుపుతున్న వైసీపీ నాయకులైన హబీబుల్లాఖాన్, మహమ్మద్ షఫీవుల్లాను అదుపులోకి తీసుకున్నారు. ఐపీసీ సెక్షన్ 429 రెడ్ విత్ 34, జంతువులపై క్రూరత్వ నిషేధ చట్టంలోని సెక్షన్ 11(1)(ఎ) ప్రకారం కేసు నమోదు చేశారు. ఎంపీ భరత్ రామ్ పోలీసులకు ఫోన్ చేసి తమ నాయకులపై కేసు లేకుండా 'సర్దుబాటు' చేయాలని చెప్పారని తెలుస్తోంది. అయితే అప్పటికే విషయం వైరల్ కావడంతో పోలీసులు చేతులెత్తేశారు. దీంతో పోలీసులపై ఎంపీ మండిపడ్డారని సమాచారం.

సీఎం హామీల అమలు ఇంకెప్పుడు..?

- రాష్ట్రంలో 16 లక్షల మంది ఉద్యోగుల్లో అసంతృప్తి
- డీఏలు, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలి
- రాష్ట్రంలో ఈహెచ్‌ఎస్ కార్డులూ పనిచేయని దుస్థితి
- ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయవాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 16 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు దాచుకున్న సొమ్ముతోపాటు, డీఏలు, పీఆర్సీ బకాయిలు చెల్లించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని, ఇంకెప్పుడు చెల్లిస్తారని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగులు దాచుకున్నవి, డీఏ సొమ్ములు కలిపితే రూ.6,700 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. పీఆర్సీ బకాయిలు మరో రూ.6,800 కోట్లు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో హెల్త్ కార్డులు కూడా పనిచేయని దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో తక్షణమే సమావేశం ఏర్పాటుచేసి ఉద్యోగులు, పెన్షనర్లలో ఉన్న ఆందోళనను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీజేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్యపై ప్రభుత్వం స్పందించకపోతే ఎలా?

ప్రభుత్వ ఉద్యోగులపై వరుసగా దాడులు, హత్యలు జరుగుతున్నా జగన్ సర్కారు వారి రక్షణ, భద్రత కోసం ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం దారుణమని బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్‌ఎస్‌ఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. విశాఖపట్నంలో హత్యకు గురైన తహసీల్దార్ రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొప్పరాజు మాట్లాడుతూ 2019 సాధారణ ఎన్నికల సందర్భంగా తహసీల్దార్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు ఖర్చు పెట్టిన వాటికి ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికలకు రూ.1,200 కోట్లు ఖర్చవుతుందని ఎన్నికల సంఘం చెబితే, ప్రభుత్వం రూ.200 కోట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు. ఒకపక్క దాడులు, హత్యలతో భయాందోళనలు, మరోపక్క ఆర్థిక సమస్యలతో విలవిల్లాడుతున్న ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు.

నాలుగో తరగతి ఉద్యోగాలు వెంటనే భర్తీచేయాలి



ఎన్నికైన ఉద్యోగ సంఘాల నేతలతో బండి శ్రీనివాసరావు

విజయవాడ, ఫిబ్రవరి 4: ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పనిభారం తగ్గించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కిన చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికీ అండగా ఉంటానన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వీఎస్ సాయిరాం, బీవీ రమణారెడ్డి, చదువుల గోపాలకృష్ణను ఎన్జీవో, నాలుగో తరగతి ఉద్యోగ సంఘాల నాయకులు సత్కరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.